



పార్టీ నేతల పనితీరుపై సర్వే

టీడీపీ అధిష్ఠానం పార్టీలో సీనియర్ నాయకుల గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేపట్టింది. ఆ మేరకు పార్టీ సభ్యత్వం ఉన్న వారిని ఆయా స్థాయిల వారీ విభజిస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ సభ్యులుగా ఉన్న వారందరికీ ఆన్‌లైన్ విధానంలో ఒక సమాచారం పంపి అందులో మీ గ్రామంలోని నాయకుల్లో ఎవరు గత ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేశారో తెలపండి అని కోరుతోంది. అలాగే పార్టీ మండల కమిటీల్లో ఉన్న నాయకుల పేర్లను తెలియజేసి వారిలో ఎవరు బాగా పనిచేశారని తెలుసుకుంటోంది. నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీ సభ్యులకు ఒక సమాచారం పంపి ఆ కమిటీలో ఎవరు ఉత్తములో చెప్పాలని అడుగుతున్నట్లు సమాచారం. ఇదే విధానంలో జిల్లాస్థాయి టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుల్లో ఎవరు పార్టీ కోసం పనిచేశారో, చేయలేదో తెలుసుకుంటోంది. ఇలా గుర్తించిన నాయకుల పేర్లు ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాలో ఉన్నాయో లేదో చూసి తదనుగుణంగా నామినేటెడ్ పదవుల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్‌ల నియామకంలో ఇప్పటికే ఒక పరిశీలన చేపట్టిన టీడీపీ.. కిందిస్థాయి పదవుల విషయంలో చేయిస్తున్న సర్వే ఎంతమేరకు సఫలీకృతమవుతుందో చూడాల్సి ఉంది.

అధికారులు, ఉద్యోగుల బదిలీలు.. నామినేటెడ్ పదవులు, ఇతర అంశాలపై టీడీపీ ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తోంది. సరికొత్త పంథాతో ముందుకెళ్తోంది. గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి అక్రమాలకు పాల్పడిన అధికారులను నిరోధించడం, టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా జిల్లాస్థాయి అధికారుల పోస్టింగ్‌లు, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీల నియామకాలను రాష్ట్రస్థాయిలోనే పూర్తిచేస్తోంది. సీఐ, ఎస్సై, తహసీల్దార్ లాంటి అధికారుల పోస్టింగ్‌ల విషయంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు పెత్తనం ఇచ్చినప్పటికీ వారు సూచించిన అధికారులపై మళ్లీ పరిశీలన చేపడుతోంది. గత పనితీరు ఆధారంగా కొందరి విషయంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలను సైతం పక్కనపెడుతోంది. నియోజకవర్గస్థాయిలో రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏల నియామకాలకు సంబంధించి ఎమ్మెల్యేలకు పూర్తి ప్రాధాన్యం ఇచ్చి నామినేటెడ్ పదవుల విషయంలో మాత్రం ప్రత్యేక విధానానికి శ్రీకారం పలికింది. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలోని టీడీపీ నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టింది.

ప్రత్యేక పంథా

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ గతంలో ఎన్నడూలేని విధంగా ఈ పర్యాయం సరికొత్త విధాలను అనుసరిస్తోంది. ఇటు అధికారుల బదిలీల నుంచి అటు పార్టీ నేతలకు పదవుల పందేరం వరకూ నిర్ధిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తోంది. అందులో కొన్ని అంశాలతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు విభేదిస్తున్నారు. ఆ విషయాన్ని కొందరు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లగా వారు చెప్పినది సరైనదైతే వారి మాటకే ప్రాధాన్యం ఇస్తోంది. లేనిపక్షంలో తమ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చిచెబుతోంది.

అధికారుల విషయంలో ద్విముఖ వ్యూహం

అధికారుల నియామకాల్లో టీడీపీ ప్రభుత్వం ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. జిల్లాస్థాయిలో కలెక్టర్, ఎస్పీలతోపాటు కొన్ని ముఖ్యమైన శాఖల అధికారుల నియామకాలను పూర్తిగా రాష్ట్రస్థాయిలోనే చూస్తోంది. మంత్రులకు మాత్రమే ముందస్తు సమాచారం ఇస్తోంది. ఆర్డీవో, డీఎస్పీ లాంటి అధికారుల నియామకాల విషయంలోనూ రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం జరిగిపోతోంది. అదేసమయంలో సంబంధిత అధికారుల పూర్వాపరాలపై టీడీపీ అధిష్ఠానం వివిధ రూపాల్లో పరిశీలన చేపడుతోంది. అందుకు కొన్ని ప్రత్యేక సంస్థల ద్వారా సమాచారం సేకరించుకుంటున్నట్లు తెలిసింది. టీడీపీకి అనుకూలంగా ఉన్న సీనియర్ అధికారులు, విశ్రాంత అధికారుల నుంచి కూడా సమాచారం తెలుసుకుంటోంది. అలా పైస్థాయి అధికారులను ఎంపిక చేసి పోస్టింగ్‌లు ఇస్తున్న కూటమి ప్రభుత్వం మరోవైపు కిందిస్థాయి అధికారుల విషయంలోనూ ఒక ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు లేక ముఖ్యమైన నాయకులు కిందిస్థాయి పోస్టులకు ఎవరినైనా సిఫార్సు చేస్తే పూర్తిస్థాయిలో ఆ అధికారుల విషయాన్ని పరిశీలించి సమంజసమైతే గ్రీన్‌సిగ్నల్ ఇస్తోంది. లేదంటే తిరస్కరిస్తోంది.

డీఎస్పీల విషయంలోనూ అక్కడే నిర్ణయం

జిల్లాలోని ఒక కీలకమైన డీఎస్పీ నియామకం విషయంలో అధిష్ఠానం ఒక పేరు సూచిస్తే సదరు ఎమ్మెల్యే తనకు కావాల్సిన అధికారి పేరును సిఫార్సు చేయడమే కాక అతన్నే వేయాలని పట్టుబట్టారు. 'పోలీసు శాఖలో ఉన్నతాధికారి ద్వారా మీరు సూచించిన డీఎస్పీ మంచివారే, అతనికి వేరే చోట పోస్టింగ్ ఇస్తున్నాం.' అని అధిష్ఠానం సమాచారం పంపినట్లు తెలుస్తోంది. ఆయన ససేమిరా అనడంతో చివరికి ఎమ్మెల్యే చెప్పిన వారికే పోస్టింగ్ ఇచ్చారు. మరో డీఎస్పీని రెండు నియోజకవర్గాల నాయకులు కోరుకున్నా తమ వద్ద ఉన్న సమాచారంతో అధిష్ఠానం ఆయన్ను పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు పంపింది. సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్లు ఇతరత్రా కిందిస్థాయి ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేల సిఫార్సులకే ప్రాధాన్యం ఇస్తోంది. ఆ విషయంలోనూ ముందు ఎస్పీలు, ఆపైన ఐజీలతోపాటు నిఘా విభాగం నుంచి సమాచారం సేకరించుకుంటున్నారు. తదనుగుణంగానే ఎమ్మెల్యేలు సూచించిన సీఐ, ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇస్తున్నారు. వారి పరిశీలనలో ఎమ్మెల్యేలు సూచించిన వారిలో ఎవరిపైన అయినా వ్యతిరేక నివేదిక వస్తే వారికి పోస్టింగ్‌లు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఏర్పడి ఎమ్మెల్యేలు బాధ్యతలు చేపట్టి దాదాపు రెండు నెలలు అవుతున్నా బదిలీల వ్యవహారం జాప్యం కావడానికి ఇదే కారణమని భావిస్తున్నారు.

- అధికారుల పోస్టింగ్‌లపై కూటమి ప్రభుత్వం నిఘా, పరిశీలన
- రాష్ట్రస్థాయిలోనే ఆర్డీవోలు, డీఎస్పీల నియామకాలు
- సీఐ, ఎస్సై, తహసీల్దార్, ఇతర ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేలకు పవర్
- పనితీరు బాగోలేకపోతే చెక్
- పార్టీ నేతలకు పదవుల పంపకంపై సర్వేలు
- నియోజకవర్గానికి వంద మంది టీడీపీ నాయకుల పేర్లు తీసుకొని ఆరా
- అభిప్రాయ సేకరణకు శ్రీకారం

నామినేటెడ్ పదవుల విషయంలోనూ ప్రత్యేక విధానం

నామినేటెడ్ పదవుల విషయంలోనూ టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక విధానాన్ని అవలంబిస్తోంది. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన, చేస్తున్న నాయకులు ఎవరు అన్న విషయాన్ని గుర్తించేందుకు ప్రత్యేక పరిశీలన చేపట్టింది. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల విషయంలో ఎలా ఉన్నా జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవులపై జిల్లా నాయకులు, ఎమ్మెల్యేలకు పూర్తి అధికారం గతంలో ఇచ్చేవారు. ఈసారి అలాకాకుండా ప్రతి నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవులు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉన్న వందమంది పార్టీ నాయకుల పేర్లు ఇవ్వాలని అధిష్ఠానం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులను కోరినట్లు తెలిసింది. ఆ మేరకు కొందరు ఎమ్మెల్యేలు పేర్లు ఇస్తూనే నియోజకవర్గస్థాయిలో కీలకంగా ఉండే మార్కెట్ కమిటీలు, దేవస్థానాలకు సంబంధించిన పదవులకు ప్రత్యేకంగా కొంతమందిని సూచిస్తున్నట్లు తెలిసింది. కొందరైతే మీరే తుదినిర్ణయం తీసుకునే పరిస్థితుల్లో మేము ఒక పేరు ఇచ్చి మరొకరి పేరు ఇవ్వలేదన్న అపవాదు పొందటం ఇష్టం లేదని చెప్తూ అసలు పేర్లు ఇచ్చేందుకే సిద్ధపడలేదని తెలిసింది.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- ఎస్వీ వర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం
- తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం
- ఆరునెలల గర్భం.. అర్ధరాత్రి తీవ్ర అనారోగ్యం
- రిమ్స్‌కు తరలింపు.. ఆపై కనిపించని ప్రియుడు
- అబార్షన్ మందుల వల్లే అంటున్న తల్లిదండ్రులు


ప్రియాంక (ఫైల్)

లోపలి పేజీల్లో..

అంటకాగిన సీఐలకు బ్రేక్

- వైసీపీ హయాంలో అడ్డగోలుగా పనిచేసిన వారికి అవకాశం ఇవ్వని కూటమి ప్రభుత్వం
- ఆరోపణలు లేని ఒకరిద్దరికి మాత్రమే చాన్స్
- జిల్లాలో కొన్ని పోస్టింగ్‌లలో జాప్యానికి అదే కారణం

లోపలి పేజీల్లో..


ఒంగోలులో కురుస్తున్న వర్షం

ఉపశమనం

- మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత
- తర్వాత జల్లులతో ఊరట

ఒంగోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం భిన్న వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం వరకు అంతటా ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం పలుచోట్ల జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షం కురవడంతో ప్రజానీకం కాస్తంత ఊరట చెందింది. అదే సమయంలో పట్టణ ప్రాంతంలో ప్రత్యేకించి ప్రజానీకం ఎక్కువగా వీధుల్లో ఉండే వేళ జల్లులు పడటంతో ఇబ్బందిపడ్డారు జిల్లాలో వారం పదిరోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉంది. సాధారణం కన్నా గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఐదారు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. శనివారం కూడా అలాంటి పరిస్థితే మధ్యాహ్నం వరకూ ఉంది. ఒంగోలులో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.0 డిగ్రీలు నమోదు కాగా చాలాప్రాంతాల్లో అదేస్థాయిలో ఎండలతోపాటు ఉక్కపోత కొనసాగింది. అయితే సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. పలుప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు, కొండపి, జరుగుమల్లి, కనిగిరి, గిద్దలూరు, కురిచేడు, పొదిలి, ముండ్లమూరు, కేకేమిట్ల తదితర మండలాల్లో ఒక మోస్తరు వాన కురిసింది. తీవ్ర ఎండలతో ఇక్కట్లు పడుతున్న ప్రజానీకానికి తాజా వర్షం ఉపశమనం ఇచ్చింది. వాడుముఖం పట్టిన పైర్లకు ప్రాణం పోసింది. అదేసమయంలో పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకించి ఒంగోలు నగరంలో ప్రజానీకం అవస్థలు పడ్డారు. జనం రద్దీ ఉండే సమయంలో వర్షం పడటంతో ప్రధాన వీధుల్లో నీటి ప్రవాహం పెరిగి వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. నగరంలోని ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ నిలిచిపోయింది.

నోట్లో మద్యం పోసి.. గొంతుకు తాడు బిగించి..!

- ప్రియుడితో కలిసి భర్తను హత్యచేయించిన భార్య
- రూ.2లక్షలు సుపారీ
- ఆ ఇద్దరితోపాటు నలుగురు కిరాయి హంతకుల అరెస్టు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

లోపలి పేజీల్లో..


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

99 ఎస్ఎంసీల ఎన్నికకు నోటిఫికేషన్

- రేపు తుది ఓటర్ల జాబితా
- 17న ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక

ఒంగోలు(విద్య), ఆగస్టు 10 : జిల్లాలో వివిధ మండలాల్లోని 99 పాఠశాలలకు యజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఏర్పాటుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు శనివారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మొదట షెడ్యూల్ ప్రకారం జిల్లాలో 2,405 ఎస్ఎంసీ కమిటీల ఏర్పాటుకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే కోరం లేకపోవడం, ఇతర కారణాలతో 99 చోట్ల ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఆ పాఠశాలల్లో మళ్లీ ఎన్నికల నిర్వహణకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ తాజా షెడ్యూల్‌ను ప్రకటించారు. దీని ప్రకారం జిల్లాలో 67 ప్రాథమిక, 15 ప్రాథమికోన్నత, 17 హైస్కూళ్లలో హెచ్ఎంలు శనివారం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మధ్యాహ్నం ఓటర్ల జాబితాను విడుదల చేసి పాఠశాల నోటీసు బోర్డులో పెట్టారు. సోమవారం అభ్యంతరాలు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించి అదేరోజు సాయంత్రానికి తుది జాబితాను ప్రకటిస్తారు. 17వతేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకుంటారు. అదేరోజు మధ్యాహ్నం ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకుని తర్వాత ఎస్ఎంసీ మొదటి సమావేశం నిర్వహిస్తారు.


చరణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి విజయ


గౌతమ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఈత.. కడుపు కోత

- గుంతలోకి దిగి ఇద్దరు విద్యార్థులు మృతి
- డీవీపాలెంలో విషాదం

పామూరు, ఆగస్టు 10 : ఈత సరదా ఇద్దరు విద్యార్థుల ఉసురు తీసింది. వారి తల్లిదండ్రులకు కడుపు కోతను మిగిల్చింది. ఈఘటన శనివారం డీవీపాలెంలో చోటుచేసుకుంది. పామూరు పంచాయతీ పరిధిలోని డీవీ పాలెంలో నివాసం ఉంటున్న పసుపులేటి నారాయణ, విజయ దంపతుల కుమారుడు చరణ్ (18), స్థానిక విరువూరు రోడ్డులో నివాసం ఉంటున్న పసుపులేటి వెంకటేశ్వర్లు, సుజాతల ఏకైక కుమారుడు గౌతమ్ (18) స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. రెండో శనివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో సరదాగా ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి డీవీ పాలెం సమీపంలోని పామూరు పాతచెరువులో ఉన్న నీటి గుంతలోకి దిగారు. ఈత కొట్టిన అనంతరం అందరూ బయటకు వచ్చారు. ఈక్రమంలో గౌతమ్ బురదలో ఇరుక్కొని బయటకు రాలేకపోయాడు. దీన్ని గుర్తించిన చరణ్.. స్నేహితుడిని కాపాడేందుకు మళ్లీ గుంతలోకి దిగాడు. ఈత వచ్చిన చరణ్‌ను ఈత రాని గౌతమ్ గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ ఊపిరాడక మునిగి మృతి చెందినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. వారంతా వచ్చి పాలెంలో సమాచారం ఇవ్వడంతో ఇద్దరు విద్యార్థుల కుటుంబ సభ్యులు, స్థానికులు నీటి గుంత వద్దకు చేరుకొన్నారు. సమాచారం అందుకొన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. స్నేహితుడు వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన తన కుమారుడు విగతజీవుడిగా మారడంతో గౌతమ్ తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, సుజాత గుండెలవిసేలా రోధిస్తున్నారు. చరణ్ మృతదేహం వద్ద తల్లి విజయ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకొన్న కనిగిరి డీఎస్పీ ఎం.రామరాజు, పామూరు సీఐ ఎం.రామనాయక్, ఎస్ఐ సైదుబాబు గ్రామానికి చేరుకొని మృతదేహాలను, గుంతను పరిశీలించారు.

నగరం ఉక్కిరిబిక్కిరి..!



గాంధీరోడ్డులో శనివారం సాయంత్రం భారీగా నిలిచిన ట్రాఫిక్

ఏ రోడ్డులో చూసినా వాహనాల బారులు
అడ్డదిడ్డంగా రాకపోకలతో స్తంభిస్తున్న ట్రాఫిక్
ఇబ్బందిపడుతున్న ప్రజలు
సమస్యపై దృష్టి సారించని అధికారులు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 11: ఒంగోలు నగరంలో ప్రయాణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ రోడ్డులో చూసినా వాహనాల బారులే కన్పిస్తున్నాయి. దీంతో ఒక వీధి నుంచి మరో వీధిలోకి వెళ్లాలన్నా, అలాగే ప్రధాన రహదారులను, రద్దీ ప్రాంతాలను తప్పించుకుని వెళ్లాలంటే గంటల సమయం పడుతోంది. దీంతో నగరంలో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. నగరంలో మొత్తం 3లక్షలకు పైగా జనాభా ఉంది. అందుల సుమారు 80శాతం మందికిపైగా వాహన వినియోగదారులు ఉన్నారు. దానికితోడు జిల్లా కేంద్రం కావడంతో ఇతర ప్రాం తాల నుంచి వివిధ పనుల నిమిత్తం విచ్చేసేవారు వందల సంఖ్యలోనే ఉంటారు. ఈక్రమంలో నగరలో రోడ్లు బాగా రద్దీగా ఉంటున్నాయి. అసలే ఇరుకైన రహదారులు, ఆపై ఆక్రమణలు, దానికి తోడు వీధి వ్యాపారుల తోపుడు బండ్ల కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నది. పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్ చక్రబంధంలోని బయట పడే మార్గం కనిపించడం లేదు. దీంతో ఏదారి చూసినా ట్రాఫిక్ సమస్యలే కనిపిస్తాయి. ప్రధాన రహదారుల జంక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ యంత్రాంగం సమస్యను నియంత్రించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా కార్పొరేషన్ హోదాకు అనుగుణంగా రహదారులు విస్తరణ చేపట్టాల్సి ఉంది. గత పదేళ్ళ క్రితం కర్నూలు రోడ్ విస్తరణ పనులు చేపట్టగా ట్రంక్‌రోడ్, గాంధీరోడ్, పప్పుబజార్, కన్యకాపరమేశ్వరీ వీధి, మంగమూరురోడ్, పాత మార్కెట్ సెంటర్, పత్తివారి వీధి, ఇలా పలు ప్రాంతాలలో రహదారుల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రతరం అవుతోంది. కాగా శనివారం గాంధీరోడ్‌లో సుమారు 15 నిమిషాలపాటు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కనీసం పాదచారులు కూడా కదిలే పరిస్థితి లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడాల్సి వచ్చింది.

ఏళ్ల నాటి ఇరుకైన రహదారులు..

1876లో మునిసిపాలిటీగా ఏర్పడిన ఒంగోలు అనాటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ కార్పొరేషన్ కిరీటాన్ని దక్కించుకుంది. అంతేగాకుండా జిల్లా కేంద్రం కావడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ విద్యాసంస్థలు, పలు పెద్ద ఆసుపత్రులు, వివిధ వ్యాపార సముదాయాలకు ఒంగోలు కేం ద్రంగా మారింది. దీంతో కేవలం జనాభానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రోజు వచ్చిపోయేవారు వేల సంఖ్యల్లోనే ఉన్నారు. కాగా అందుకు అనుగుణంగా రహదారులు లేక ఇరుకైన రోడ్లు, ఆపై ఇరువైపులా ఆక్రమణలు చోటు చేసుకోవడంతో వాహన ప్రయాణం కన్నా, కాలినడకే నయం అన్నచందంగా మారింది. ప్రస్తుతం 25 స్క్వేర్ కి.మీ. కలిగిన నగరంలో 317 కి.మీ. రహదారులు ఉన్నాయి. అందులో సీసీరోడ్లు 197.70 కి.మీ, బీటీరోడ్లు 7.80 కి.మీ. డబ్ల్యూబీఎం రోడ్స్ 63.53 కి.మీ, కచ్చా రోడ్లు 46. కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. అయినప్పటికీ వాహన ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

పరిష్కారం వైపు దృష్టి సారించాలి

ట్రాఫిక్ సమస్య ఒక్కరోజుతో పోయేది కాదు. కానీ శాశ్వత పరిష్కారం వైపు యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా రహదారులపై నాలుగు చక్రాల వాహనాలు నిలిపివేత అరికట్టడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ లేకుండా చూడాల్సి ఉంది. అంతేగాకుండా రహదారులపై చిరువ్యాపారాలు చేసుకుంటున్న తోపుడుబండ్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపాల్సి ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో కార్పొరేషన్ అధికారులు వీధి వ్యాపారుల కోసం జోన్‌లు ఏర్పాటు చేయగా, వైసీపీ వచ్చాక వాటిని గాలికి వదిలేశారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం దృష్టి సారించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్న క్యాంటీన్లకు ఆర్థికసాయం



ఎమ్మెల్యే దామచర్లకు నగదును అందజేస్తున్న అజయ్‌బాబు, రవీంద్ర

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 11: ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో నగరంలో గత 55 రోజులుగా కొనసాగుతున్న అన్న క్యాంటీన్లకు ఆర్థిక సహాయం చేసేందుకు దాతలు ముందుకొస్తున్నారు. అధికారపూర్వకంగా ఈ నెల 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లలో రూ.5లకే నాణ్యమైన భోజనం అందిస్తుండగా, ఇప్పటి వరకు నగరంలోని నాలుగు క్యాంటీన్లలో ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. దీంతో పలువురు దాతలు తమవంతుగా ఆర్థిక చేయూతనందిస్తుండగా, శనివారం అమెరికాకు చెందిన ఐటీడీపీ నాయకులు మన్నే మనోజ్ రూ.50వేలును విరాళంగా అందజేశారు. అలాగే ఒంగోలుకు చెందిన బీజేపీ నాయకులు ఆర్.అజయ్‌బాబు, టీడీపీ నాయకులు ఆర్.రవీంద్ర చెరో రూ.25వేలును ఎమ్మెల్యే దామచర్లకు అందజేశారు.

శ్రీసరస్వతిలో ఘనంగా ఆటల పోటీలు ప్రారంభం



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు(విద్య), ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలో శనివారం ఆటల పోటీలను ఘనంగా ప్రారంభించారు. విద్యాసంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఆటల పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. ఈ స్పోర్ట్స్ వీక్ 2500 మంది విద్యార్థులకు అథ్లెటిక్స్ నిర్వహిస్తారని చెప్పారు. తొలిరోజు క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడానైపుణ్యాలను పెం పొందించుకునేందుకు ఈ స్పోర్ట్స్ వీక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, గంగా శంకర్‌రెడ్డి, సీఈవో ఎన్‌వీ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీస్టాంపుల కుంభకోణంపై విచారణ చేయాలి



ఎస్పీ దామోదర్‌కు బొకే అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10 : జిల్లా కేంద్రమైన ఒంగోలులో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నకిలీ స్టాంపులు, భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ కోరారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని ఏఆర్.దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా యోగయ్యయాదవ్ మాట్లాడుతూ ఒంగోలులో రూ.300 కోట్ల విలువైన నకిలీ స్టాంపులు, భూకుంభకోణం జరిగిందని, వీటన్నింటిని సీబీఐ విచారణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీమంత్రి బాలినేని శ్రీనివారెడ్డి సమయంలో సిట్ విచారణ చేసినా ఆయన కనుసన్నల్లోనే తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. వచ్చేనెల 7న వినాయకచవితి పండుగకు గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా అన్ని ప్రాంతాల్లో వినాయకుడి మండపాలకు అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఐ.సీతారామయ్య, పి.విజయారావు, సత్యవతి, అనిల్, పి.విజయ్, సుధాకర్, సంజీవ్‌కుమార్, కె.ఆంజనేయులు, రంగనాథ్, దేగా సురేష్, పి.కమలాకర్, కోలా వాసు పాల్గొన్నారు.

పేస్ విద్యార్థులు గుండ్లకమ్మ ప్రాజెక్టు సందర్శన

ఒంగోలు(విద్య), ఆగస్టు 10: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం విద్యార్థులు శనివారం గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.నాగమురళీమోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులు రిజర్వాయర్‌కు సంబంధించిన పరికరాలు, భాగాలు, వాటి పనితీరు, సంరక్షణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సందర్శనలు సివిల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, ఎం.రమణబాబు, గణేష్‌నాయుడు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేశాకే పని సర్దుబాటు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10: విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో 117ను రద్దు చేశాకే ఉపాధ్యాయుల పనిసర్దుబాటు చేయాలని బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో శనివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ డివిజనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి ఇచ్చిన హామీ మేరకు విద్యను నిర్వీర్యంచేస్తున్న జీవో 117ను రద్దు చేయాలన్నారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం మాట్లాడుతూ ప్రతి ప్రాథమికపాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మిరియాల వెలుగొండయ్య, పల్లె కృష్ణమూర్తి, కొప్పోలు కిషోర్, కొండమూరి కొండల రాయుడు, తిరుపతి స్వామి, చెక్క కోటేశ్వరరావు, అత్తలూరి నాగమల్లేశ్వరరావు, షేక్ ఫయాజ్, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న శాంతకుమారి

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 10: ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గొడుగుపాలెంలోని ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో డాక్టర్ చాపల శాంతకుమారి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కౌమార దశలో వచ్చే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ ధనలక్ష్మి, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, నాగండ్ల చిరంజీవి, సున్నపు తిరుపతి పాల్గొన్నారు.

ప్రియుడి మోజులో ఘాతుకం!

భర్త దారుణహత్య
నెల్లూరు కిరాయి హంతకులకు సుపారీ
వివాహేతర సంబంధమే కారణం
భార్యతో పాటు ఐదుగురు నిందితుల అరెస్టు
ఎస్పీ దామోదర్ వెల్లడి



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 10: ప్రియుడు మోజులో పడిన ఓ వివాహిత భర్తను దారుణంగా హతమార్చింది. అందుకు ప్రియుడితో కలిసి నెల్లూరుకు చెందిన సుపారీ గ్యాంగ్‌ను మాట్లాడుకున్నారు. పక్కా ప్రణాళికతో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయారు. ఈమేరకు ఆరుగురు నిందితులను పొదిలి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల గేలాక్సీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ దామోదర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 3న పొదిలిలో చల్లా వెంకటనరేంద్రబాబును భార్య లక్ష్మీప్రియ, తన ప్రియుడుతో కలిసి కిరాయిహంతకులను పిలిపించి హత్య చేయించింది. అయితే ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. పోలీసులు అత్యంత వేగవతంగా దర్యాప్తు చేసి కేసును చేధించారు. ఈ కేసులులో నిందితులైన హతుడు భార్య చల్లా లక్ష్మీప్రియ, ఆమె ప్రియుడు పొదిలి పీఎస్‌ఆర్‌కాలనీకి చెందిన కొండా శశికుమార్, నెల్లూరుకు చెందిన షేక్ నహీద్, షేక్ ఫజ్లు, సయద్‌సిద్దిక్, షేక్ ముబారక్‌లను పొదిలి సమీపంలో కాటూరివారిపాలెం వద్ద అనుమానాస్పదంగా ఉండగా శనివారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

హత్య జరిగిందిలా..

కేంద్ర ప్రభుత్వ ప్రావిడెంట్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చల్లా వెంకటనరేంద్రబాబు పొదిలిలోని పీఎస్‌ఆర్ కాలనీ 3వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. ఎనిమిదేళ్ల క్రితం లక్ష్మీప్రియతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. అయితే ఎనిమిది నెలల క్రితం లక్ష్మీప్రియకు అదే ప్రాంతంలో నివాసం ఉంటూ డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తున్న కొండా శశికుమార్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త వారి మధ్య వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం వెంకటనరేంద్రబాబుకు తెలిసి భార్యను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అయితే లక్ష్మీప్రియ మాత్రం తన భర్తను అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడుతో కలిసి పథకం రూపొందించారు. అదే సమయంలో నెల్లూరులోని నేతాజీనగర్‌కు చెందిన కిరాయి హంతకులను కలిసి హత్య చేసేందుకు రూ.2లక్షలు సుపారీ ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. రూ.50వేలు అడ్వాన్స్ ఇచ్చారు. ఈమేరకు లక్ష్మీప్రియ, శశికుమార్, మరో నలుగురు కిరాయి హంతకులు కలిసి ఈనెల 2వ తేదీన అర్ధరాత్రి నరేంద్రబాబు ఇంట్లో నిద్రిస్తుండగా గొంతుకు తాళ్లు వేసి లాగి దారుణంగా హత్య చేశారు. అంతేగాకుండా నోట్లో మద్యం పోశారు. అనంతరం తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది లక్ష్మీప్రియ. అయితే అనుమానించిన మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హత్య కేసును చేధించారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ

హత్య కేసును అత్యంత వేగంగా చేధించిన పొదిలి సీఐ మల్లిఖార్జునరావు, ఎస్సై జి.కోటయ్య, తర్లుపాడు హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, గౌతమ్‌కుమార్, రమేష్‌బాబు, వీరరాజులను ఎస్పీ దామోదర్ అభినందించారు. ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసును చేధించి హత్యకేసుగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న పోలీసులకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఘనంగా మాజీ మంత్రి శిద్దా జన్మదిన వేడుకలు

● భారీగా సేవా కార్యక్రమాలు



మనువడు విహన్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు(కలెక్టరేట్)/చీమకుర్తి, ఆగస్టు 10: మాజీమంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు, ఆయన మనమడు విహన్ పుట్టినరోజు శనివారం ఘనంగా జరిగాయి. చీమకుర్తిలోని శ్రీ హరిహరక్షేత్రంలో గోల్డెన్ గ్రానైట్ గిరి ఆధ్వర్యంలో శిద్దా రాఘవరావు దంపతులకు శిద్దా సుధీర్‌కుమార్‌లకు ఆలయ అర్చకులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం పూజలు చేశారు. శిద్దా రాఘవరావు దంపతులు, సుధీర్‌కుమార్‌లు కేక్ కట్ చేశారు. అనంతరం చీమకుర్తిలోని బధిరుల పాఠశాల విద్యార్థులకు, పేపర్ డెలివరీ బాయ్స్‌కు నూతన వస్త్రాలు, ప్రమాదంలో గాయపడిన యువకునికి ఆర్థికసాయంతో పాటు స్థానిక ఫొటోగ్రాఫర్ సుబ్బయ్యకు టీవీని బహూకరించారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలును అందజేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో పాటు పలువురు శిద్దాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు రావూరి కాశీరంగ జనార్దన్‌రావు, జలదంకి కృష్ణారావు, కొత్తూరి రంగనాయకులు, వాసవి సేవాదళ్ చైర్మన్ పెనుగొండ శ్రీను, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి చినిగేపల్లి సురేష్, గునుపూడి భాస్కర్, చలువాది బదరీనారాయణ, జిల్లా గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు అజీమ్, మండవ శ్రీను, మండవ గోపి, ప్రసాద్, గొట్టిపాటి రాఘవ, పెనుగొండ సుబ్బారాయుడు, బొమ్మిశెట్టి కిరణ్‌కుమార్, నూకల సురేంద్ర, గ్రంధి శ్రీహరి, హనుమంతరావు, డాక్టర్ జవహర్ తదితరులు శిద్దాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

శిద్దా నివాసంలో..

మాజీమంత్రి శిద్దారాఘవరావు జన్మదిన వేడుకలు స్థానికమంగమూరు రోడ్డులోని తన నివాసంలో శనివారం ఘనంగా జరిగాయి. బల్లికురవ లక్ష్మి గ్రానైట్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్‌కుమార్ కట్ చేశారు. ఒంగోలుకు చెందిన ప్రముఖులు శిద్దా పాండురంగారావు, శిద్దా బాలాజీ, శిద్దా సురేష్, భరత్, మంత్రి శ్రీనివాసరావు, టి.అరుణ, గుమ్మడి సాయిబాబు, జ్యోతి గ్రానైట్ సీవోవోఎం శివరాం, గుప్తాస్‌వీరబాబు, సివిల్ ఇంజనీర్ ఇలింద్ర సత్యనారాయణ, చలువాది హనుమంతరావు, అద్దంకి మురళీకృష్ణ, పమిడి వెంకట్రావు, గ్రంధి కార్తీక్, రావిపూడి లక్ష్మీనారాయణ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి

● ఎమ్మెల్యే బీఎన్



విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, యశ్వంత్‌అంబేడ్కర్

నాగులుప్పలపాడు, ఆగస్టు 10: దళిత, బడుగు, బలహీన వర్గాలు అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మిషన్ అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన 28.5 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం, బుద్ధ విగ్రహస్తూపంలను అంబేడ్కర్ మనువడు యశ్వంత్ అంబేడ్కర్, మాజీ కలెక్టర్ విజయ్‌కుమార్, మాజీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్‌లతో కలిసి శనివారం రాత్రి ఎమ్మెల్యే బీఎన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కుల నిర్మూలనతో పాటు సమానత్వ సమాజం కోసం కృషి చేసిన మహోన్నత పోరాట యోధుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని కొనియాడారు. సమానత్వ కలలు పండించిన మహనీయుడన్నారు. పేద కుటుంబంలో జన్మించిన అంబేడ్కర్ సమాజంలో అనేక ఆటు పోట్లను, సవాళ్ళను ఎదుర్కొని దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడ్డారని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి సాకారం చేయాలని సూచించారు. దళితులు రాజ్యాధికారం దిశగా గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. రాజ్యాంగం సమాన హక్కులు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని సమాజంలో ఉన్నతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఈదుమూడిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గ్లోబల్ రిపబ్లిక్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, అంబేడ్కర్ మనువడు యశ్వంత్ అంబేడ్కర్ ప్రారంభించారు.

ఉత్సాహంగా 2కే రన్



ర్యాలీలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులో శనివారం 2కే రన్ నిర్వహించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ఆధ్వర్యంలో స్థానిక గాంధీపార్కు వద్ద నుంచి ర్యాలీని ఏఎస్పీ అశోక్‌బాబు, సూదనగుంట బుజ్జి ప్రారంభించారు. ఈ ర్యాలీ లాయర్‌పేట, మంగమూరు రోడ్డు జంక్షన్, వీవీపీ రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ జగదీష్, అధ్యాపకులు, సుమారు 750మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కాంట్రాక్టు అధ్యాపకుల సేవలు పునరుద్ధరణ

ఒంగోలు(విద్య), ఆగస్టు 10 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను ప్రభుత్వం ఎట్టకేలకు పునరుద్ధరించింది. 2024-25 విద్యాసంవత్సరానికి రాష్ట్రంలోని 3,619 మంది కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను కొనసాగిస్తూ పాఠశాల విద్యాముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వీరి సేవలను జూన్ జూన్ 1నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మే నెలను నో వర్క్, నోపే కింద ప్రకటించి కాంట్రాక్టు అధ్యాపకులకు సంవత్సరంలో కేవలం 11నెలలకు మాత్రమే జీతాలు చెల్లిస్తారు. కాంట్రాక్టు అధ్యాపకుల ఆగిన రెగ్యులరైజేషన్ ప్రక్రియను కొనసాగించాలని కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ కె.సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల జిల్లా జేఏసీ చైర్మన్ విప్రభుదాస్, కోశాధికారి స్వర్ణలత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు(విద్య), ఆగస్టు 10: యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఒంగోలులోని యూటీఎఫ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబరులో కాకినాడలో 25వేల మంది ఉపాధ్యాయులతో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు కె.ఆదినారాయణ గౌరవాధ్యక్షుడు ఎ.రవి, సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, చిన్నస్వామి, నల్లూరి వెంకటేశ్వర్లు, బాలరాజు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10 : శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు జిల్లా అధ్యక్షుడు కె.విజయ్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో కులం, మతం, ప్రాంతం అనే అంశాలు వినాశకర ఘటనలు జరిగేందుకు కారణమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ జిల్లా కార్యదర్శి జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ విద్య సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు సైకిళ్ల పంపిణీ



సైకిల్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 10: అంగవైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు సుహారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15వేల విలువైన ఫిజియోథెరపీసైకిల్, 40 మంది పిల్లలకు నోట్ బుక్స్, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఒంగోలులోని ఎంపీపీఎస్-1 స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు అనీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తాహిద్, భువనేశ్వరి, కళ్యాణి, ఆదిలక్ష్మి తదితరులు సైతం విరాళాలు అందజేశారని ఫౌండేషన్ నిర్వాహకులు సాధనాల సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు తులసికుమారి, పద్మావతి, రమేష్, ఉష, వెంకట్‌రెడ్డి, బండారుపల్లి రవితేజ, భువనేశ్వరి, కళ్యాణి దాసరి శ్రీనివాస్, భాను, అవినాష్, రవితేజ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు ఉప విద్యాధికారిగా సుబ్బారావు

ఒంగోలు(విద్య), ఆగస్టు 10: ఒంగోలు ఉప విద్యాధికారిగా మైనంపాడు డైట్ సీనియర్ అధ్యాపకులు సామా సుబ్బారావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఈవో డి.సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ఉపవిద్యాధికారిగా పనిచేస్తున్న అనితా రోజ్‌రాణి అనారోగ్యంతో సెలవు పెట్టడంతో ఆ స్థానంలో సుబ్బారావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనితారోజ్‌రాణి సెలవును తిరిగి వచ్చేంత వరకు సుబ్బారావు బాధ్యతలు నిర్వర్తిస్తారు. డైట్ అధ్యాపకుడిగా తన రెగ్యులర్ బాధ్యతలు నిర్వహిస్తూనే ఉప విద్యాధికారిగా కూడా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉప్పుగుండూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 10 : మండల పరిధిలోని ఒమ్మెవరం, కండ్లగుంట గ్రామాల మీదుగా ఉప్పుగుండూరు వరకు అద్దంకి డిపో నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసును కొనసాగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. శనివారం అద్దంకిలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కరోనా విజృంభణ ముందు వరకు అద్దంకి డిపో బస్సు పమిడిపాడు, కండ్లగుంట, ఒమ్మెవరం గ్రామాల మీదుగా ఉప్పుగుండూరు వరకు కొనసాగిందన్నారు. కరోనా అనంతరం ఆ సర్వీసును నిలిపి వేయడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందువల్ల బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వారు కోరారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు, ఆగస్టు 10: కమ్యూనిస్టు మాదాసు కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా ఉప్పుగుండూరులో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక కాపుకళ్యాణ మండపంలో కాకాని శంకర్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యులు సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 140 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

బుద్దదేవ్ భట్టాచార్యకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10 : ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో శనివారం సీపీఎం పూర్వ పొలిట్ బ్యూరో సభ్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్దదేవ్‌భట్టాచార్యకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య మాట్లాడుతూ బుద్దదేవ్‌భట్టాచార్య ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ చాలా నిరాడబంరంగా జీవించారన్నారు. కార్యక్రమంలో నాయకులు జాలా అంజయ్య, పెంట్యాల హనుమంతరావు, జీవీకొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, జి.రమేష్, కె.రమాదేవి, జి.శ్రీనివాసులు, బి.రఘురాం, వి.బాలకోటయ్య, టి.తిరుపతయ్య పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం



అన్నదానం చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌దాస్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10: డొక్కా సీతమ్మ పేరుతో క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలు, నిరాశ్రయులకు నిరంతరాయంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమని ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్ పేర్కొన్నారు స్థానిక లాయర్‌పేటలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద శనివారం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు బాలనాగేంద్రయాదవ్ అడ్వకేట్ ఆరిగ శ్రీనివాసరావు, శీలంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శివం ఫౌండేషన్‌లో అన్నదానం

ఒంగోలు(కల్చరల్): మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలను స్థానిక శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు రూ.25 వేల ఆర్థికసహాయం, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శివం సంచార వాహనం ద్వారా 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, చిక్కాల కిరణ్‌కుమార్, కంది మురళి, మల్లవరపు శ్రీనివాసరావు, కొమ్మి శ్రీనివాసరావు, అవిశా హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 11: ఇటీవల కాలంలో మండుటెండలు.. ఉక్కపోతలతో అల్లాడుతున్న ఒంగోలు నగర ప్రజలకు ఉపశమనం లభించింది. శనివారం కురిసిన వానకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చల్లని వాతావరణంతో ఊరటచెందారు. చాలా రోజుల తర్వాత కురిసిన వానకు నగరం తడిసి ముద్దయింది. వీధులు జలమయంగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరుతోడై రోడ్లపై ప్రవహించి చెరువులను తలపించాయి.


మంత్రి స్వామి సమక్షంలో పార్టీలో చేరుతున్న సర్పంచ్ సత్య

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

● మంత్రి స్వామి

● పార్టీలో చేరిన బోగనంపాడు సర్పంచ్

పొన్నలూరు (కొండపి), ఆగస్టు 10 : టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి స్వామి ఇంటి వద్ద ఆయన సమక్షంలో బోగనంపాడు గ్రామ వైసీపీ సర్పంచ్ బడుగు సత్య టీడీపీలో చేరారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ గ్రామాలు, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి నాయకులు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, పార్టీ మండల నాయకుడు అనుమోలు సుధాకర్, బోగనంపాడు గ్రామ నాయకులు ముళ్లమూరి నితీష్ చౌదరి, పొన్నగంటి సుబ్బారావు, డబ్బుగొట్టు వెంకటేశ్వర్లు, దరిమడుగు అంకన్న, వంగపాటి మాచర్ల, ఉక్కలం బాలకృష్ణ, కోటయ్య, బిళ్లా తిరుమల తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసును విచారించకుండా కాలయాపన

● పోలీసులపై డీజీపీకి బాధితురాలి ఫిర్యాదు

టంగుటూరు, ఆగస్టు 10 : టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన చోరీ కేసును విచారణ చేయకుండా కాలయాపన చేశారంటూ గత సీఐ, ఎస్సైపై బాధితురాలు డీజీపీకి ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధి అరుంధతీవాడలోని కొమ్ము వెంకటరత్నమ్మ గృహంలో ఈఏడాది జనవరి 20న చోరీ జరిగింది. 33.4 సవర్ల నగలు, రూ.70వేల నగదును దొంగలు అపహరించుకెళ్లారు. ఈమేరకు బాధితురాలు టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే కేసు నమోదు చేయకుండా జాప్యం చేశారు. వారం రోజులు తిప్పి కులం పేరుతో దూషించి ఒంగోలు డీఎస్పీ ఆదేశాల మేరకు ఎట్టకేలకు జనవరి 26న కేసు నమోదు చేసినట్లు వెంకటరత్నమ్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దొంగలతో లాలూచీపడి కేసును విచారించకుండా వదిలేసిన అప్పటి సింగరాయకొండ సీఐ రంగనాథ్, టంగుటూరు పూర్వపు ఎస్సై ఖాదర్‌బాషాలపై శాఖాపరమైన చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని ఆమె డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. దీనిపై డీజీపీ ఆదేశాల మేరకు ఎస్పీ దామోదర్ స్పందించారు. కేసు విచారించి న్యాయం చేయాల్సిందిగా సింగరాయకొండ ప్రస్తుత సీఐ హజరత్తయ్యను ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐజక్ మాదిగ

30 ఏళ్ల పోరాటం ఫలించింది

● మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఐజక్

కొండపి, ఆగస్టు 10 : మాదిగలు చేస్తున్న 30 ఏళ్ల పోరాటం ఫలించిందని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్ అన్నారు. కొండపిలో శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి మాదిగల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆలోచనలకు అనుగుణంగా మాదిగలంతా పనిచేయాలని సూచించారు. ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగే సభకు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. మాదిగ ఉద్యోగుల సంఘ నియోజకవర్గ కన్వీనర్ బేతపూడి కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పూనూరి క్రిస్టఫర్, గురిజాల బాబూరావు, బొప్పూరి బ్రహ్మయ్య, రవిచంద్ర, విరాట్, రాజా, కార్తీక్, శ్యాంసన్, ప్రేమ్‌కుమార్, ప్రసాద్, కవిరాజు, జాలయ్య, నాని, సింహాద్రి జయరావు తదితరులు పాల్గొన్నారు.


బెల్లం రామకృష్ణను పరామర్శిస్తున్న సత్య

టీడీపీ నేతకు సత్య పరామర్శ

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 10 : మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లం రామకృష్ణ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య శనివారం సాయంత్రం చింతలపాలెం వెళ్లి రామకృష్ణను పరామర్శించారు. ఆయన వెంట పార్టీనాయకులు నలమోతు వెంకటేశ్వర్లు, దగ్గుమాటి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

13న కొండపిలో విద్యుత్ అదాలత్

కొండపి, ఆగస్టు 10 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక పొదిలి రోడ్డులోని కల్యాణ మండపంలో ఈనెల 13న అదాలత్ నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఈఈ (ఆపరేషన్ డివిజన్) ఎ.వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు, సింగరాయకొండ.. కందుకూరు నియోజకవర్గంలోని కందుకూరు, వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాలకు చెందిన వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

కొండపి ప్రాంతంలో ఓ మోస్తరు వర్షం

కొండపి ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే రైతులు బెట్ట దుక్కులు దున్ని ఉన్నారు. నువ్వు, జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట పైర్లు వేసిన రైతులు కూడా తమ పొలాలను కలియదున్ని పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఆ భూముల్లో ప్రస్తుతం సాగుకు సానుకూల పరిస్థితి ఏర్పడింది. ఎర్రనేలల్లో ఇప్పటికే వేసిన కందికి ప్రస్తుత వర్షం జీవం పోసింది.

నేడు కొండపిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి పరిధిలోని కొండపి, ముక్కోడిపాలెం, దాసరెడ్డిపాలెం గ్రామాల్లో ఆదివారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కుంచాల కోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లైన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పరిశీలన

కొండపి, ఆగస్టు 10 : మండలంలోని నెన్నూరుపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా ఉపవైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాధవీలత పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లోనూ రద్దులే..!

» మారని అద్దంకి ఆర్టీసీ అధికారుల తీరు

» ప్రయాణికుల ఇక్కట్లు

అద్దంకి, ఆగస్టు 10 : ప్రయాణికుల సేవలను మరిచి ఆర్టీసీ అధికారులు ఆదాయమే మిన్న అన్న విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఆషాడమాసం పేరుతో కలెక్షన్‌లు లేవని, పలు రూట్లలో తరచూ బస్సులను రద్దు చేసిన అధికారులు శ్రావణమాసం ప్రారంభమై పెళ్లిళ్ల సీజన్‌లోనూ అదే పంథాను కొనసాగిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బస్సుల రద్దుపై ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుకెళ్లినా ఆర్టీసీ అధికారులు మాత్రం మా దారి మాదే అన్న విధంగా వ్యవహరిస్తుండడం పట్ల ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మిగిలిన డిపోలలో కొత్త రూట్లలో బస్సుల ఏర్పాటుపై ప్రయోగాలు చేస్తూ ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, అద్దంకి ఆర్టీసీ అధికారులు మాత్రం తరచూ బస్సుల రద్దు మీదనే కసరత్తు చేస్తూ రాష్ట్రంలోనే ప్రీ ప్లాన్డ్ కేన్సిలేషన్ (పీపీసీ)లో ప్రథమ స్థానంలో నిలిచేందుకు కుస్తీ పడుతున్నారని ఆర్టీసీ సిబ్బందే గుసగుసలాడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామీణ రూట్లలో బస్సు సర్వీసులను క్రమేపీ కుదించుకుంటూ వచ్చిన ఆర్టీసీ అధికారులు ప్రధాన రూట్లలోనే అదేపంథాను కొనసాగిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రద్దు చేయాలనుకున్న రూట్లలో బస్సులను ముందుగా కొన్ని రోజులు నడపకుండా చేసి అనంతరం ప్రయాణికుల నుంచి ఆదరణ లేదన్న సాకు చూపించి రద్దు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రద్దు చేసే బస్సు సర్వీసుల వివరాలను కనీసం ముందస్తుగా నోటీసు బోర్డులో కూడా ఏర్పాటు చేయకపోవడంపట్ల ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రతి మంగళ, శుక్రవారాలలో వినుకొండ, పొదిలి సెక్టార్‌లలో ఒకొక్క బస్సు చొప్పున పూర్తిగా రద్దు చేస్తున్నారు. ఇక ఆదివారం వచ్చిందంటే కనీసం ఏడెనిమిది సర్వీసులు రద్దవుతున్నాయి. సింగిల్ రూట్ బస్సులు సైతం రద్దు చేస్తున్నారు. తాళ్లూరు సెక్టార్‌లో రెండు బస్సులు నడుస్తుంటే ఆదివారం రెండు బస్సులు రద్దు చేస్తున్నారు. జిల్లా కేంద్రం బాపట్లకు ఒకే ఒక్క బస్సు నడుస్తుండగా అదీ కూడా ఆదివారం ఉండదు. ఇలా అత్యధిక రూట్లలో తరచూ బస్సు సర్వీసులు రద్దు చేస్తుండడం పట్ల అటు ఆర్టీసీ సిబ్బంది, ఇటు ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తరచూ బస్సులు రద్దు చేయడాన్ని విరమించుకొని అన్ని బస్ సర్వీసులను నడుపుతూ ప్రయాణికుల నుంచి ఆదరణ పొందాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డీఎం రామ్మోహనరావు దృష్టికి తీసుకు పోగా ఆయా రోజులలో కొన్ని బస్సులకు ఆదాయం తక్కువ వస్తుండటంతో ఆయా సర్వీసులను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్


వెంకయ్యకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కొండయ్య

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యకు స్వాగతం

చీరాల, ఆగస్టు 10 : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు శనివారం కారంచేడులో జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణకు హాజరయ్యేందుకు రైలు మార్గంలో చీరాల వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు రైల్వే స్టేషన్‌లో వెంకయ్యకు స్వాగతం పలికారు. వెంకయ్యకు ఎమ్మెల్యే కొండయ్య పూలబొకే అందజేసి, శాలువా కప్పి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అక్కడకు వచ్చిన వారిలో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరినీ వెంకయ్య పేరుపేరున పలుకరించారు. అనంతరం రోడ్డు మార్గంలో కారంచేడు వెళ్లారు.

అంటకాగిన సీఐలకు బ్రేక్

ఆరోపణలు లేని ఒకరిద్దరికి అవకాశం

జిల్లాలో కొన్ని పోస్టింగ్‌ల జాప్యానికి అదే కారణం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

శాసనసభ్యులు, ఇతర ముఖ్యనాయకులు ఎంత వత్తిడి చేసినా గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగిన పోలీసు అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఇప్పటికే జరిగిన డీఎస్పీ, సీఐల పోస్టింగ్‌లలో ఆ విషయం తేటతెల్లం కాగా జిల్లాలో మరికొన్ని సర్కిళ్లకు సీఐల నియామకంలో జాప్యానికి ఆ సమస్యే కారణమైనట్లు తేటతెల్లమైంది. ఉమ్మడి జిల్లాలో పొదిలి, మార్కాపురం, వైపాలెం, త్రిపురాంతకం, కంభం సీఐల పోస్టింగ్‌ల విషయంలో అంతర్మథనం జరుగుతోంది. అందులో పొదిలి సర్కిల్‌కు స్థానిక నేతలతో సిఫార్సు చేయించుకున్న యు.శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చేదే లేదని అధిష్ఠానం తేల్చేసింది. నిన్నమొన్నటివరకు బాపట్లలో ఉన్న ఆయనను పొదిలికి బదిలీ చేయాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సిఫార్సు చేశారు. ఇప్పటికే ఆయన ఒకటి రెండు చోట్ల పోస్టింగ్ కోసం ప్రయత్నించి తిరస్కరణకు గురైనట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో సింగరాయకొండ సీఐగా ఉన్న శ్రీనివాసరావు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించిన విషయం ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టిలో కూడా ఉంది. జర్నలిస్టులకు బెయిల్ తెచ్చుకునే అవకాశం కూడా లేకుండా కోర్టులో హాజరుపరచటం, మూడురోజులు వారు జైలులో ఉండే విధంగా వ్యవహరించి విమర్శల పాలయ్యారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులకు అప్పటి పోలీసు అధికారుల వ్యవహారశైలిపై ఇటీవల రాష్ట్రప్రభుత్వానికి, డీజీపీకి ఒక నివేదికను జర్నలిస్టు సంఘం కూడా ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఉన్నతాధికారులు ఫోన్ చేసి శ్రీనివాసరావును వేయలేమని చెప్పి వీఆర్‌కు పంపించారు. వైపాలెంకు గత ప్రభుత్వంలో పూర్తికాలం సీఐగా పనిచేసిన సుధాకర్‌ను టీడీపీ నాయకులు సిఫార్సు చేశారు. ఆయన విషయంలోను అధిష్ఠానం అభ్యంతరం పెట్టింది. నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ కీలకనేత బంధువు కావటంతో ఆయన సిఫార్సు మేరకు పెండింగ్‌లో ఉంచారు. త్రిపురాంతకం సీఐగా సూర్యనారాయణ పేరును దర్శి టీడీపీ ఇన్‌చార్జి సూచించారు. ఆయన విషయంలోను అభ్యంతరాలు ఉన్నాయని అధిష్ఠానం సంకేతాలిచ్చినట్లు తెలిసింది. దీంతో మంత్రి రవికుమార్ ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. కంభం సీఐగా పొదిలిలో ఉన్న మల్లికార్జున పేరును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచించారు. కారణం ఏమైనప్పటికీ ఇంకా ఆయనకు బదిలీ ఉత్తర్వులు రాలేదు. కనిగిరి, పామూరు ప్రస్తుత సీఐలను ఈనెలలో కూడా కొనసాగించి సెప్టెంబరులో కొత్తవారిని కోరుకుంటానని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అధిష్ఠానానికి చెప్పినట్లు తెలిసింది. వీరు మినహా మిగిలిన సీఐ పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రస్తుత ఒంగోలు డీఎస్పీ కిషోర్‌ను మార్కాపురం డీఎస్పీగా నియమించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి సూచించారు. దానిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

కొండపి, ఆగస్టు 10 : విద్యుదాఘాతంతో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ముప్పవరం వద్ద శనివారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. పెరిదేపికి చెందిన పి.వీరకుమార్ గ్రామంలోని ఓ ప్రైవేటు సెల్ టవర్ ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. పై నుంచి కింద పడిపోయాడు. దీంతో ఆయన నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. చేతులు కాలిపోయాయి. క్షతగాత్రుడిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

ఎస్వీ వర్సిటీలో బీటెక్ చదువు

తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం

ఆరునెలల గర్భం..

అర్ధరాత్రి తీవ్ర అనారోగ్యం

రిమ్స్‌కు తరలింపు..

ఆపై కనిపించని ప్రియుడు

అబార్షన్ మందుల వల్లే అంటున్న తల్లిదండ్రులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 10 : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని ఒంగోలులో శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మృతిచెందింది. విద్యార్థిని తన తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకొని గర్భవతి కూడా అయ్యిందని పెళ్లి చేసుకున్న యువకుడు చెబుతున్నాడు. తన కుమార్తెకు ఎలాంటి అనారోగ్యం లేదని, అంతా అనుమానంగా ఉందని మృతురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు రాజీవ్ గృహకల్ప కాలనీలో నివాసం ఉండే చప్పిడి ప్రియాంక(20) తిరుపతి శ్రీవెంకటేశ్వర యునివర్సిటీలో బీటెక్ చదువుతోంది. అయితే సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్లపాడుకు చెందిన దాసరి శివకళ్యాణ్‌తో నాలుగేళ్లగా ప్రేమవ్యవహారం ఉంది. 2023 మార్చిలో పి.తక్కెళ్లపాడు చర్చిలో వారికి వివాహమైంది. అయితే ప్రియాంక మాత్రం వారి ప్రేమ, పెళ్లి వ్యవహారం తల్లిదండ్రులకు తెలియకుండా జాగ్రత్త తీసుకుంది. గత నెలరోజులుగా పి.తక్కెళ్లపాడులో ఉంటున్న ప్రియాంక తల్లిదండ్రులకు మాత్రం తిరుపతిలో ఉంటున్నట్లు చెప్పింది. అయితే ఈనెల 8న ప్రియాంకకు ఓ ప్రైవేటు వైద్యశాలలో పరీక్షలు చేయించాడు శివకళ్యాణ్. ఆరు నెలలు గర్భవతి అని అక్కడ డాక్టర్ చెప్పారు. 9 తేదీ రాత్రి ప్రియాంకకు ఫిట్స్ వస్తే ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు శివకళ్యాణ్ చెబుతున్నారు. అయితే అప్పటికే యువతి మృతి చెందినట్లు రిమ్స్ డాక్టర్లు నిర్ధారించారు. రిమ్స్‌లో ప్రియాంక భర్తగా శివకళ్యాణ్ పేరు నమోదు చేయించాడు. అయితే ప్రియాంక మృతిచెందినట్లు తెలియడంతో అక్కడి నుంచి తన స్నేహితులతో కలిసి పరారయ్యాడు.

ప్రియాంక మృతిపై అనుమానాలు

ప్రియాంక మృతిపై వైద్యులు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అదేసమయంలో శివకళ్యాణ్ ప్రియాంక తల్లిదండ్రులకు ఫోన్ చేసి తిరుపతి నుంచి ట్రైన్‌లో వస్తున్న యువతి స్పృహతప్పి పడిపోయిందని చెప్పడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. యువతి గర్భవతి కావడంతో అబార్షన్ చేయించేందుకు మందులు వాడటంతో ఆమె నోటి వెంట నురుగు వచ్చిందని వారు చెబుతున్నారు. తన బిడ్డ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని తల్లి చప్పిడి అరుణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దర్యాప్తు చేస్తున్నాం: ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్

బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రియాంక నెలరోజులుగా పి.తక్కెళ్లపాడులో ఉంటుందని తెలిపారు. అదేవిధంగా శివకళ్యాణ్‌ను విచారించగా తాము నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నామని, 2023 మార్చిలో చర్చిలో వివాహం చేసుకున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత ప్రియాంక మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉందని చెప్పారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

● రూ.30లక్షల సొత్తు అపహరణ

● ఇంటి ముందు బైక్ తీసుకుని పరారీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 10: పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో మొత్తం దోచేశారు. ఈ సంఘటన నగరంలోని ఇందుర్తినగర్‌లోని కాకతీయనగర్‌లో శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగింది. ఇంట్లో సుమారు రూ.30లక్షల విలువైన సొత్తును దొంగలు అపహరించుకెళ్లారు. వివరాలోకి వెళితే.. గుమ్మడి నాగార్జునరావు కుటుంబ సభ్యులతో నగరంలోని ఓ కళ్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి హాజరయ్యారు. శుక్రవారం రాత్రి 8.30కు వెళ్లి రాత్రి 2 గంటల తర్వాత ఇంటికి వచ్చారు. అయితే ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ కనిపించలేదు. అదేవిధంగా ప్రధాన ద్వారం పగులగొట్టి ఉంది. దీంతో అనుమానించిన నాగార్జునరావు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి ఉంది. అందులో ఉన్న 48 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.80 లక్షల నగదును అపహరించినట్లు నిర్ధారించారు. అదేసమయంలో ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌పై దొంగలు పరారై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈమేరకు సంఘటన స్థలాన్ని ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్ తన సిబ్బందితో పరిశీలించి కేసు నమోదు చేశారు. పరిసర ప్రాంతాలలో సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

వేలిముద్రల నిపుణులు ఆధారాలను సేకరించారు.

కాంగ్రెస్ నేతకు తులసిరెడ్డి పరామర్శ

మద్దిపాడు, ఆగస్టు 10 : మండలంలోని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దేవరపల్లి సుబ్బారెడ్డి తల్లి అన్నమ్మ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఆపార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు మద్దిరెడ్డి తులసిరెడ్డి శనివారం గ్రామానికి వచ్చి సుబ్బారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు షేక్ సైదా, గ్రామస్థులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకుడిని పరామర్శిస్తున్న తులసిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పంగులూరు, ఆగస్టు 10 : జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు (39) మృతి చెందారు. అందిన సమాచారం మేరకు మండలంలోని బైటమంజులూరు గ్రామానికి చెందిన సరికొండ నాగరాజు చిలకలూరిపేట నుంచి స్వగ్రామానికి చేరుకునేందుకు జాతీయ రహదారిపై స్టేజీ వద్ద బస్సు దిగారు. గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు దాటే ప్రయత్నంలో విజయవాడ వైపు నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆర్టీసీ ఇంద్ర బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. నాగరాజు బేలుదారి పనిచేస్తున్నారు. అతనికి భార్య శివ పార్వతి, తల్లి చిన ఆదెమ్మ ఉన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రియుడి మోజులో ఘాతుకం

- భర్తను దారుణంగా హత్యచేయించిన భార్య
- నెల్లూరుకు చెందిన కిరాయి హంతకులకు సుపారీ
- వివాహేతర సంబంధమే కారణం
- భార్యతో పాటు ఐదుగురు నిందితుల అరెస్టు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 10: ప్రియుడు మోజులో పడిన ఓ మహిళ భర్తను దారుణంగా హతమార్చింది. అందుకు ప్రియుడితో కలిసి నెల్లూరుకు చెందిన సుపారీ గ్యాంగ్‌ను మాట్లాడుకున్నారు. పక్కా ప్రణాళికతో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయారు. ఈ మేరకు ఆరుగురు నిందితులను పొదిలి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ దామోదర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 3న పొదిలిలో చల్లా వెంకట నరేంద్రబాబును భార్య లక్ష్మీప్రియ, తన ప్రియుడుతో కలిసి కిరాయి హంతకులను పిలిపించి హత్య చేయించింది. అయితే ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. పోలీసులు అత్యంత వేగవతంగా దర్యాప్తు చేసి కేసును చేదించారు. ఈ కేసులులో నిందితులైన హతుడు భార్య చల్లా లక్ష్మీప్రియ, ఆమె ప్రియుడు పొదిలి పీఎస్ఆర్ కాలనీకి చెందిన కొండా శశికుమార్, నెల్లూరుకు చెందిన షేక్ నహీద్, షేక్ ఫజ్లు, సయద్‌సిద్దిక్, షేక్ ముబారక్‌లను పొదిలి సమీపంలో కాటూరివారిపాలెం వద్ద అనుమానా స్పదంగా ఉండగా శనివారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

హత్య జరిగిందిలా..

కేంద్ర ప్రభుత్వ ప్రావిడెంట్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చల్లా వెంకటనరేంద్రబాబు పొదిలిలోని పీఎస్ఆర్ కాలనీ 3వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. ఎనిమిదేళ్ల క్రితం లక్ష్మీప్రియతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. అయితే ఎనిమిది నెలల క్రితం లక్ష్మీప్రియకు అదే ప్రాంతంలో నివాసం ఉంటూ డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తున్న కొండా శశికుమార్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త వారి మధ్య వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం వెంకట నరేంద్రబాబుకు తెలిసి భార్యను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అయితే లక్ష్మీప్రియ మాత్రం తన భర్తను అడ్డు తొలంగించుకునేందుకు ప్రియుడుతో కలిసి పథకం రూపొందించారు. అదే సమయంలో నెల్లూరులోని నేతాజీనగర్‌కు చెందిన కిరాయి హంతకులను కలిసి హత్య చేసేందుకు రూ.2లక్షలు సుపారీ ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. రూ.50వేలు అడ్వాన్స్ ఇచ్చారు. ఈమేరకు లక్ష్మీప్రియ, శశికుమార్, మరో నలుగురు కిరాయి హంతకులు కలిసి ఈనెల 2వ తేదీన అర్ధరాత్రి నరేంద్రబాబు ఇంట్లో నిద్రిస్తుండగా గొంతుకు తాళ్లు వేసి లాగి దారుణంగా హత్య చేశారు. అంతేగాకుండా నోట్లో మద్యం పోశారు. అనంతరం తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది లక్ష్మీప్రియ. అయితే అనుమానించిన వెంకటనరేంద్ర బాబు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హత్య కేసును చేధించారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ

హత్య కేసును అత్యంత వేగంగా చేధించిన పొదిలి సీఐ మల్లికార్జునరావు, ఎస్సై జి.కోటయ్య, తర్లుపాడు హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, గౌతమ్‌కుమార్, రమేష్ బాబు, వీరరాజులను ఎస్పీ దామోదర్ అభినందించారు. ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసును చేధించి హత్యకేసుగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న పోలీసులకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు.

అవీ.. ఇవీ..

ఘనంగా వనభోజన మహోత్సవం


వనభోజనాలకు వెళుతున్న మహిళలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 10: మండలంలోని మన్నెంవారిపల్లిలో గ్రామస్థులు శనివారం వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలో రాములవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా రాములవారితో పాటు గ్రామంలోని మహిళలందరూ గంపలతో భోజన సామగ్రిని గ్రామశివారుకు తీసుకెళ్లి పొలాలకు సామూహిక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. రాముల వారికి ప్రత్యేకంగా అర్చకలు నైవేద్యం సమర్పించగా గ్రామ శివారు పొలాల్లో మహిళలు పొంగళ్లు వండి స్వామివారికి సమర్పించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. సకాలంలో వర్షాలుపడి గ్రామంలోని రైతులందరూ పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ స్వామివారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు, గ్రామపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గిద్దలూరు, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పిడతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. స్థానిక సాహితి జూనియర్ కళాశాల ఆవరణలో 'ప్రజాస్వామ్య పరిరక్షణలో భారత రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత' అనే అంశంపై పోటీలను నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న 200 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు అందచేస్తామని ఫౌండేషన్ సీఈవో పిడతల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు


జెండా ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు, ఆగస్టు 10 : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకలను యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిందని, ఉపాధ్యాయ సమస్యల కోసం యూనియన్ అలుపెరగని పోరాటం చేసిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ ఎం.సత్యనారాయణ, గిద్దలూరు, రాచర్ల మండలాల యూటీఎఫ్ నాయకులు, సీఐటీయూ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఓవీ వీరారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ఆ సంఘం కార్యాలయం వద్ద జిల్లా మున్సిపల్ టీచర్స్ కోఆర్డినేటర్ ఎన్ఎస్ఎల్ రవికుమార్, పి.ప్రభాకర్‌లు శనివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓవీ వీరారెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం త్వరగా మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీరాములు, పెద్దారవీడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.పాపయ్య, వై.యలమందారెడ్డి, తర్లుపాడు అధ్యక్షులు ఎస్.చంద్రశేఖరయ్య, మార్కాపురం మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వెంకట్రావ్, కె.ప్రభాకర్, ఖాశీంపీరా, కాశిరెడ్డి, రెహమాన్, సీపీఎస్ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

- రూ.30లక్షల సొత్తు అపహరణ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 10: పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో మొత్తం దోచేశారు. ఈ సంఘటన నగరంలోని ఇందుర్తినగర్‌లోని కాకతీయనగర్‌లో శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగింది. ఇంట్లో సుమారు రూ.30లక్షల విలువైన సొత్తును దొంగలు అపహరించుకెళ్లారు. వివరాలోకి వెళితే.. గుమ్మడి నాగార్జునరావు కుటుంబ సభ్యులతో నగరంలోని ఓ కళ్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి హాజరయ్యారు. శుక్రవారం రాత్రి 8.30కు వెళ్లి రాత్రి 2 గంటల తర్వాత ఇంటికి వచ్చారు. అయితే ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ కనిపించలేదు. అదేవిధంగా ప్రధాన ద్వారం పగులగొట్టి ఉంది. దీంతో అనుమానించిన నాగార్జునరావు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి ఉంది. అందులో ఉన్న 48 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.80లక్షల నగదును అపహరించినట్లు నిర్ధారించారు. అదేసమయంలో ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌పై దొంగలు పరారై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈమేరకు సంఘటన స్థలాన్ని ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్ తన సిబ్బందితో పరిశీలించి కేసు నమోదు చేశారు. పరిసర ప్రాంతాలలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. వేలిముద్రల నిపుణులు ఆధారాలను సేకరించారు.

ఉత్సాహంగా 2కే రన్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులో శనివారం 2కే రన్ నిర్వహించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ఆధ్వర్యంలో స్థానిక గాంధీపార్కు వద్ద నుంచి ర్యాలీని ఏఎస్పీ అ శోక్‌బాబు, సూదనగుంట బుజ్జి ప్రారంభించారు. ఈ ర్యాలీ లాయర్‌పేట, మంగమూరు రోడ్డు జంక్షన్, వీఐపీ రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఇ లాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు సహకరించాలని కోరా రు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ జగదీష్, అధ్యాపకులు, సుమారు 750మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 11: ఇటీవల కాలంలో మండుటెండలు.. ఉక్క పోతలతో అల్లాడుతున్న ఒంగోలు నగర ప్రజలకు ఉపశమనం లభించింది. శనివారం కురిసిన వానకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చల్లని వాతావరణం తో ఊరటచెందారు. చాలా రోజుల తర్వాత కురిసిన వానకు నగరం తడిసి ము ద్దయింది. వీధులు జలమయంగా మారాయి.

కిరాణా దుకాణంలో భారీ చోరీ


దుకాణంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పొదిలి, ఆగస్టు 10 : పట్టణంలోని జూనియర్ కళాశాల రోడ్డులో కిరాణా దుకాణంలో శుక్రవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. దుకాణ యజమాని గొంట్లా లక్ష్మీ నారాయణ తెలిపిన వివ రాల ప్రకారం, శుక్రవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. అయితే అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు దుకాణం వెనుకవైపు తలుపులు పగులగొట్టి దుకాణంలోని రూ.1.30 లక్షల నగదు, మూడున్నర సవర్ల బంగారు నగలు దోచుకెళ్ళినట్లు ఆయన తెలిపారు. వాటి విలువ సుమారుగా ఐదు లక్షలు ఉంటుందన్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దొంగతనానికి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎంపై అనుచిత పోస్టింగ్ పెట్టిన మహిళ గుర్తింపు

- వాట్సప్ ద్వారా నోటీసులు పంపించిన పోలీసులు

కంభం, ఆగస్టు 10 : సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్ పెట్టిన మహిళను పోలీసులు గుర్తించారు. ఈ నెల 7న 'స్వీటి గిద్దలూరు నియోజకవర్గం ఫేస్‌బుక్ పేజీ' లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఓ గుర్తు తెలియని వ్యక్తి పెట్టిన అనుచిత ఫొటోలు పోస్టు చేశారు. ఆ పోస్టు ఆధారంగా విచారించి, సదరు మహిళను గుర్తించి వాట్సప్ ద్వారా నోటీసులు ఇచ్చామని ఎస్సై రాజేష్ తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ జనరల్ సెక్రటరీ గోన చెన్నకేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు పోలీసులు విచారించారు. మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ పర్యవేక్షణలో కంభం సీఐ రామకోటయ్య, కంభం ఎస్సై రాజేష్‌లు బృందాలుగా ఏర్పడి ఈ కేసులో విచారించారు. 24 గంటల్లో నిందితులను గుర్తించి నోటీసులు ఇచ్చినందుకు చేసినందుకు జిల్లా ఎస్పీ తమను అభినందించినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు, పోస్టులు చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వాట్సప్, టెలిగ్రామ్, యూట్యూబ్‌లలో చేసినా, షేర్ చేసినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోలయ్యకు కొండారెడ్డి నివాళి


నివాళి అర్పిస్తున్న కొండారెడ్డి

మార్కాపురం రూరల్, ఆగస్టు 10: మార్కాపురం మాజీ ఎంపీపీ భర్త మంగమూరి పోలయ్య అనారోగ్యం కారణంగా ఇటీవల గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందా రు. పోలయ్య మృతదేహానికి ఆయన స్వగ్రామం చింతగుంట్ల గ్రామంలోని ఆయన ఇంటి వద్ద మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి నివాళులర్పించారు. పోలయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. యాదవ సంఘంలోనూ పోలయ్య కీలకంగా ఉన్నారు. ఆయన మృతిపట్ల మార్కాపురం మండలంతోపాటు పరిసర ప్రాంత యాదవ సంఘం నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

పెద్దదోర్నాల, ఆగస్టు 10: ముందు వెళుతున్న మోటారు సైకిల్‌ను వెనుకగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో ఇరువురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని చింతల అగ్రహారం సమీపంలో మార్కాపురం-దోర్నాల రహదారిలో శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కటకానిపల్లె గ్రామానికి చెందిన ఎలియాజర్‌పాల్, భార్య సోనీలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ఎంఈవో కార్యాలయంలో సీఆర్‌పీగా పనిచేస్తున్న ఎలియాజర్, భార్య సోనీ పిల్లలతో కలిసి మోటారు సైకిలుపై మార్కాపురం వెళ్తుండగా చింతల అగ్రహారం వద్ద వెనుకగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో వారు కిందపడ్డారు. మోటారుసైకిలుపై ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. ఘటనను గమనించిన కొందరు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వాహనంలో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రథమ చికిత్సలు నిర్వహించారు.

ప్రయోజనాత్మక విద్యపై కార్యశాల


సీఏ ప్రసాద్‌ను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 10: స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో శనివారం డిగ్రీ విద్యార్థులకు ప్రయోజనాత్మక విద్య అనే అంశంపై ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ సీఏ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. గుణాత్మక విద్యను నేర్చుకోవడంతోపాటు మనోవికాస ధోరణి మనిషి జీవితంలో భాగంకావాలని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పరస్పర ముఖాముఖి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రసాద్ విద్యార్థులకు మనోవికాస నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంలో ప్రత్యేక శిక్షణ అందించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం మధుసూదన్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్‌కుమార్, క్యాంపస్ అండ్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె.పవన్‌కుమార్, పరిశోధన విభాగం సమన్వయరకర్త శేషుకుమార్, కంప్యూటర్ సైన్స్ ఉపన్యాసకులు పి.మురళీ, అకడమిక్ ఇన్‌చార్జ్ పీఆర్‌కే ప్రసాద్, బీసీడీఈ సమన్వయకర్త ఎంవీ రాఘవేంద్ర, ఇతర అధ్యాపకులు సీఏ ప్రసాద్‌ను సత్కరించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సేవలు పునరుద్ధరణ

- పాఠశాల విద్యాముఖ్యకార్యదర్శి శశిధర్ ఉత్తర్వులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 10 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను ప్రభుత్వం ఎట్టికేలకు పునరుద్ధరించింది. 2024 -25 విద్యాసంవత్సరానికి రాష్ట్రంలోని 3,619 మంది కాంట్రాక్టు అధ్యాపకుల సేవల ను కొనసాగిస్తూ పాఠశాల విద్యాముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వీరి సేవలను జూన్ జూన్ 1నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మే నెలను నో వర్క్, నోపే కింద ప్రకటించి కాంట్రాక్టు అధ్యాపకులకు సంవత్సరంలో కేవలం 11నెలలకు మాత్రమే జీతాలు చెల్లిస్తారు. కాంట్రాక్టు అధ్యాపకుల ఆగిన రెగ్యులరైజేషన్ ప్రక్రి యను కొనసాగించాలని కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఛైర్మన్ కె.సురేష్ ప్రభుత్వా న్ని కోరారు. ప్రభుత్వం రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల జిల్లా జేఏసీ చై ర్మన్ వి.ప్రభుదాస్, కోశాధికారి స్వర్ణలత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

చోద్యం చూస్తున్న అధికారులు


జూనియర్ కళాశాల వెంబడి ఏర్పాటు చేసిన బంకులు

కంభం, ఆగస్టు 10 : కంభం, కందులాపురం మేజర్ పంచాయతీలలోని ప్రభుత్వ స్థలాల్లో పలువురు ఆక్రమణదారులు ఇష్టానుసారంగా బంకులు, రేకులషెడ్లు ఏర్పాటు చేశారు. చిరు వ్యాపారాల పేరుతో ఆక్రమణలు కొనసాగుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, మెయిన్‌బజార్, కందులాపురం సెంటర్, వేంకటేశ్వర సినిమాహాల్ సెంటర్ నుంచి తర్లుపాడుకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులలో సుమారు 100కు పైగా రేకుల షెడ్డులున్నాయి. గతంలో జాతీయ రహదారి వెంబడి చిన్నచిన్న బంకులను ఏర్పాటు చేసుకున్న వారిలో ఒకరిద్దరికి ప్రభుత్వ కళాశాల ప్రహరీగోడ వెంబడి అనుమతి ఇచ్చారు. ఇదే అదునుగా ఎవరికి వారు ఇష్టానుసారం పెద్ద సైజుల్లో బంకులు ఏర్పాటు చేసుకుని వారి సొంత స్థలం మాదిరిగా రేకులషెడ్లు వేసుకున్నారు. గోడౌన్‌లు ఏర్పాటు చేసుకోవడం, వ్యాపారం చేయడం లేదా వేలల్లో అద్దెలకు ఇస్తున్నారు. గతంలో ఆర్అండ్‌బీ అధికారులకు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో, అధికారులు ఆక్రమణదారులకు నామమాత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీగోడ, రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన బంకులతో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలలు అసలు కనిపించడం లేదు. దుకాణాల్లోని వ్యర్థాలను సైతం కళాశాల క్రీడామైదానంలో పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోందని, విద్యార్థులు చెబుతు న్నారు. అలాగే నివాస గృహాలకు గాని, నూతన గృహాలకు గాని కరెంటు మీటరు కనెక్షన్ ఇవ్వాలంటే అనేక నిబంధనలు పెట్టే విద్యుత్ శాఖ అధికారులు దీనికి మాత్రం మీటర్ కనెక్షన్లు వెంటనే ఇచ్చివేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అక్రమణదారులు మాత్రం తాము పంచాయతీకి అద్దె చెల్లిస్తున్నట్లు తెలుపుతు న్నారు. అయితే సంబంధిత అధికారులకు ఈ ఆక్రమణదారులు లంచాలరూపంలో ముట్ట చెప్పడంతో ఎవరు ఇష్టానుసారం వారు ఆక్రమణ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ బంకుల వలన వాహనాలు ఎక్కువగా రోడ్డుపై నిలబెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు స్పందించి అక్రమ రేకులషెడ్లను, బంకులను తొలగించాలని కోరుతున్నారు.

గుప్తనిధుల తవ్వకాల ముఠా అరెస్టు


పోలీసుల అదుపులోని నిందితులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 10: పట్టణ సమీపంలోని తర్లుపాడు రోడ్డులోని పురాతన రైస్ మిల్లులో గుప్త నిధుల కోసం పూజలు చేసి గుంతలు తవ్విన పదిమంది ముఠాను రూరల్ పోలీసులు అరెస్టు చేసిన ఘటన శనివారం జరిగింది. రూరల్ పోలీసులు వివరాల ప్రకారం పట్టణ సమీపంలోని పెరుమాళ్ల కాశీరావుతో పాటు మరో నలుగురికి చెందిన రైస్ మిల్లులో కాశీరావు, వాకిచర్ల వెంకటరత్నంలు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం దర్శి చుట్టుపక్కల గ్రామాల నుంచి పదిమంది కూలీల ద్వారా సుమారు 15 నుంచి 20 అడుగుల లోతులో గుంతలు తవ్వించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి గుంతలు తీస్తున్న పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. గుప్త నిధుల కోసం గుంతలు తీసిన వారిని రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.


మిల్లులో తవ్విన గొయ్యి

'అన్నదాత సుఖీభవ'ను అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

బేస్తవారపేట,ఆగస్టు10: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయన అమరావతి నుంచి పోరుమామిళ్లకు వెళుతూ మార్గమధ్యలోని బేస్తవారపేటలో కాంగ్రెస్ నాయకులు చిలకల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఆరు పథకాలు ప్రకటించారని, వాటిలో ప్రధానంగా రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా ఏటా రూ20వేలు అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. పథకం ముందుకు సాగేందుకు రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే విద్యావిధానంలో జీవో నెంబరు 29 తీసుకొచ్చి తల్లికివందనం కార్యక్రమం అమలు చేసేందుకు ఆ జీవోను తెచ్చారన్నారు. ఆ జీవోలో ప్రతి విద్యార్థికి పథకం అమలు చేయాలని కోరారు. ఈ నెల 15న అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నారని పట్టణాలలోనే కాకుండా మండల కేంద్రాలలో కూడా క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలకు ఐదు రూపాయాలకు కడుపునింపాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పొదిలి : స్థానిక మంజునాథ కల్యాణ మండపంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలైన తల్లికి వందనం, నిరుద్యోగభృతి, అన్నదాత సుఖీభవ, ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50ఏళ్లకు పింఛన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేయాలని కోరారు. టీడీపీని ఆదరించిన రాష్ట్ర ప్రజలకు చెప్పిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కిసాన్‌సెల్ నాయకులు గాలి వెంకట్రామిరెడ్డి, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు బాబు, గోరంట్ల కోటేశ్వరరావు, ముల్లా జిలాని, జిల్లా మహిళ అధ్యక్షురాలు రెహనాబాను, షేక్ మస్తాన్‌వలి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి పథకాలకు తప్పని తిప్పలు

తాగునీటి బోర్లలో పడిపోతున్న నీటిమట్టం


అమానిగుడిపాడు వద్ద ట్యాంకర్లతో నీళ్లు పట్టుకున్న మహిళలు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 10: ఈ ఏడాది మండలంలో వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో గ్రామాల్లోని తాగునీటి బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 30 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండగా, 11 గ్రామాల్లో మాత్రమే నిత్యం 75 నుంచి 80 ట్యాంకర్ల నీటిని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సరఫరా చేస్తున్నారు. మండలంలోని గురిజేపల్లి, అమానిగుడిపాడు, గుర్రపుసాల, మురారిపల్లె, అయ్యంబొట్లపల్లి, వాదంపల్లి గ్రామాలకు రక్షిత తాగునీటి పథకాల ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉండగా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల నిర్లక్ష్యంతో ఆ గ్రామాలకు తాగునీటి సరఫరా చేయడం లేదు. ఆ గ్రామాల్లో తాగునీటి పథకాల నుంచి తాగునీరు సరఫరా చేసేందుకు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించినా, అవి అలంకారప్రా యంగా ఉన్నాయి. దూపాడు రక్షిత తాగునీటి పథకం నుంచి ఆ పథకాలకు పైపుల నిర్మాణం సక్రమంగా నిర్మించకపోవడంతో ఆ గ్రామాలకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో వర్షాలు లేని సమయంలో ట్యాంకర్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దూపాడు రక్షిత తాగునీటిపథకం నుంచి నీరు సరఫరా చేసేందుకు, అమానిగుడిపాడు గ్రామంలో 2015 సంవత్సరంలో రూ.10 లక్షలతో సంపు నిర్మించారు. గురిజేపల్లి నుంచి అమానిగుడిపాడు గ్రామానికి 3 కిలోమీటర్ల పొడవునా పైపులైను తరుచు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఐదువేల జనాభా ఉన్న ఆ గ్రామంలో ప్రజలు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు మండలంలోని మురారిపల్లి, అయ్యంబొట్లపల్లి గ్రామాలకు పుల్లలచెరువు మండలం ముటుకుల తాగునీటి పథకం నుంచి నీటిని సరఫరా చేయాల్సి ఉంది. పైపులైన్లు లెవెల్ లేకపోవడం తో గత పదేళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ ఇంజనీర్లు ఆ సమస్యకు పరిష్కారం చూపడంలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చెంచు గిరిజనుల వెతలు తీరేనా..?

- డెబ్బై శాతం మందికి పక్కా గృహాలు కరువు
- సగం పైగా గ్రామాలకు విద్యుత్, ప్రధాన రహదారులు కరువు


పాకలలో నివసిస్తున్న గిరిజనులు

పెద్ద దోర్నాల, ఆగస్టు 10 : దశాబ్దాలు దాటినా ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారినా చెంచు గిరిజనుల జీవితాల్లో అభివృద్ధి కనిపించడంలేదు. ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధి కోసం గిరిజన సమీకృతాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రత్యేకంగా ఏర్పాటు చేసినా ఫలితం లేదు. దీంతో కనీసం ఎండా వానకు రక్షణ నిచ్చే పక్కాగృహం కూడా కరువైంది. సమాజంలో చెంచు గిరిజనులు ఒక భాగమే అయినా తగి న న్యాయం జరగడం లేదనే ఆరోప ణలు ఉన్నాయి. మైదాన ప్రాంతా ల్లో ఆకాశన్నంటే భవనాలు ఎగబాకుతుంటే మరో వైపు సమీపంలోనే ఉన్న నల్లమల అటవీ ప్రాంతం ఆవాసంగా అనాధిగా చెట్ల కింద రాళ్లు,రప్పలపై పూరిపాకల్లో జీవిస్తున్నారు. క్రూర మృగాలు, విషసర్పాలు సంచరించే ప్రాంతాల్లో జుమ్మని ఝూంకారంతో రొదన పెట్టే అడవి దోమలు, ఈగల దాడిని సహిస్తూ మూడు పూటలా స్టోరు బియ్యం, గొడ్డు కారంతో కడుపు నింపుకుంటున్న చెంచు గిరిజనుల వెతలు అన్నీ ఇన్నీ కావు. మండల పరిధిలో సుమారు 20 గిరిజన గూడేలు ఉన్నాయి. 30శాతం కుటుంబాలకు మాత్రమే ఓ మాదిరి పక్కా గృహాలు ఉన్నాయి. మిగిలిన 70 శాతం మందికి పూరిపాకలే దిక్కయ్యాయి. సగం గ్రామాలకు విద్యుత్తు, ప్రధాన రహదారులు లేవు. పాఠశాలలున్నా విద్య అందడం లేదు. ఉపాధి పనులు కూడా వారికి పోషణకు ఉపకరించడం లేదు. 3 నెలలు పనులు కల్పిస్తే 8 నెలలు ఊరికే ఉండాల్సి వస్తోంది. అటవీ ఫల సేకరణ కూడా సాధ్యం కావడం లేదు. అటవీ శాఖాధి కారులు అడ్డగింత, మరోవైపు వర్షాభావంతో ఫలసేకరణ కష్టంగా మారింది. పోడు భూముల సాగు కూడా భారంగా మారింది. జలసిరి పథకం అమలులో లేక బోరు బావులు మంజూరు కాక వ్యవసాయం చేయలేని దుస్థితి నెలకొంది. గత టీడీపీ ప్రభుత్వంలో చాలా గూడేల్లో సిమెంటు రోడ్ల నిర్మాణాలు జరిగాయి. పండ్ల తోటల విస్తరణకు, ట్రైకార్ రుణాలు, సేద్యానికి ట్రాక్టర్లు, డ్రిప్ ఉచితంగా అందజేసి ప్రోత్సాహాన్నిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నీ రద్దు చేసింది. స్వచ్ఛంద సంస్థ తుమ్మలబైలు, చింతలలో పక్కాగృహాలు నిర్మిస్తుంటే అటవీ శాఖాధికారులు అడ్డగించారు. ప్రభుత్వం, పాలకులు మిన్నకుండడంతో ఉన్న ఇళ్లు పడేసుకుని పునాధుల స్థాయిలో నిలిచిన ఇంటిలో ఉండలేక చెట్ల క్రింద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లలో 250 కుటుంబాలు చెంచు గిరిజనులు తలదాచుకుంటున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

అంటకాగిన సీఐలకు బ్రేక్

- ఆరోపణలు లేని ఒకరిద్దరికి అవకాశం
- జిల్లాలో కొన్ని పోస్టింగ్‌ల జాప్యానికి అదే కారణం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

శాసనసభ్యులు, ఇతర ముఖ్యనాయకులు ఎంత వత్తిడి చేసినా గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగిన పోలీసు అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఇప్పటికే జరిగిన డీఎస్పీ, సీఐల పోస్టింగ్‌లలో ఆ విషయం తేటతెల్లం కాగా జిల్లాలో మరికొన్ని సర్కిళ్లకు సీఐల నియామకంలో జాప్యానికి ఆ సమస్యే కారణమైనట్లు తేటతెల్లమైంది. ఉమ్మడి జిల్లాలో పొదిలి, మార్కాపురం, వైపాలెం, త్రిపురాంతకం, కంభం సీఐల పోస్టింగ్‌ల విషయంలో అంతర్మథనం జరుగుతోంది. అందులో పొదిలి సర్కిల్‌కు స్థానిక నేతలతో సిఫార్సు చేయించుకున్న యు.శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చేదే లేదని అధిష్ఠానం తేల్చేసింది. నిన్నమొన్నటివరకు బాపట్లలో ఉన్న ఆయనను పొదిలికి బదిలీ చేయాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సిఫార్సు చేశారు. ఇప్పటికే ఆయన ఒకటి రెండుచోట్ల పోస్టింగ్ కోసం ప్రయత్నించి తిరస్కరణకు గురైనట్లు తెలిసింది.

గత ప్రభుత్వంలో సింగరాయకొండ సీఐగా ఉన్న శ్రీనివాసరావు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించిన విషయం ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టిలో కూడా ఉంది. జర్నలిస్టులకు బెయిల్ తెచ్చుకునే అవకాశం కూడా లేకుండా కోర్టులో హాజరుపరచటం, మూడురోజులు వారు జైలులో ఉండే విధంగా వ్యవహరించి విమర్శల పాలయ్యారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులకు అప్పటి పోలీసు అధికారుల వ్యవహారశైలిపై ఇటీవల రాష్ట్రప్రభుత్వానికి, డీజీపీకి ఒక నివేదికను జర్నలిస్టు సంఘం కూడా ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే నారాయణ రెడ్డికి ఉన్నతాధికారులు ఫోన్ చేసి శ్రీనివాసరావును వేయలేమని చెప్పి వీఆర్‌కు పంపించారు. వైపాలెంకు గత ప్రభుత్వంలో పూర్తికాలం సీఐగా పనిచేసిన సుధాకర్‌ను టీడీపీ నాయకులు సిఫార్సు చేశారు. ఆయన విషయంలోను అధిష్ఠానం అభ్యంతరం పెట్టింది. నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ కీలకనేత బంధువు కావటంతో ఆయన సిఫార్సు మేరకు పెండింగ్‌లో ఉంచారు. త్రిపురాంతకం సీఐగా సూర్యనారాయణ పేరును దర్శి టీడీపీ ఇన్‌చార్జి సూచించారు. ఆయన విషయంలోను అభ్యంతరాలు ఉన్నాయని అధిష్ఠానం సంకేతాలిచ్చినట్లు తెలిసింది. దీంతో మంత్రి రవికుమార్ ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

కంభం సీఐగా పొదిలిలో ఉన్న మల్లికార్జున పేరును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచించారు. కారణం ఏమైనప్పటికీ ఇంకా ఆయనకు బదిలీ ఉత్తర్వులు రాలేదు. కనిగిరి, పామూరు ప్రస్తుత సీఐలను ఈనెలలో కూడా కొనసాగించి సెప్టెంబరులో కొత్తవారిని కోరుకుంటానని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అధిష్ఠానానికి చెప్పినట్లు తెలిసింది. వీరు మినహా మిగిలిన సీఐ పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రస్తుత ఒంగోలు డీఎస్పీ కిషోర్‌ను మార్కాపురం డీఎస్పీగా నియమించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి సూచించారు. దానిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

దొనకొండ, ఆగస్టు 10: సర్పంచ్‌లు, కార్యదర్శులకు కార్యాచరణ, ప్రణాళికలపై గత మూడు రోజులుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ఎంపీడీవో వసంతరావు నాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీ నిధులు, విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో గ్రామ పంచాయతీల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక వనరుల లభ్యతను బట్టి 2024-25 గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాధవరంలో చోరీ

తాళ్లూరు, ఆగస్టు 10: మండలంలోని మాధవరం పొలాల్లోని ధనలక్ష్మి డ్రంకన్ ఫ్రూట్స్‌కు చెందిన తోటలోని రూంలో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఈమేరకు పొలం నిర్వాహకుడు తూము రామిరెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ పనులు ముగించుకుని రూంకు తాళంవేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి తోటలోని రూంతాళం తెరవబోగా రాలేదు. తాళం పగులగొట్టి వెళ్లిచూడగా ఫ్రిజ్, పెద్దకాటాలు తదితర సామగ్రి అపహరించారు. చోరీకి పాల్పడ్డ దుండగులు తాళం మార్చి వేసి వెళ్లటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దాదాపు రూ30 వేల సామగ్రి చోరీ జరిగినట్లు నిర్వాహకుడు రామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పామూరు, ఆగస్టు 8: మండలంలోని ఇనిమెర్ల గ్రామశివారులో మూతపడిఉన్న కంకర రాయి కొండ ప్రాంతంలో ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం వీఆర్ కోటకు చెందిన ముచ్చు మాలకొండయ్య(65) భార్య మృతి చెందటంతో మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉంటారని బంధువులు తెలిపారు. ఈక్రమంలో గత మంగళవారం ఇంట్లో ఎవరికి చెప్ప కుండా వెళ్లారని బంధువులు తెలిపారు. ఇనిమెర్ల వద్ద ఉరి వేసుకొని మృతి చెంది సుమారు నాలుగు రోజులు గడవడంతో మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుంది. అటుగా వెళుతున్న పశువుల కాపర్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.రామానాయక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతిని బంధువులకు సమాచారం అందించారు. మృతదేహం మాలకొండయ్యదిగా బంధువులు గుర్తించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- ఎస్వీ వర్సిటీలో ద్వితీయ సంవత్సరం
- తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం
- ఆరునెలల గర్భం.. అర్ధరాత్రి తీవ్ర అనారోగ్యం
- రిమ్స్‌కు తరలింపు.. ఆపై కనిపించని ప్రియుడు
- అబార్షన్ మందుల వల్లే అంటున్న తల్లిదండ్రులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 10 : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని ఒంగోలులో శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మృతిచెందింది. విద్యార్థిని తన తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకొని గర్భవతి కూడా అయ్యిందని పెళ్లి చేసుకున్న యువకుడు చెబుతున్నాడు. తన కుమార్తెకు ఎలాంటి అనారోగ్యం లేదని, అంతా అనుమానంగా ఉందని మృతురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు రాజీవ్ గృహకల్ప కాలనీలో నివాసం ఉండే చప్పిడి ప్రియాంక(20) తిరుపతి శ్రీవెంకటేశ్వర యునివర్సిటీలో బీటెక్ చదువుతోంది. అయితే సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్ళపాడుకు చెందిన దాసరి శివకళ్యాణ్‌తో నాలుగేళ్లుగా ప్రేమవ్యవహారం ఉంది. 2023 మార్చిలో పి.తక్కెళ్లపాడు చర్చిలో వారికి వివాహమైంది. అయితే ప్రియాంక మాత్రం వారి ప్రేమ, పెళ్లి వ్యవహారం తల్లిదండ్రులకు తెలియకుండా జాగ్రత్త తీసుకుంది. గత నెలరోజులుగా పి.తక్కెళ్లపాడులో ఉంటున్న ప్రియాక తల్లిదండ్రులకు మాత్రం తిరుపతిలో ఉంటున్నట్లు చెప్పింది. అయితే ఈనెల 8న ప్రియాంకాకు ఓ ప్రైవేటు వైద్యశాలలో పరీక్షలు చేయించాడు శివకళ్యాణ్. ఆరు నెలలు గర్భవతి అని అక్కడ డాక్టర్ చెప్పారు. 9 తేదీ రాత్రి ప్రియాంకకు ఫిట్స్ వస్తే ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు శివకళ్యాణ్ చెబుతున్నారు. అయితే అప్పటికే యువతి మృతి చెందినట్లు రిమ్స్ డాక్టర్లు నిర్ధారించారు. రిమ్స్‌లో ప్రియాంక భర్తగా శివకళ్యాణ్ పేరు నమోదు చేయించాడు. అయితే ప్రియాంక మృతిచెందినట్లు తెలియడంతో అక్కడి నుంచి తన స్నేహితులతో కలిసి పరారయ్యాడు.

ప్రియాంక మృతిపై అనుమానాలు

ప్రియాంక మృతిపై వైద్యులు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అదేసమయంలో శివకళ్యాణ్ ప్రియాంక తల్లిదండ్రులకు ఫోన్ చేసి తిరుపతి నుంచి ట్రైన్‌లో వస్తున్న యువతి స్పృహతప్పి పడిపోయిందని చెప్పడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. యువతి గర్భవతి కావడంతో అబార్షన్ చేయించేందుకు మందులు వాడటంతో ఆమె నోటి వెంట నురుగు వచ్చిందని వారు చెబుతున్నారు. తన బిడ్డ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని తల్లి చప్పిడి అరుణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దర్యాప్తు చేస్తున్నాం: ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్

బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రియాంక నెలరోజులుగా పి.తక్కెళ్లపాడులో ఉంటుందని తెలిపారు. అదేవిధంగా శివకళ్యాణ్‌ను విచారించగా తాము నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నామని, 2023 మార్చిలో చర్చిలో వివాహం చేసుకున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత ప్రియాంక మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉందని చెప్పారు.

కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ప్రభుత్వాసుపత్రిలో పెచ్చులూడుతున్న స్లాబ్‌ను చూస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కనిగిరి, ఆగస్టు 10: కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో అన్ని విభాగాలకు చెందిన వైద్యం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవటమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే సొంత నిధులతో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలోని అన్ని విభాగాల గదులను పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రిలో ఉన్న సేవా విభాగాలను చూసి ఎమ్మెల్యే నివ్వెరపోయారు. సామగ్రి ఉన్నప్పటికీ వాడుకలో లేకపోవటంతో అవి పూర్తిగా పాడయిపోవడంతో విచారం వ్యక్తం చేశారు. ప్రసూతి గదిలో ఉన్న సామగ్రి, పరికరాలు చూసి ఇలాంటివి ఏ ప్రయివేటు ఆసుపత్రులలో కూడా ఉండవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంతో విలువైన, అధునాతనమైన పరికరాలు ఉపయోగించకుండా పడేయటం బాధగా ఉందన్నారు. తన ప్రాంత ప్రజలు చిన్న అనారోగ్యానికి కూడా పరాయి ప్రాంతాలకు పరుగులు తీయటం బాధగా ఉందన్నారు. అందుకే ప్రభుత్వం నిధులు కేటాయించే వరకూ ఆగకుండా విద్యుత్, ఆసుపత్రిలోని రోగులు, వైద్యులు ఉండే వివిధ విభాగాల గదులు సుందరీకరణకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో పనులు చేయిస్తున్నారు.

పనులు ప్రారంభించినప్పటి నుంచి ఏ గదిలోకి ప్రవేశించినా స్లాబు పెచ్చులు ఊడి చువ్వలు బయట పడుతుండటంతో పాటు ఏ గదిలోనూ సౌకర్యాలు సరైన రీతిలో లేవు. ఆసుపత్రిలోని భవన నిర్మాణాలు నాసిరకంగా ఉండటంతో స్లాబ్‌లు, గోడలు బీటలు వారాయి. కారణం తెలుసుకునేందుకు స్లాబ్ పైకి వెళ్ళేందుకు మెట్లు లేకపోవటంతో ఇనుప నిచ్చెనతో ఎమ్మెల్యే ప్రభుత్వాసుపత్రి బిల్డింగ్‌పైకి వెళ్ళి పరిశీలించారు. దీంతో స్వల్ప ఖర్చు అవుతుందనుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు రోజురోజుకు ఖర్చు లక్షల్లో పెరిగిపోతుంది. అయినా ఆసుపత్రిలో అన్ని విభాగాల సేవలను వినయోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, పీఆర్ డీఈ ఆదిశేషు, ఆసుపత్రి సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం, టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, షరీఫ్ తదితరులు ఉన్నారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేనట్టేనా?

- మూడేళ్లుగా ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోని రైల్వే అధికారులు
- జనరల్ మేనేజర్, బోర్డు చైర్‌పర్సన్‌కు ఎంపీ మాగుంట విన్నవించినా కానరాని స్పష్టత

దొనకొండ, ఆగస్టు 10: దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న రైళ్లనూ డబ్లింగ్ లైన్ పనులతో అధికారులు తాత్కాలికంగా రద్దు చేస్తుండటంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. కరోనాకు ముందు దొనకొండ రైల్వేస్టేషన్‌లో అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉం డేది. ఆతర్వాత రైళ్ల పునఃప్రారంభం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం ఎత్తేయటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

దొనకొండలో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

మచిలీపట్నం-బెంగుళూరు-మచిపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్, పూరి, యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, విజయవాడ-హుబ్లీ-విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్, హౌరా-వాస్కోడిగామా - హౌరా, అమరావతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-బెంగుళూరు-భువనేశ్వర్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, విజయవాడ, ధర్మవరం- విజయవాడ, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లు కరోనా తర్వాత దొనకొండలో ఆగడం లేదు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీ మాగుంటకు స్థానికులు విన్నవించారు. అందుకు స్పందించిన మాగుంట దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్‌కు విజ్ఞప్తి చేశారు. ఎంపీ మాగుంట రైల్వే జీఎంను కలిసి నెలలు గడిచినా నేటికీ ఎటువంటి స్పందనలేదు. తిరిగి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గత సెప్టెంబరు 20న ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మసిన్హాను కలిసి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ వివరించి వినతిపత్రం అందజేశారు. నేటికీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకుండా పరుగులు తీస్తుండటంతో దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉండదని, తమకు రవాణా కష్టాలు తప్పవని ప్రజలు భావిస్తున్నారు.

వైసీపీవి చౌకబారు రాజకీయాలు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజం



దర్శి, ఆగస్టు 10: గత ఎన్నికల్లో వైసీపీని ప్రజలు ఘోరంగా ఓడించినప్పటికీ ఆపార్టీకి ఇంకా జ్ఞానోదయం కలగలేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదలచేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి ఎలాంటి నష్టం జరగకపోయిప్పటికీ వైసీపీ చిల్లర రాజకీయం చేస్తుందని విమర్శించారు. దళితులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాయకులు ప్రయత్నించటం శోచనీయమన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తున్నదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి రాక్షసంగా వ్యవహరించిన ఆపార్టీ నాయకులు నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి ఎలాంటి నష్టం వాటిల్లకపోయినా స్థానిక ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శిలో నిరసన కార్యక్రమం చేపట్టడం శోచనీయమన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పేదలకు అందించే విదేశీ విద్యా పథకానికి అంబేడ్కర్ విదేశీ విద్యపేరుతో అమలుచేయగా, వైసీపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ పేరు మార్చడంపై సమాధానం చెప్పాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలపై ప్రభుత్వ రాజముద్రను తొలగించి జగన్ బొమ్మను ఎందుకు ముద్రించారని ప్రశ్నించారు. దళితులు, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకులు ఇదే విధానాన్ని కొనసాగిస్తే తగిన గుణపాఠం చెబుతారని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు.

దేవుడు మాన్యం పరులపాలు



పామూరు కొత్త చెరువు వద్ద ఉన్న మాన్యం

పామూరు, ఆగస్టు 10: పామూరు మదనవేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన కోట్లాది విలువ గలిగిన భూములు ఈపాటికే పరులపాలయ్యాయి. ఉన్న భూములైనా అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. పామూరు జాతీయ రహదారి పక్కన కొత్త చెరువు వెనుకభాగంలో సర్వే నెంబర్‌లో 399/6లో 1.55 ఎకరాల శ్రీ వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమి భజంత్రీల మాన్యంగా ఎఫ్ఎల్ఆర్ రికార్డుల్లో ఉంది. అదే భూమి మీభూమి రికార్డుల్లో ప్రయివేట్ వ్యక్తుల పేరుపై నమోదై 2016లో రిజిస్ట్రేషన్ అయి ఉండటంతో లేఔట్లు వేసి అమ్మకాలు ప్రారంభించారు. ఎఫ్ఎల్ఆర్ లింకు డాక్యుమెంట్లు చూడకుండా రిజిస్ట్రేషన్ చేయడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు దేవస్థాన భూములకు చెందిన మాన్యాలను 22ఏ 1సీ రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని ఆలయ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని భక్తులు కోరుతున్నారు.

కాగా మదన వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నెంబర్ 78/1లో గల 6.08 ఎకరాల భూమి నెల్లూరు జిల్లా వేంపాడు రెవెన్యూ పరిధిలో ఉంది. అర్చకుల నుంచి కొనుగోలు చేసినమాన్యం భూమి ఇతరులకు సంక్రమించదంటూ జేసీ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈక్రమంలో వ్యక్తుల పేర్లు తొలగించి ఆలయ భూమిగా రికార్డుల్లో నమోదు చేయవలసిందిగా తీర్పు వచ్చిన విషయం తెలిసిందే.

దర్శిలో బస్‌షెల్టర్ ఏర్పాటు



దర్శి గడియారస్తంభం సెంటర్‌లో ఏర్పాటుచేస్తున్న బస్‌షెల్టర్

దర్శి, ఆగస్టు 10: ఎంతోకాలంగా ప్రయాణికులు ఎదురుచూస్తున్న బస్ షెల్టర్‌ల ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి దర్శి పట్టణంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించారు. దీంతో పట్టణంలో బస్‌షెల్టర్లు ఏర్పాటుచేయాలని సూచించటంతో నగర పంచాయతీ అధికా రులు మూడుచోట్ల బస్‌షెల్టర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అద్దంకి వైపు వెళ్లే ప్రయాణికుల కోసం గడియార స్తంభం సెంటర్‌లో ఒక బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తున్నారు. కురిచేడు వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఆవైపు ఒకటి, పొదిలి వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఆవైపు మరొకటి ఏర్పాటుచే స్తామని అధికారులు తెలిపారు.

గడియారస్తంభం సెంటర్‌లో మూడు కూడళ్లలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తే అన్నీ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఎంతో అనువుగా ఉంటుం ది. ఇంత కాలం బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బ స్సుల కోసం గంటల తరబడి మండు టెండలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడినా ప్రయాణికులు ఉండేందుకు ఇంతకాలం షెల్టర్ లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బస్‌షెల్టర్ల ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

14 గ్రామాలకు ఒకటే బ్యాంక్

- ఉదయం నుంచి రద్దీ
- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు

తాళ్లూరు ఆగస్టు 10: తాళ్లూరు గ్రామంతో పాటు పరిసరగ్రామాలకు చెందిన దాదాపు 25వేల మంది జనాభాకు కెనరా బ్యాంక్ ఒకటే ఉంది. ఈ బ్యాంక్ పరిధిలో ఏడు గ్రామ పంచాయతీల్లో 14 గ్రామాలు ఉన్నాయి. దీంతో లావాదేవీలు జరుపుకోవడానికి ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంక్ నందు నగదు డ్రా చేసుకునేందుకు ఖతాదారులు పనులు మానుకుని రోజంతా బ్యాంక్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

తాళ్లూరు గ్రామంలో దాదాపు 45 ఏళ్ల క్రితం సిండికేట్ బ్యాంక్‌ను ఏర్పాటుచేశారు. ఆబ్యాంక్‌ను రెండేళ్ల క్రితం కెనరా బ్యాంక్‌గా మార్పు చేశారు. గతంలో ఖాతాలు అంతంత మాత్రంగా ఉండేవి. రానురాను గ్రామాలు అభివృద్ధి చెందటంతో పెట్రోలు బంక్ యజమానులు, గ్యాస్ ఏజన్సీ దారులు, విద్యాసంస్థలకు చెందినవారు, ప్రభుత్వ కార్యాలయాల ఖాతాలు ఈ బ్యాంకులోనే ఉన్నాయి. అంతేకాక రైతులు, పొదుపు మహిళలు, పదవీ విరమణ ఉద్యోగులు, అంగన్ వాడీవర్కర్స్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ రుణాలు, వివిధ చేత వృత్తుల ఖతాదారులు, ఉపాధి కూలీలు కూడా ఈ బ్యాంక్‌పైనే ఆధారపడుతున్నారు.

బ్యాంక్‌లో దాదాపు 20 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ఖతాదారులకు సేవలందించేందుకు ఒకటే బ్యాంక్ ఉండటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. బ్యాంక్ మేనేజర్ ఖాతాదారులకు సత్వర సేవలు అందిస్తున్నప్పటికీ ఖాతాదారుల సంఖ్య అధికంగా ఉండటంతో కష్టాలు తప్పట్లేదు. తాళ్లూరులో మరో బ్యాంక్ శాఖ లేకపోవటం వల్లే ఇబ్బందులు తప్పట్లేదు. మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తూర్పుగంగవరంలో మూడు బ్యాంక్ శాఖలు ఉన్నాయి. ప్రభుత్వ ఖాతాలన్నీ తాళ్లూరు కెనరా బ్యాంక్‌లో ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తాళ్లూరులో మరో బ్యాంక్ ఏర్పాటుచేయాలని ఉన్నతాధికారులు, పాలకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల దృష్టికి పలువురు తీసుకెళుతున్నప్పటికీ ప్రయోజనం చేకూరడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాళ్లూరులో మరో బ్యాంక్ శాఖను ఏర్పాటుచేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.



యూటీఎఫ్ స్వర్ణోత్సవ కేకును కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న యూటీఎఫ్ నాయకులు


117 జీవోను రద్దు చేయాలి

- ఘనంగా యూటీఎఫ్ సర్ణోత్సవ వేడుకలు

కనిగిరి, ఆగస్టు 10: జీవో నెం.117ను రద్దు చేయాలని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు వి.మాలకొండారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం 50 వసంతాల సర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఏర్పడిందన్నారు. అప్పటినుంచి ఉపాధ్యాయుల సమస్యల కోసం అలుపెరగని పోరాటం సాగించిన ఏకైన ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ ఒక్కటేనని చెప్పారు. దివంగతులైన దాచూరి రామిరెడ్డి, చెన్నుపాటి లక్ష్మయ్య లాంటి ఎందరో మహనీయులు పోరాటాల ఫలితమే ఉపాధ్యాయులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యారంగంలో జరుగుతున్న పెనుమార్పులతో వ్యవస్థకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. 117 జీవోతో ప్రాథమిక విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల బాట పడుతున్నారన్నారు. ఈ జీవో రద్దుకోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత సంఘ కార్యాలయంలో సర్ణోత్సవం సందర్భంగా యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కేకు కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఖాజారహంతుల్లా, రుష్యేంద్ర, కె.వెంకటేశ్వర్లు (కేవీ), ఎం.బ్రహ్మారెడ్డి, కృష్ణమూర్తి, ఖాజాహుస్సేన్, పోతులూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థానంలో భక్తులకు అన్నదానం

పామూరు, ఆగస్టు 10: వరికుంటపాడులో కొలువైఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం పామూరు టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థాన నిర్వాహకులు స్వామి వార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, ఎస్.సాంబయ్య, మితికల నారాయణ, పిడుగు శ్రీనువాసులు, షేక్ నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.






అమ్మో.. అబార్షన్

పిండ దశలోనే జననాలను అడ్డుకుంటున్నారు. జననాలను బలవంతంగా అడ్డుకోవడాన్ని భ్రూణహత్యలుగా పరిగణిస్తున్నారు.. కానీ వీటిని అత్యంత దారుణంగా చేసేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే అబార్షన్ చేయాలి. కానీ జరుగుతున్న వాటిని చూస్తే ఆందోళనకరంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన శాతానికి మించి గుంటూరు జిల్లాలో గత ఏడాది అబార్షన్లు జరిగినట్లు సమాచారం. గత ఏడాది జిల్లాలో గర్భం దాల్చిన వారిలో 9 శాతం అబార్షన్లు జరిగాయంటే పరిస్థితి ఏవిధంగా తెలుసుకోవచ్చు. ఈ అబార్షన్లీ కూడా స్కానింగ్ సెంటర్లు అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల పరిధిలోనే జరిగాయని తెలుస్తోంది. అబార్షన్లపై ప్రభు త్వం కఠినమైన చట్టాన్ని తీసుకొచ్చినా ఫలితం లేదని జరిగిన కేసులను బట్టి అర్థమవుతుంది. ఈ చట్టం అమలుపై అధికారులు నిర్లక్ష్యంగా ఉండగా.. వైద్యులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. పుట్టబోయేది ఆడా.. మగా అన్న విషయం స్పష్టంగా తెలిసే సమయంలోనే ఎక్కువగా గర్భవిచ్ఛిత్తి జరుగుతున్నట్లు తెలుస్తోంది.

- పెరిగిపోతున్న గర్భవిచ్ఛిత్తి
- గత ఏడాది గుంటూరు జిల్లాలో 1789 కేసులు
- స్కానింగ్ సెంటర్లు ఉన్న ప్రాంతాల్లోనే ఎక్కువ
- ఆందోళన కలిగిస్తున్న వైద్యఆరోగ్యశాఖ నివేదికలు
- డబ్ల్యూహెచ్‌వో నిర్దేశించిన శాతానికి మించి అబార్షన్లు

గుంటూరు సిటీ, ఆగస్టు 10: నేషనల్ హెల్త్ మిషన్ గర్భిణుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి అనేక పథకాలు ప్రవేశపెట్టినా అబార్షన్లు ఆగడం లేదు. వందలకొద్దీ ప్రాణాలు పిండ దశలోనే గాలిలో కలిసి పోతున్నాయి. పుట్టబోయేది ఆడా.. మగా అన్న విషయం స్పష్టంగా తెలిసే సమయంలోనే ఎక్కువగా గర్భవిచ్ఛిత్తి జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో అబార్షన్లు (గర్భవిచ్ఛిత్తి) అధికంగా ఉన్నట్టు అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ అబార్షన్లు జరుగుతుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. 2024-2025 సంవత్సరానికి గాను (2024కు ముందు గర్భిణిగా నమోదై ప్రసవం కాని వారు కూడా ఈ లెక్కలోకి వస్తారు) జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల మంది గర్భం దాల్చగా... అందులో 1,789 మందికి అబార్షన్ అయినట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన శాతానికి మించి అబార్షన్లు జరిగినట్లు సమాచారం. గుంటూరు, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, తాడేపల్లి పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ అబార్షన్లు జరిగినట్లు వైద్య శాఖ నివేదిక చెబుతోంది. ఆయా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదైన గర్భాలలో 10 శాతం నుంచి 15 శాతం మేర అబార్షన్లు జరిగాయి. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మున్నంగిలో అధికంగా 16.8శాతం, ఫిరంగిపురంలో 14, నుదురుపాడులో 13.3, మన్నవలో 13.4 శాతం అబార్షన్లు నమోదయ్యాయి. ఈ కేంద్రాలన్నీ స్కానింగ్ సెంటర్లు ఎక్కువగా ఉన్న గుంటూరుకు సమీపంలోనే ఉన్నాయి. ఎలాంటి దురుద్దేశాలు లేకుండానే ఎక్కువ అబార్షన్లు జరుగుతున్నా దానికి వైద్య, ఆరోగ్యశాఖ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గర్భం దాల్చిన మొదటి నెల నుంచే సదరు గర్భిణీకి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని నేషనల్ హెల్త్ మిషన్ చెబుతోంది. అందులో భాగంగానే రాష్ట్రానికి ఏటా వందల కోట్ల నిధులు కేటాయిస్తోంది. అయినా అబార్షన్లు పెరుగుతుండడం.. గర్భిణులకు అందిస్తున్న సేవల్లో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపుతోంది.




లింగ నిర్ధారణ చట్టం నిర్వీర్యం..?

నగరం, పట్టణాల పరిధిలోని చాలా స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం నిర్వీర్యమైనట్లు కనిపిస్తోంది. సెంటర్లకు వచ్చిన వారిని సంతృప్తి పరిచేందుకు పుట్టబోయేది అబ్బాయా.. అమ్మాయా.. అనే విషయాన్ని ముం దుగానే వెల్లడిస్తున్నారు. కొంతమంది వైద్యులు కూడా ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పీసీపీఎన్ డీటీ యాక్టు ఉన్నా భ్రూణహత్యలు జరుగుతున్నట్లు రుజువవుతోంది. కలెక్టర్ ఆదేశాలతో వైద్య, ఆరోగ్య శాఖ స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్నా అవి తూతూ మంత్రమే అన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కార్యాలయంలోని కొందరు అధికారులు ఈ విషయంలో స్కానింగ్ సెంటర్లకు, అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తెనాలి ప్రాంతంలో ఎక్కువగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి రిపోర్ట్ వెల్లడి చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.



తీరంలో.. తానతందాన

- మొదలైన మందు, విందులు
- యథేచ్ఛగా టేబుల్స్ సిట్టింగ్‌లు
- పోలీసులు అనుమతిచ్చారని బరితెగింపు
- సీఆర్‌జడ్ నిబంధనల అమల్లో అధికారుల నిర్లక్ష్యం



రామాపురం తీరంలో ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన వేడుకల ఏర్పాట్లు (పాత చిత్రం)

చీరాల, ఆగస్టు 10: తీరం.. తానాతందానాలకు కేంద్రంగా మారింది. మందు, విందు పార్టీలు మళ్లీ మొదలయ్యాయి. పోలీసులు తమకు అనుమతిచ్చారని చెప్పుకుంటూ రిసార్ట్‌ల నిర్వాహకులు కొందరు బరితెగిస్తున్నారు. గతంలో చీరాల మండలం వాడరేవు నుంచి వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెం మధ్య రామాపురం, కఠారివారిపాలెం సమీపంలో ప్రమాదకర సంఘటనలు చోటుచేసుకోవడం.. పలువురు మృతి చెందడంతో కొద్ది రోజులు పర్యాటకులకు అనుమతి నిరాకరించారు. తరువాత కొన్ని జాగ్రత్తలు తీసుకుని పర్యాటకులకు అనుమతిచ్చారు. ఈ క్రమంలో తీరంలో టేబుల్స్ సిట్టింగ్(మందు పార్టీలకు)కు పోలీసులు అనుమతి ఇచ్చారని చెప్పుకుంటూ మూడు రిసార్టుల నిర్వాహకులు పది రోజుల నుంచి ప్రారంభించారు. అలానే ఈవెంట్స్ కూడా జరుగుతున్నాయి. తీరంలో ఆయా రిసార్టులకు ఎదురుగా ఉన్న సముద్ర తీరంలో రాత్రి వేళల్లో టేబుల్ సిట్టింగ్, క్యాంప్ ఫైర్, సంగీత్ కచేరీలు, ఈవెంట్స్ తదితరాలు మరలా ఊపందుకున్నాయి. అయితే పోలీసులు ఇచ్చిన అనుమతి అధికారికమా అంటే కాదనే సమాధానం వస్తోంది. ఈ క్రమంలో రిసార్ట్స్‌కు సంబంధం లేకుండా తీరంలో అప్పుడప్పుడు యువకులు మద్యం పార్టీలు చేసుకుంటున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితుల్లో విడిగా మద్యం పార్టీలు చేసుకునేవారిని అడ్డుకునే క్రమంలో రిసార్టుల నిర్వహకులకు లేని ఆంక్షలు తమ కెందుకని, కొందరు ఏకంగా టేబుల్స్ సిట్టింగ్స్‌లో తమకు అవకాశం కల్పించాలని వాదనలు, ఆ క్రమంలో ప్రైవేటు పంచాయితీలు జరిగిన సందర్భాలున్నాయి. ఈ పరిస్థితుల్లో అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. సీఆర్‌జడ్ నిబంధనలపై చర్యలు చేపట్టాల్సిన అధికారులను ప్రసన్నం చేసుకుంటూ రిసార్ట్‌ల నిర్వాహకులు అనధికారికంగా ముందుకు సాగుతున్నారు. ఇది అధికారులకు కాసుల పండుగగా మారిందనే ఆరోపణలున్నాయి.

అనుమతి లేకుండానే..

అధికారుల నిర్లక్ష్యంతో సీఆర్‌జడ్ (కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోంది. వాస్తవానికి సీఆర్‌జడ్‌లో ఏపీ సీజడ్ఎంఏ (కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ), పంచాయతీ, ఒడా (ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), పొల్యూషన్ కంట్రోలు బోర్డు, డీఎల్‌సీ (డిస్ట్రిక్ లెవల్ కమిటీ), ఏపీ సీఆర్ఏ (ఆంధ్రప్రదేశ్ కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ) తదితర విభాగాలకు చెందిన అనుమతులు కావాలి. ఆయా అనుమతులు వచ్చిన తర్వాత మాత్రమే నిర్మాణాలు చేపట్టాలి. లేదా ప్రాథమిక అనుమతులు పొందిన తరువాత నిర్మాణం పూర్తయ్యే నాటికన్నా పూర్తి అనుమతులు పొందాలి. ఈ క్రమంలో సదరు రిసార్టుల నిర్వాహకులకు ఉన్న అనుమతులపై ఆరా తీస్తే అందిరి గుట్టురట్టవుంది.

క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వానికి ఆదాయం

నిబంధనలకు అనుగుణంగా రిసార్టులకు అనుమతులు ఉంటే అధికారులు వెల్లడించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేని వాటిని క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వానికి అపరాధ రుసుం రూపేణా భారీగా ఆదాయం సమకూరుతుంది. పర్యాటకులకు, ప్రజలకు ఉన్న అపోహలు తీరిపోతాయి. ఈ చర్యలపై అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో వారికే తెలియాలి. నిర్మాణాల్లో నిబంధనలను తుంగలో తొక్కడమే కాకుండా ఒకరిని చూచి మరొకరు తీరంలోనే పార్టీలు, ఫంక్షన్లు పేరుతో మడచెట్లును మాయం చేస్తున్నారు. గత నెల 26న కలెక్టర్ జె.వెంకట మురళి సీజడ్ఎంపీ (కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్)పై ప్రజాభిప్రాయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎక్కువ మంది రిసార్ట్స్ నిర్వహకులే హాజరయ్యారు. తీరప్రాంతాల ప్రజల హాజరు తక్కువగా ఉంది. ఆ క్రమంలో మడచెట్ల ఆవశ్యత, సీఆర్‌జడ్ నిబంధనలు, రిసార్టులలో అనుమతులు ఉన్నవి, లేనివి తదితరాలకు సంబంధించి ప్రత్యేకంగా చర్చించారు. తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. అయితే నిబంధనలకు లోబడి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైతే సంబంధిత అధికారులు ఒక్కరికి కూడా నోటీసు ఇచ్చిన దాఖలాలు లేవు. తదుపరి ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



సీఆర్‌జడ్ ప్రజాభిప్రాయసేకరణలో రిసార్ట్స్ నిర్వాహకులు, తీరప్రాంత గ్రామాల ప్రతినిధులు (ఫైల్)



చెత్తశుద్ధిలో.. అవినీతి కంపు

- స్వచ్ఛాంధ్ర ముసుగులో కోట్ల దోపిడీ
- రీసైక్లింగ్ పేరిట నకిలీ బిల్లుల సృష్టి
- మంగళగిరి, తాడేపల్లిలో భారీ కుంభకోణం
- కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధుల కుమ్మక్కు
- వెలుగులోకి వస్తున్న గత ప్రభుత్వ అక్రమాలు



మంగళగిరి, ఆగస్టు 10: మున్సిపల్ కేంద్రాల్లో అటు ప్రజలు ఇటు అధికారులకు ప్రధాన సమస్య చెత్తశుద్ధి. వీధుల్లో పేరుకుపోయే చెత్త నిల్వలతో అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలు ఇబ్బంది పడుతుంటారు. అలాగే ఆ చెత్తాచెదారాల తొలగింపు మున్సిపాలిటీలకు ప్రధాన సమస్య. అయితే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీల్లో మాత్రం ఈ చెత్తశుద్ధితోనే రూ.కోట్లు కొట్టేశారు. వైసీపీ హయాం లో పాలకవర్గం లేకపోవడాన్ని అవకాశంగా తీసుకుని చెత్తను శుద్ధి చేసే పనుల్లో చిత్తశుద్ధిని పక్కనపెట్టి కుంభకోణానికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఈ అవినీతి భాగోతాన్ని నడిపించినట్టు విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో ఘనేశ్వర, ఆకాంక్ష, అవినాష్, తరుణి, సృష్టి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో చెత్తశుద్ధి పనులను చేపట్టాయి. చెత్తను ఆరబెట్టి, ఎండబెట్టి, పొడి చెత్తను ట్రోమాల్ మిషన్‌లో వేసి రీసైక్లింగ్ చేసి జిందాల్ ప్లాంటుకు తరలించాలి. కానీ, అవేవీ చేయకుండానే పనులు చేసినట్టుగా రికా ర్డుల్లో చూపించి నకిలీ బిల్లులను సృష్టించి నిధులు దోచేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు, మునిసిపల్ అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు కుమ్మక్కై బలవంతంగా ఫీల్డ్ కో ఆర్డినేటర్లతో పనులు పూర్తయినట్టుగా సంతకాలు పెట్టించినట్టు సమాచారం. ఏపీ అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజరు రఘు నాథరెడ్డి ఈ ఏడాది మేలో రాజీనామా చేశారు. గుంటూరు జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్‌తో పాటు మరో 8 మంది సిబ్బంది రాజీనామాలు చేయడం చూస్తుంటే చెత్త రీసైక్లింగ్ పనుల్లో ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాలకు 2022లో స్వచ్ఛాంధ్ర కార్పొ రేషన్ ఆధ్వర్యంలో విడివిడిగా టెండర్లను పిలిచారు. తాడేపల్లి పరిధిలోని ఎయిమ్స్ రోడ్డు కొలనుకొండ డంపింగ్ యార్డు, మంగళగిరి నిడ మర్రు రైల్వే గేటు వద్ద చెత్త రీసైక్లింగ్ బయో మైనింగ్‌కు ఘనేశ్వర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టెండర్లు దక్కించుకుని 2022 ఆఖర్లో పనులను ప్రారంభించింది. మంగళగిరి డంపింగ్ యార్డులో లక్షా 33 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా, సుమారు 30 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగతా చెత్తను కొలనుకొండ వద్ద శర్వాణీ రెడీమిక్స్ ఎదుట ఉన్న 40 అడుగుల లోతు గుంతల్లో పోశా రు. తాడేపల్లి కొలనుకొండ డంపింగ్ యార్డులో 95 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా, సుమారు 20 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగిలిన చెత్తతో డంపింగ్ యార్డు ప్రాంతంలో పక్కనే ఉన్న గుంతలు, చెరువును పూడ్చివేసి చేతులు దులుపుకున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బంది, ఫీల్డ్ కోఆర్డి నేటర్లు జరుగుతున్న అక్రమాలను ఉన్నతా దికారుల దృష్టికి తీసుకు వెళ్లి ... మున్సిపల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు మిన్నకుండి పోయారనే ఆరోపణలున్నాయి. రీసైక్లింగ్ అనంతరం ఎన్ని లారీల్లో చెత్తను గుంటూరులోని జిందాల్ ప్లాంటుకు తరలించారో సరైన సమాచారం లేదు. వంద శాతం పనులను పూర్తిచేసినట్లు చూపించి బిల్లులను రాబట్టుకున్నారు. కాంట్రాక్టర్లు, అధికార యంత్రాంగం, వైసీపీ ప్రజాప్రతినిధుల కుమ్మక్కై చేసిన ఈ చెత్త రీసైక్లింగ్ ప్రక్రియ కుంభకోణంలో సుమారు రూ.9 కోట్ల మేర అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ దోపిడీలో ఓ ఇంజనీరింగ్ అధికారికి రూ.20 లక్షలు ముట్టినట్టుగా సమాచారం. అప్పటి పట్టణాభివృద్ధి శాఖ చీఫ్ సెక్రెటరి శ్రీలక్ష్మీ ప్రమేయంతోపాటు మంగళగిరి మాజీ ఎమ్మెల్యే బంధువు అనధికార పార్టనర్‌గా వ్యవహరించినట్లు తెలి సింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించి పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంటీఎంసీలో విజిలెన్స్ విచారణ?

- గత ఐదేళ్ల అభివృద్ధి పనుల ఫైళ్లు స్వాధీనం

మంగళగిరి: వైసీపీ పాలనలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ(ఎంటీఎంసీ)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి ఎంటీఎంసీ ప్రధాన కార్యాలయానికి విజిలెన్స్ అధికారుల బృందం చేరుకుని అనేక ఫైళ్లను తీసుకువెళ్లినట్లు తెలిసింది. గత 2019 నుంచి 2024 ఎన్నికల వరకు ఎంటీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లను విజిలెన్స్ బృందం పరిశీలించనుంది. ఐదేళ్లు పాలకవర్గం లేకపోవడంతో అప్పటి వైసీపీ ముఖ్యనేత ఏకఛత్రాధిపత్యం చెలాయించారు. అప్పట్లో అభివృద్ధి పనులకు విపరీతమైన అంచనాలు వేయించడంతోపాటు టెండర్లు లేకుండా పనులను జరిపించడం, పనులు పూర్తయ్యాక మొక్కుబడిగా టెండర్లను పిలవడం వంటి అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ప్రైవేటు కాంట్రాక్టర్లచే టెండర్లపై చేయించాల్సిన పనులను సైతం మున్సిపల్ శానిటరీ వర్కర్లతో జరిపించి ఆ సొమ్ములను కూడా జేబుల్లో వేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిని నిగ్గు తేల్చేందుకు కొత్త ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

అధికార పంచన కోసం ఆత్రం

- పావులు కదుపుతున్న ఓ క్రికెట్ బుకీ
- టీడీపీలో చేరి దందా కొనసాగించేందుకు ప్రయత్నం

చీరాల, ఆగస్టు 10: అయనో క్రికెట్ బుకీ. ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరతాడు. తన దందాకు అడ్డు లేకుండా పోలీసుల నుంచి ఇబ్బందులు రాకుండా అధికార పార్టీతో జతకడతాడు. ప్రస్తుతం అధికారం మారడం.. అతడి దందాలకు ప్రతిబంధకంగా మారింది. దీంతో టీడీపీ పంచన చేరేందుకు ఆత్రుత పడుతున్నాడు. మున్సిపల్ కౌన్సిలర్ సమీప బంధువైన ఇతడు నిన్న, మొన్నటి వరకు వైసీపీతో అంటకాగి తన దందాను సాగించాడు. ఆ బుకీ గతంలో ఒకటి, రెండు పర్యాయాలు ఊచలు లెక్కించాడు. అధికారం మారింది. అధికారం అండ లేకపోతే బెట్టింగుల కు పోలీసుల నుంచి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయి. ఈ క్రమంలో తన దందా కొనసాగాలంటే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించాలి. అందుకు అధికార సిఫార్సు కావాలి. దీంతో టీడీపీతో జత కట్టేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. గత నెల 31న మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ రోజున ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య మున్సిపల్ ఎక్స్‌అఫిషియో మెంబరు హోదాలో అందరి భాగస్వామ్యంతో చీరాలను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసుకుందామని పిలుపివ్వగా సహకరిస్తామని ఛైర్మన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. కౌన్సిలర్ బంధువైన క్రికెట్ బుకీగా చిరపరిచితుడైన వ్యక్తి ఇదే అవకాశంగా టీడీపీలో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ క్రమంలో వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇప్పుడు పార్టీలో చేరతామని వచ్చేవారిపై అప్రమత్తంగా ఉండాలని కూటమి శ్రేణులు హెచ్చరిస్తున్నాయి.

విద్యాదాత కుప్పుస్వామి

- విద్యాదానం గొప్పదని నిరూపించారు
- విగ్రహావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పర్చూరు, ఆగస్టు 10: అన్నదానం కన్నా.. విద్యాదానం గొప్పదని నిరూపించిన మహనీయుడు జాగర్లమూడి కుప్పుస్వామి అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. విద్యాదాత, రాజకీయవేత్త, స్వర్గీయ కుప్పుస్వామి కాంస్య విగ్రహ ఆవిష్కరణ బాపట్ల జిల్లా కారంచేడులో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు పల్లెలు వైపు చూడని సమయంలో కుప్పుస్వామి గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన మహోన్నతులన్నారు. పదవి పదిమంది మేలు కోసమని, తోటివారికి సాయపడడమే జీవిత పరమార్థమని నమ్మి నిరూపించిన వ్యక్తి కుప్పుస్వామి అని కొనియాడారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కారంచేడు ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిన వ్యక్తి కుప్పుస్వామి అని తెలిపారు. తెలుగుభాష, ఆలయాల పునరుద్ధరణ, కవిగా, విద్యాదాతగా కుప్పుస్వామి ఎన్నో సేవలందించారన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ కుప్పుస్వామి సేవలు చిరస్మరణీయమని, విద్యాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఇలాంటి వ్యక్తులు బావితరాలకు దిక్సూచి వంటి వారని కొనియాడారు. కుప్పుస్వామి సేవలను కుటుంబ సభ్యులు నేటికీ కొనసాగించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకుడు బండారుపల్లి హేమంత్‌కుమార్‌తో పాటు జాగర్లమూడి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం దగ్గుబాటి దంపతుల ఆహ్వానం మేరకు వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే ఏలూరి వారి నివాసానికి వెళ్లి తేనీటి విందును స్వీకరించారు.



కుప్పుస్వామి విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు, పురందేశ్వరి, కామినేని శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఏలూరి సాంబశివరావు

జిల్లాలో 18 మంది ఎస్ఐలు బదిలీ

బాపట్ల, ఆగస్టు 10: జిల్లాలో ఎస్ఐల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 12 మందిని బదిలీ చేయగా శనివారం మరో 18 మందిని మార్చారు. ఈ మేరకు ఎస్పీ తుషార్‌డూడీ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న 14 మందికి తాజా బదిలీల్లో పోస్టింగ్‌లు దక్కాయి.

పేరు	ప్రస్తుతం	పోస్టింగ్
ఎం.మోహన్	వీఆర్	రేపల్లె
బండ్ల భార్గవ్	వీఆర్	నగరం
ఎండీ ఫిరోజఫాతిమా	వీఆర్	చోడాయపాలెం
జి.ఏడుకొండలు	వీఆర్	కొల్లూరు
జి.రవికృష్ణ	వీఆర్	వేమూరు
జానకి అమరవర్ధన్	వీఆర్	అమర్తలూరు
ఎం.విజయ్‌కుమార్	వీఆర్	బాపట్లటౌన్
సీహెచ్ చంద్రవతి	వీఆర్	బాపట్లటౌన్
ఆర్.స్వామిశ్రీనివాస్	వీఆర్	చందోలు
బాతిన వినోద్‌బాబు	వీఆర్	జేపంగులూరు
వి.వెంకట్రావు	వీఆర్	కారంచేడు
జి.రాజ్యలక్ష్మి	చోడాయపాలెం	అడవులదీవి
పి.కోటేశ్వరరావు	నగరం	రేపల్లె
సి.హెచ్.ప్రవీణ	వీఆర్	అద్దంకి
బి.అజిత	వెదుళ్ళపల్లి	చీరాల వన్‌టౌన్
ఎస్‌కె.అబ్దుల్‌రజాక్	బాపట్లటౌన్	చీరాల వన్‌టౌన్
ఎం.శ్రీనివాసరావు	వీఆర్	చీరాల టూ టౌన్
వి.నాగరాజు	వీఆర్	చీరాల టూ టౌన్



నగరంలోని కర్నూలు రోడ్డు ఫ్లైవోవర్ బ్రిడ్జి కింద వర్షానికి నిలిచిన నీరు

ఉపశమనం

- మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత
- తర్వాత జల్లులతో ఊరట

ఒంగోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం భిన్న వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం వరకు జిల్లా అంతటా ఎండ తీవ్రత కొనసాగగా సాయంత్రం పలుచోట్ల జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షమే కురవడంతో ప్రజానీకం కాస్తంత ఊరట చెందారు. అదేసమయంలో పట్టణ ప్రాంతంలో ప్రత్యేకించి ప్రజానీకం ఎక్కువగా వీధుల్లో ఉండే వేళ జల్లులు పడటంతో ఇబ్బందిపడ్డారు జిల్లాలో వారం పదిరోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉంది. సాధారణం కన్నా గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఐదారు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. శనివారం కూడా అలాంటి పరిస్థితే మధ్యాహ్నం వరకు ఉంది. ఒంగోలులో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.0 డిగ్రీలు నమోదు కాగా చాలాప్రాంతాల్లో అదేస్థాయిలో ఎండలతోపాటు ఉక్కపోత కొనసాగింది. అయితే సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. పలుప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షమే కురిసింది. చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు, కొండపి, జరుగుమల్లి, కనిగిరి, గిద్దలూరు, కురిచేడు, పొదిలి, ముండ్లమూరు, కేకేమిట్ల తదితర మండలాల్లో ఒక మోస్తరు వాన పడగా పలు ఇతర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. తీవ్ర ఎండలతో ఇక్కట్లు పడుతున్న ప్రజానీకానికి వాడుముఖం పట్టిన పైర్లకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. అదేసమయంలో పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకించి ఒంగోలు నగరంలో ప్రజానీకం అవస్థలు పడ్డారు. జనం రద్దీ ఉండే సమయంలో వర్షం పడటంతో ప్రధాన వీధుల్లో నీటి ప్రవాహం పెరిగి వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. నగరంలోని ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాగే వీధి వ్యాపారులు, చిరువ్యాపారులు అవస్థలు పడ్డారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రియుడి మోజులో ఘాతుకం

- భర్తను దారుణంగా హత్యచేయించిన భార్య
- నెల్లూరు కిరాయి హంతకులకు సుపారీ
- వివాహేతర సంబంధమే కారణం
- ఆరుగురు నిందితుల అరెస్టు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 10: ప్రియుడు మోజులో పడిన ఓ మహిళ భర్తను దారుణంగా హతమార్చింది. అందుకు ప్రియుడితో కలిసి నెల్లూరుకు చెందిన సుపారీ గ్యాంగ్‌ను మాట్లాడుకున్నారు. పక్కా ప్రణాళికతో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయారు. ఈమేరకు ఆరుగురు నిందితులను పొదిలి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల గ్యాలెక్సీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ దామోదర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 3న పొదిలిలో చల్లా వెంకటనరేంద్రబాబును భార్య లక్ష్మీప్రియ, తన ప్రియుడుతో కలిసి కిరాయి హంతకులను పిలిపించి హత్య చేయించింది. అయితే ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. పోలీసులు అత్యంత వేగవంతంగా దర్యాప్తు చేసి కేసును చేధించారు. ఈ కేసులులో నిందితులైన హతుడు భార్య చల్లా లక్ష్మీప్రియ, ఆమె ప్రియుడు పొదిలి పీఎస్ఆర్‌కాలనీకి చెందిన కొండా శశికుమార్, నెల్లూరుకు చెందిన షేక్ నహీద్, షేక్ ఫజ్లు, సయద్‌సిద్దిక్, షేక్ ముబారక్‌లను పొదిలి సమీపంలో కాటూరివారిపాలెం వద్ద అనుమానా స్పదంగా ఉండగా శనివారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

హత్య జరిగిందిలా..

కేంద్ర ప్రభుత్వ ప్రావిడెంట్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చల్లా వెంకటనరేంద్రబాబు పొదిలిలోని పీఎస్ఆర్ కాలనీ 3వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. ఎనిమిదేళ్ల క్రితం లక్ష్మీప్రియతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. అయితే ఎనిమిది నెలల క్రితం లక్ష్మీప్రియకు అదే ప్రాంతంలో నివాసం ఉంటూ డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తున్న కొండా శశికుమార్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త వారి మధ్య వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం వెంకటనరేంద్రబాబుకు తెలిసి భార్యను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అయితే లక్ష్మీప్రియ మాత్రం తన భర్తను అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడుతో కలిసి పథకం రూపొందించారు. అదే సమయంలో నెల్లూరులోని నేతాజీనగర్‌కు చెందిన కిరాయి హంతకులను కలిసి హత్య చేసేందుకు రూ.2లక్షలు సుపారీ ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. రూ.50వేలు అడ్వాన్స్ ఇచ్చారు. ఈమేరకు లక్ష్మీప్రియ, శశికుమార్, మరో నలుగురు కిరాయి హంతకులు కలిసి ఈనెల 2వ తేదీన అర్ధరాత్రి నరేంద్రబాబు ఇంట్లో నిద్రిస్తుండగా గొంతుకు తాళ్లు వేసి లాగి దారుణంగా హత్య చేశారు. అంతేగాకుండా నోట్లో మద్యం పోశారు. అనంతరం తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది లక్ష్మీప్రియ. అయితే అనుమానించిన వెంకటనరేంద్రబాబు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హత్య కేసును ఛేదించారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ

హత్య కేసును అత్యంత వేగంగా చేధించిన పొదిలి సీఐ మల్లిఖార్జునరావు, ఎస్సై జి.కోటయ్య, తర్లుపాడు హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, గౌతమ్‌కుమార్, రమేష్ బాబు, వీరరాజులను ఎస్పీ దామోదర్ అభినందించారు. ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసును చేధించి హత్యకేసుగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న పోలీసులకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు.

99 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్

ఒంగోలు(విద్య), ఆగస్టు 10 : జిల్లాలో వివిధ మండలాల్లోని 99 బడులకు పాఠశాల యజమాన్య కమిటీ(ఎస్ఎంసి)ల ఏర్పాటుకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శనివారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మొదటి షెడ్యూల్ ప్రకారం జిల్లాలో 2,405 పాఠశాలలకు ఎస్ఎంసీ కమిటీల ఏర్పాటుకు ఎన్నికల నోటిఫికేషన్ జారీచేశారు. అయితే కోరం లేక పోవడం, ఇతర కారణాలతో 99 చోట్ల ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఆ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ తాజా షెడ్యూల్‌ను ప్రకటించారు. దీని ప్రకారం జిల్లాలో 67 ప్రాథమిక, 15 ప్రాథమికోన్నత, 17 హైస్కూళ్లలో హెచ్ఎంలు ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీచేశారు. మధ్యాహ్నం ఓటర్ల జాబితాను విడుదల చేసి పాఠశాల నోటీసు బోర్డులో పెట్టారు. ఈనెల 12న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించి అదేరోజు సాయంత్రానికి తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. 17న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకుంటారు. అదేరోజు మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుని తర్వాత ఎస్ఎంసీ మొదట సమావేశం నిర్వహిస్తారని డీఈవో డి.సుభద్ర తెలిపారు.

ప్రత్యేక పంథా!

- అధికారుల నియామకంపై అధిష్ఠానం నిఘా, పరిశీలనలు
- రాష్ట్రస్థాయిలోనే ఆర్డీవోలు, డీఎస్పీల నియామకాలు
- సీఐ, ఎస్సై, తహసీల్దార్, ఇతర ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేలకు పవర్
- పనితీరు బాగోలేకపోతే చెక్
- పార్టీ నేతలకు పదవుల పంపకంపై సర్వేలు
- నియోజకవర్గానికి వంద మంది టీడీపీ నేతల పేర్లు తీసుకొని ఆరా
- అభిప్రాయ సేకరణకు శ్రీకారం



అధికారులు, ఉద్యోగుల బదిలీలు.. నామినేటెడ్ పదవులు, ఇతర అంశాలపై టీడీపీ ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తోంది. సరికొత్త పంథాతో ముందుకెళ్తోంది. గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన, అక్రమాలకు పాల్పడిన అధికారులను నిరోధించడం, టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులోభాగంగా జిల్లాస్థాయి అధికారుల పోస్టింగ్‌లు, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీల నియామకాలను రాష్ట్రస్థాయిలోనే పూర్తిచేస్తోంది. సీఐ, ఎస్సై, తహసీల్దార్ లాంటి అధికారుల పోస్టింగ్‌ల విషయంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు పెత్తనం ఇచ్చినప్పటికీ వారు సూచించిన అధికారులపై మళ్లీ పరిశీలన చేపడుతోంది. గత పనితీరు ఆధారంగా కొందరి విషయంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలను సైతం పక్కనపెడుతోంది. నియోజకవర్గ స్థాయిలో రేషన్‌డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏల నియామకాలకు సంబంధించి ఎమ్మెల్యేలకు పూర్తి ప్రాధాన్యం ఇచ్చి నామినేటెడ్ పదవుల విషయంలో మాత్రం ప్రత్యేక విధానానికి శ్రీకారం పలికింది. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలోని టీడీపీ నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టింది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ గతంలో ఎన్నడూలేని విధంగా ఈ పర్యాయం సరికొత్త విధాలను అనుసరిస్తోంది. ఇటు అధికారుల బదిలీల నుంచి అటు పార్టీ నేతలకు పదవుల పందేరం వరకూ నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తోంది. అందులో కొన్ని అంశాలతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు విభేదిస్తున్నారు. ఆ విషయాన్ని కొందరు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లగా వారు చెప్పినది సరైనదైతే వారి మాటకే ప్రాధాన్యం ఇస్తోంది. లేనిపక్షంలో తమ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని ఎమ్మెల్యేలకు తేల్చిచెబుతోంది.

అధికారుల విషయంలో ద్విముఖ వ్యూహం

అధికారుల నియామకాల్లో టీడీపీ ప్రభుత్వం ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. జిల్లాస్థాయిలో కలెక్టర్, ఎస్పీలతోపాటు కొన్ని ముఖ్యమైన శాఖల అధికారుల నియామకాలను పూర్తిగా రాష్ట్రస్థాయిలోనే చూస్తోంది. మంత్రులకు మాత్రమే ముందస్తు సమాచారం ఇస్తోంది. ఆర్డీవో, డీఎస్పీ లాంటి అధికారుల నియామకాల విషయంలోనూ రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం జరిగిపోతోంది. అదేసమయంలో సంబంధిత అధికారుల పూర్వాపరాలపై టీడీపీ అధిష్ఠానం వివిధ రూపాల్లో పరిశీలన చేపడుతోంది. అందుకు కొన్ని ప్రత్యేక సంస్థల ద్వారా సమాచారం సేకరించుకుంటున్నట్లు తెలిసింది. టీడీపీకి అనుకూలంగా ఉన్న సీనియర్ అధికారులు, విశ్రాంత అధికారుల నుంచి కూడా సమాచారం తెలుసుకుంటోంది. అలా పైస్థాయి అధికారులను ఎంపిక చేసి పోస్టింగ్‌లు ఇస్తున్న కూటమి ప్రభుత్వం మరోవైపు కిందిస్థాయి అధికారుల విషయంలోనూ ఒక ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు లేక ముఖ్యమైన నాయకులు కిందిస్థాయి పోస్టులకు ఎవరినైనా సిఫార్సు చేస్తే పూర్తి స్థాయిలో ఆ అధికారుల విషయాన్ని పరిశీలించి సమంజసమైతే గ్రీన్‌సిగ్నల్ ఇస్తోంది. లేదంటే తిరస్కరిస్తోంది.

డీఎస్పీల విషయంలోనూ రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం

జిల్లాలోని ఒక కీలకమైన డీఎస్పీ నియామకం విషయంలో అధిష్ఠానం ఒక పేరు సూచిస్తే సదరు ఎమ్మెల్యే తనకు కావాల్సిన అధికారి పేరును సిఫార్సు చేయడమే కాక అతన్నే వేయాలని పట్టుబట్టారు. 'పోలీసు శాఖలో ఉన్నతాధికారి ద్వారా మీరు సూచించిన డీఎస్పీ మంచి వారే, అతనికి వేరే చోట పోస్టింగ్ ఇస్తున్నాం.' అని అధిష్ఠానం సమాచారం పంపినట్లు తెలుస్తోంది. ఆయన ససేమిరా అనడంతో చివరికి ఎమ్మెల్యే చెప్పిన వారికే పోస్టింగ్ ఇచ్చారు. మరో డీఎస్పీని రెండు నియోజకవర్గాల నాయకులు కోరుకున్నా తమ వద్ద ఉన్న సమాచారంతో అధిష్ఠానం ఆయన్ను పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు పంపింది. సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్లు ఇతరత్రా కింది స్థాయి ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేల సిఫార్సులకే ప్రాధాన్యం ఇస్తోంది. ఆ విషయంలోనూ ముందు జిల్లాలోని ఎస్పీలు, ఆపైన ఐజీలతోపాటు నిఘా విభాగం నుంచి సమాచారం సేకరించుకుంటున్నారు. తదనుగుణంగానే ఎమ్మెల్యేలు సూచించిన సీఐ, ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇస్తున్నారు. వారి పరిశీలనలో ఎమ్మెల్యేలు సూచించిన వారిలో ఎవరిపైన అయినా వ్యతిరేక నివేదిక వస్తే వారికి పోస్టింగ్‌లు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఏర్పడి కొత్త ఎమ్మెల్యేలు బాధ్యతలు చేపట్టి దాదాపు రెండు నెలలు అవుతున్నా బదిలీల వ్యవహారం జాప్యం కావడానికి ఇదే కారణమని భావిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల విషయంలోనూ ప్రత్యేక విధానం

నామినేటెడ్ పదవుల విషయంలోనూ టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక విధానాన్ని అవలంబిస్తోంది. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన, చేస్తున్న నాయకులు ఎవరు అన్న విషయాన్ని గుర్తించేందుకు ప్రత్యేక పరిశీలన చేపట్టింది. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల విషయంలో ఎలా ఉన్నా జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవులపై జిల్లా నాయకులు, ఎమ్మెల్యేలకు పూర్తి అధికారం గతంలో ఇచ్చేవారు. ఈసారి అలాకాకుండా ప్రతి నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవులు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉన్న వందమంది పార్టీ నాయకుల పేర్లు ఇవ్వాలని అధిష్ఠానం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులను కోరినట్లు తెలిసింది. ఆ మేరకు కొందరు ఎమ్మెల్యేలు పేర్లు ఇస్తూనే నియోజకవర్గస్థాయి కీలకంగా ఉండే మార్కెట్ కమిటీలు, ప్రత్యేక దేవస్థానాలు లాంటి పదవులకు ప్రత్యేకంగా కొంతమందిని సూచిస్తున్నట్లు తెలిసింది. కొందరైతే మీరే తుదినిర్ణయం తీసుకునే పరిస్థితుల్లో మేము ఒక పేరు ఇచ్చి మరొకరి పేరు ఇవ్వలేదన్న అపవాదు పొందటం ఇష్టం లేదని చెప్తూ అసలు పేర్లు ఇచ్చేందుకే సిద్ధపడలేదని తెలిసింది.

పార్టీ నేతలపై ప్రత్యేక సర్వే

టీడీపీ అధిష్ఠానం పార్టీలో సీనియర్ నాయకుల గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేపట్టింది. ఆ మేరకు పార్టీ సభ్యత్వం ఉన్న వారిని ఆయా స్థాయిల వారీ విభజిస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ సభ్యులుగా ఉన్న వారందరికీ ఆన్‌లైన్ విధానంలో ఒక సమాచారం పంపి అందులో మీ గ్రామంలోని నాయకుల్లో ఎవరు గత ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేశారో తెలపండి అని కోరుతోంది. అలాగే పార్టీ మండల కమిటీల్లో ఉన్న నాయకుల పేర్లను తెలియజేసి వారిలో ఎవరు బాగా పనిచేశారని తెలుసుకుంటోంది. నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీ సభ్యులకు ఒక సమాచారం పంపి ఆ కమిటీలో ఎవరు ఉత్తములో చెప్పాలని అడుగుతున్నట్లు సమాచారం. ఇదే విధానంలో జిల్లాస్థాయి టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుల్లో ఎవరు పార్టీ కోసం పనిచేశారో, చేయలేదో తెలుసుకుంటోంది. ఇలా గుర్తించిన నాయకుల పేర్లు ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాలో ఉన్నాయో లేదో చూసి తదనుగుణంగా నామినేటెడ్ పదవుల కేటాయింపుపై తుదినిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌ల నియామకంలో ఇప్పటికే ఒక పరిశీలన చేపట్టిన టీడీపీ కిందిస్థాయి పదవుల విషయంలో చేయిస్తున్న సర్వే ఎంతమేరకు సఫలీకృతమవుతుందో చూడాల్సి ఉంది.

అంటకాగిన సీఐలకు బ్రేక్

- ఆరోపణలు లేని ఒకరిద్దరికి అవకాశం
- జిల్లాలో కొన్ని పోస్టింగ్‌ల జాప్యానికి అదే కారణం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

శాసనసభ్యులు, ఇతర ముఖ్యనాయకులు ఎంత వత్తిడి చేసినా గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగిన పోలీసు అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఇప్పటికే జరిగిన డీఎస్పీ, సీఐల పోస్టింగ్‌లలో ఆ విషయం తేటతెల్లం కాగా జిల్లాలో మరికొన్ని సర్కిళ్లకు సీఐల నియామకంలో జాప్యానికి ఆ సమస్యే కారణమైనట్లు తేటతెల్లమైంది. ఉమ్మడి జిల్లాలో పొదిలి, మార్కాపురం, వైపాలెం, త్రిపురాంతకం, కంభం సీఐల పోస్టింగ్‌ల విషయంలో అంతర్మథనం జరుగుతోంది. అందులో పొదిలి సర్కిల్‌కు స్థానిక నేతలతో సిఫార్సు చేయించుకున్న యు.శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చేదే లేదని అధిష్ఠానం తేల్చేసింది. నిన్నమొన్నటివరకు బాపట్లలో ఉన్న ఆయనను పొదిలికి బదిలీ చేయాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సిఫార్సు చేశారు. ఇప్పటికే ఆయన ఒకటి రెండు చోట్ల పోస్టింగ్ కోసం ప్రయత్నించి తిరస్కరణకు గురైనట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో సింగరాయకొండ సీఐగా ఉన్న శ్రీనివాసరావు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించిన విషయం ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టిలో కూడా ఉంది. జర్నలిస్టులకు బెయిల్ తెచ్చుకునే అవకాశం కూడా లేకుండా కోర్టులో హాజరుపరచటం, మూడురోజులు వారు జైలులో ఉండే విధంగా వ్యవహరించి విమర్శల పాలయ్యారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులకు అప్పటి పోలీసు అధికారుల వ్యవహారశైలిపై ఇటీవల రాష్ట్రప్రభుత్వానికి, డీజీపీకి ఒక నివేదికను జర్నలిస్టు సంఘం కూడా ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఉన్నతాధికారులు ఫోన్ చేసి శ్రీనివాసరావును వేయలేమని చెప్పి వీఆర్‌కు పంపించారు. వైపాలెంకు గత ప్రభుత్వంలో పూర్తికాలం సీఐగా పనిచేసిన సుధాకర్‌ను టీడీపీ నాయకులు సిఫార్సు చేశారు. ఆయన విషయంలోను అధిష్ఠానం అభ్యంతరం పెట్టింది. నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ కీలకనేత బంధువు కావటంతో ఆయన సిఫార్సు మేరకు పెండింగ్‌లో ఉంచారు. త్రిపురాంతకం సీఐగా సూర్యనారాయణ పేరును దర్శి టీడీపీ ఇన్‌చార్జి సూచించారు. ఆయన విషయంలోను అభ్యంతరాలు ఉన్నాయని అధిష్ఠానం సంకేతాలిచ్చినట్లు తెలిసింది. దీంతో మంత్రి రవికుమార్ ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. కంభం సీఐగా పొదిలిలో ఉన్న మల్లికార్జున పేరును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచించారు. కారణం ఏమైనప్పటికీ ఇంకా ఆయనకు బదిలీ ఉత్తర్వులు రాలేదు. కనిగిరి, పామూరు ప్రస్తుత సీఐలను ఈనెలలో కూడా కొనసాగించి సెప్టెంబరులో కొత్తవారిని కోరుకుంటానని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అధిష్ఠానానికి చెప్పినట్లు తెలిసింది. వీరు మినహా మిగిలిన సీఐ పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రస్తుత ఒంగోలు డీఎస్పీ కిషోర్‌ను మార్కాపురం డీఎస్పీగా నియమించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి సూచించారు. దానిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

వైసీపీవి చౌకబారు రాజకీయాలు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజం



దర్శి, ఆగస్టు 10: గత ఎన్నికల్లో వైసీపీని ప్రజలు ఘోరంగా ఓడించినప్పటికీ ఆపార్టీకి ఇంకా జ్ఞానోదయం కలగలేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. ఈమేరకు శనివారం ఓప్రకటన విడుదలచేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి ఎలాంటి నష్టం జరగకపోయినప్పటికీ వైసీపీ చిల్లర రాజకీయం చేస్తుందని విమర్శించారు. దళితులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాయకులు ప్రయత్నించటం శోచనీయమన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తున్నదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి రాక్షసంగా వ్యవహరించిన ఆపార్టీ నాయకులు నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి ఎలాంటి నష్టం వాటిల్లకపోయినా స్థానిక ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శిలో నిరసన కార్యక్రమం చేపట్టడం శోచనీయమన్నా రు. గతంలో టీడీపీ ప్రభుత్వం పేదలకు అందించే విదేశీ విద్యా పథకానికి అంబేడ్కర్ విదేశీ విద్యపేరుతో అమలుచేయగా, వైసీపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ పేరు మార్చడంపై సమాధానం చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలపై ప్రభుత్వ రాజముద్రను తొల గించి జగన్ బొమ్మను ఎందుకు ముద్రించారని ప్రశ్నించారు. దళితులు, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకులు ఇదే విధానాన్ని కొనసాగిస్తే తగిన గుణపాఠం చెబుతారని డాక్టర్ గొట్టి పాటి లక్ష్మి పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి



విద్యార్థులను బలి తీసుకొన్న నీటి గుంత (ఇన్‌సెట్లో) చరణ్, గౌతమ్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

పామూరు, ఆగస్టు 10: ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈఘటన శనివారం పామూరు మండలంలో చోటుచేసుకుంది. పామూరు పంచాయతి పరిధిలోని డీవీ పాలెంలో నివాసం ఉంటున్న పసుపులేటి నారాయణ, విజయ దంపతుల కుమారుడు చరణ్ (18), స్థానిక విరువూరు రోడ్డులో నివాసం ఉంటున్న పసుపులేటి వెంకటేశ్వర్లు, సుజాతల ఏకైక కుమారుడు గౌతమ్ (18) పామూరు ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. రెండో శనివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో సరదాగా ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి డీవీ పాలెం వద్ద పామూరు పాతచెరువులో ఉన్న నీటి గుంతలోకి దిగారు. ఈత కొట్టిన అనంతరం అందరూ బయటకు వచ్చారు. ఈక్రమంలో పుసుపులేటి గౌతమ్ నీటి బురదలో ఇరుక్కొని బయటకు రాలేకపోతున్న సమయంలో స్నేహితున్ని కాపాడేందుకు చరణ్ నీటి గుంతలోకి దిగాడు. ఈత వచ్చిన చరణ్‌ను ఈత రాని గౌతమ్ గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరు ఊపిరాడక మునిగి మృతి చెందినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. తోటి స్నేహితులు పాలెంలో సమాచారం ఇవ్వడంతో అందరు నీటి గుంత వద్దకు చేరుకొన్నారు. సమాచారం అందుకొన్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టి స్థానికుల సహాయంతో మృత దేహాలను బయటకు తీశారు. తన వద్ద రూ.30లు తీసుకొని స్నేహితుడు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన తన కుమారుడు విగతజీవుడుగా మారడంతో గౌతమ్ తల్లి దండ్రులు వెంకటేశ్వర్లు, సుజాత గుండెలవిసేలా రోదించారు. నారాయణ, విజయల పెద్ద కుమారుడు చరణ్ మృతదేహంవద్ద తల్లి విజయ బోరున విలపించారు. అప్పుడే నూరేళ్లు నిండాయా అంటూ రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకొన్న కనిగిరి డీఎస్పీ ఎం.రామరాజు, పామూరు సీఐ ఎం.రామ నాయక్, ఎస్ఐ సైదుబాబు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మృతుల కుటుంబాలను ఓదార్చారు. ప్రమాదానికి కారణమైన నీటి గుంతను పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పంగులూరు, ఆగస్టు 10 : జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు (39) మృతి చెందారు. అందిన సమాచారం మేరకు మండలంలోని బైటమంజులూరు గ్రామానికి చెందిన సరికొండ నాగరాజు చిలకలూరిపేట నుంచి స్వగ్రామానికి చేరుకునేందుకు జాతీయ రహదారిపై స్టేజీ వద్ద బస్సు దిగారు. గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు దాటే ప్రయత్నంలో విజయవాడ వైపు నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆర్టీసీ ఇంద్ర బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. నాగరాజు బేలుదారి పనిచేస్తున్నారు. అతనికి భార్య శివ పార్వతి, తల్లి చిన ఆదెమ్మ ఉన్నారు.

కాంగ్రెస్ నేతకు తులసీరెడ్డి పరామర్శ

మర్రిపూడి, ఆగస్టు 10 : మండలంలోని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దేవరపల్లి సుబ్బారెడ్డి తల్లి అన్నమ్మ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఆపార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు మర్రెడ్డి తులసిరెడ్డి శనివారం గ్రామానికి వచ్చి సుబ్బారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు షేక్ సైదా, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లోనూ రద్దా..!

» బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు
» మారని ఆర్టీసీ అధికారుల తీరు



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, ఆగస్టు 10 : ప్రయాణికుల సేవలను మరిచి ఆర్టీసీ అధికారులు ఆదాయమే మిన్న అన్న విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఆషాడమాసం పేరుతో కలెక్షన్లు లేవని, పలు రూట్లలో తరచూ బస్సులను రద్దు చేసిన అధికారులు శ్రావణమాసం ప్రారంభమై పెళ్లిళ్ల సీజన్‌లోనూ అదే పంథాను కొనసాగిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బస్సుల రద్దుపై ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినా ఆర్టీసీ అధికారులు మాత్రం మా దారి మాదే అన్న విధంగా వ్యవహరిస్తుండడం పట్ల ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మిగిలిన డిపోలలో కొత్త రూట్లలో బస్సుల ఏర్పాటుపై ప్రయోగాలు చేస్తూ ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, అద్దంకి ఆర్టీసీ అధికారులు మాత్రం తరచూ బస్సుల రద్దు మీదనే కసరత్తు చేస్తూ రాష్ట్రంలోనే ప్రీ ప్లాన్స్ కేన్సిలేషన్ (పీపీసీ)లో ప్రథమ స్థానంలో నిలిచేందుకు కుస్తీ పడుతున్నారని ఆర్టీసీ సిబ్బందే గుసగుసలాడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామీణ రూట్లలో బస్సు సర్వీసులను క్రమేపీ కుదించుకుంటూ వచ్చిన ఆర్టీసీ అధికారులు ప్రధాన రూట్లలోనే అదేపంథాను కొనసాగిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రద్దు చేయాలనుకున్న రూట్లలో బస్సులను ముందుగా కొన్ని రోజులు నడపకుండా చేసి అనంతరం ప్రయాణికుల నుంచి ఆదరణ లేదన్న సాకు చూపించి రద్దు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రద్దు చేసే బస్సు సర్వీసుల వివరాలను కనీసం ముందస్తుగా నోటీసు బోర్డులో కూడా ఏర్పాటు చేయకపోవడంపట్ల ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రతి మంగళ, శుక్రవారాలలో వినుకొండ, పొదిలి సెక్టార్‌లలో ఒకొక్క బస్సు చొప్పున పూర్తిగా రద్దు చేస్తున్నారు. ఇక ఆదివారం వచ్చిందంటే కనీసం ఏడెనిమిది సర్వీసులు రద్దవుతున్నాయి. సింగిల్ రూట్ బస్సులు సైతం రద్దు చేస్తున్నారు. తాళ్లూరు సెక్టార్‌లో రెండు బస్సులు నడుస్తుంటే ఆదివారం రెండు బస్సులు రద్దు చేస్తున్నారు. జిల్లా కేంద్రం బాపట్లకు ఒకే ఒక్క బస్సు నడుస్తుండగా అదీ కూడా ఆదివారం ఉండదు. ఇలా అత్యధిక రూట్లలో తరచూ బస్సు సర్వీసులు రద్దు చేస్తుండడం పట్ల అటు ఆర్టీసీ సిబ్బంది, ఇటు ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తరచూ బస్సులు రద్దు చేయడాన్ని విరమించుకొని అన్ని బస్ సర్వీసులను నడుపుతూ ప్రయాణికుల నుంచి ఆదరణ పొందాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డీఎం రామ్మోహనరావు దృష్టికి తీసుకు పోగా ఆయా రోజులలో కొన్ని బస్సులకు ఆదాయం తక్కువ వస్తుండటంతో ఆయా సర్వీసులను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



ఘనంగా పోలేరమ్మ వార్షిక వేడుకలు

బల్లికురవ, ఆగస్టు 10: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో శనివారం పోలేరమ్మ తల్లి దేవాలయంలో వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా పోలేరమ్మ, పోతురాజు విగ్రహాలను ప్రత్యేకంగ ఆలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వార్షిక వేడుకల సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులు, గ్రామస్థులకు ప్రసాదాలను పంచిపెట్టారు.



వెంకయ్యకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కొండయ్య

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యకు స్వాగతం

చీరాల, ఆగస్టు 10 : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు శనివారం కారంచేడులో జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణకు హాజరయ్యేందుకు రైలు మార్గంలో చీరాల వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు రైల్వే స్టేషన్‌లో వెంకయ్యకు స్వాగతం పలికారు. వెంకయ్యకు ఎమ్మెల్యే కొండయ్య పూలబొకే అందజేసి, శాలువా కప్పి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అక్కడకు వచ్చిన వారిలో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరినీ వెంకయ్య పేరుపేరున పలుకరించారు. అనంతరం రోడ్డు మార్గంలో కారంచేడు వెళ్లారు.

రేపు సూక్తి సుధలు ఖండ కావ్యం ఆవిష్కరణ

అద్దంకిటౌన్, ఆగస్టు 10 : జానపద కళాపీఠం ఆధ్వర్యంలో రచయిత, చారిత్రక పరిశీలకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన సూక్తి సుధలు ఖండా కావ్యం ఆవిష్కరణ సోమవారం మధ్యాహ్నం శ్రీ ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో జరుగుతుందని జానపద కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు. దేవపాలన శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ కావ్యాన్ని మద్రాస్ యూనివర్సిటీ తెలుగుశాఖాధిపతులు విస్తాలి శంకరరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. సాహితీ వేత్తలు హాజరు కావాలని కోరారు.

పంగులూరు ఎస్‌ఐగా వినోద్‌బాబు

పంగులూరు, ఆగస్టు 10 : జె.పంగులూరు ఎస్‌ఐగా బీ వినోద్‌బాబు నియమితులయ్యారు. బాపట్ల ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న వినోద్‌బాబును ఇక్కడకు ఎస్‌ఐగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ కె.తిరుపతిరావును బాపట్ల జిల్లా నిజాంపట్నంకు బదిలీ చేశారు.

నూతన రోడ్డు నిర్మాణానికి పరిశీలన



రోడ్డు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేత, డ్రైనేజీ డీఈ

వేటపాలెం(చీరాల), ఆగస్టు 10 : మండల పరిధిలోని పొట్టిసుబ్బయ్యపాలెం మత్స్యకారులకు బోట్లు నిలుపుకునే ప్రదేశం వెళ్లే దారిలో పక్కా రోడ్డు నిర్మించేందుకు యువనేత డాక్టర్ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో టీడీపీ బృందం శనివారం స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు మహేంద్రనాథ్ బృందం డ్రైనేజీ డీఈ సుబ్బారావుతో కలసి మత్స్యకారులతో మాట్లాడారు. మత్స్యకారులు తమకు క్రీక్ ప్రదేశాన్ని అనువుగా మార్చేందుకు ఉన్న వనరులను వివరించారు. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా పొట్టి సుబ్బయ్యపాలెంలో పర్యటించిన సందర్భంగా గ్రామస్థులు తమ దృష్టికి తెచ్చిన సమస్యల్లో ఇదొకటన్నారు. ఈ నేపథ్యంలో ఆ సమస్య పరిష్కారానికి స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. సోమవారం పంచాయతీ, డ్రైనేజీ అధికారులు సంయుక్త పరిశీలన చేసిన అనంతరం మత్స్యకారులకు అనువుగా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతారన్నారు. కార్యక్రమంలో నాయకులు కంది అంజిరెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు.

పేదకు కుట్టు మిషన్ అందజేత

అద్దంకిటౌన్, ఆగస్టు 10 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద మహిళకు కుట్టు మిషన్‌ను అందజేశారు. శనివారం రోటరీ మాజీ అధ్యక్షుడు హాజీ సయ్యద్ మౌలాలి పుట్టిన రోజు సందర్భంగా క్లబ్ సభ్యులు దాసరి ఉమా గౌరి అనే పేద మహిళలకు జీవనాధారంగా ఉపయోగపడేలా కుట్టు మిషన్‌ను అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు.

ఎంపీడీవో బదిలీ

పంగులూరు, ఆగస్టు 10 : జె.పంగులూరు ఎంపీడీవో మ్యాథ్యూబాబు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం నుంచి జె.పంగులూరు ఎంపీడీవోగా మాథ్యూబాబు బదిలీపై వచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గుంటూరు జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో శనివారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

స్థల వివాదంలో వ్యక్తిపై పలువురు దాడి

» మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలింపు
» కాపాడాలని వేడుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు



అంబులెన్స్‌లో జవహర్



రక్షించాలని వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

చీరాలటౌన్, ఆగస్టు 10 : స్థలం వివాదంలో వ్యక్తిపై పలువురు దాడి చేశారు. మమ్మల్ని రక్షించాలంటూ బాధిత కుటుంబ మహిళలు వేడుకుంటున్నారు. చీరాల మండలం విజయనగర్‌కాలనీకు చెందిన తేళ్ల రవి, జవహర్ అన్నదమ్ములు. వారి తండ్రి హయాం నుంచి మరొకరి వద్ద చీరాల మునిసిపల్ పరిధిలోని మరియమ్మపేటలో సుమారు 89 సెంట్ల స్థలం కొనుగోలు చేసి అందులో ఐటీఐ కళాశాలను నడుపుతున్నారు. అయితే పేరాలకు చెందిన అంకమ్మరావు ఈ స్థలంలో కొంత స్థలం తనదంటూ శనివారం పెన్సింగ్ వేస్తున్నా రు. ఆ సమయంలో ఎప్పటిలాగే కళాశాలను ఓపెన్ చేసేందుకు వచ్చిన రవి కుమార్తెలు నాగలక్ష్మి, జ్యోత్స్నరాణి పెన్సింగ్ ఎందుకు వేస్తున్నారంటూ నిలదీశారు. వెంటనే తండ్రి రవికి సమాచారం అందించారు. ఆఘమేఘాల మీద వచ్చిన అన్నదమ్ములు రవి, జవహర్‌తో అంకమ్మరావు, కోటి ఆనంద్, శౌరి అనే ముగ్గురు వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. దీంతో గాయాలపాలైన జవహర్‌ను కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈ మేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకొన్నారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమను ఆదుకుని ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీని వేడుకుంటూ వీడియోను పోస్ట్ చేశారు. అయితే దీనికి కౌంటర్ కూడా హాస్పిటల్‌లో చేరినట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



ఈపూరుపాలెం (చీరాలటౌన్), ఆగస్టు 10 : ఈపూరుపాలెం స్టేషన్‌కు కూతవేటు దూరమైన జాతీయ రహదారి కుందేరు వెంబడి శుక్రవారం అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బీట్ పోలీసుల సహకారంతో ఈపూరుపాలెం స్టేషన్‌కు తరలించారు. దీంతో ఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్దకు హాజరుపరుస్తున్నట్లు సమాచారం. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేస్తున్న క్రమంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పిడుగుపాటుతో మృతి చెందిన పొటేళ్లు

పిడుగుపాటుకు ఎనిమిది పొట్టేళ్లు మృతి

అద్దంకి, ఆగస్టు 10 : పిడుగుపాటుకు 8 పొట్టేళ్లు, గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని మణికేశ్వరం సమీపంలో పొలాలలోకి కొరిశపాడు మండలం అనమనమూరుకు చెందిన చెన్నుపాటి సుబ్బారావు తన పొట్టేళ్లను మేత కోసం తోలుకెళ్లారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షం సమయంలో పిడుగుపడి సుమారు రూ.1.50లక్షల విలువైన 8 పొట్టేళ్లు, గొర్రెలు మృతి చెందాయి. పిడుగు పడ్డ సమయంలో గొర్రెల మందకు కొంచెం దూరంలో వేప చెట్టు కింద ఉన్న సుబ్బారావు ఎడమ చేయి కూడా నొప్పి జాలు వచ్చినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకున్నారు. పొట్టేళ్లు, గొర్రెలు మృతి చెందిన విషయాన్ని రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలిపారు.

ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



వేటపాలెం(చీరాల), ఆగస్టు 10 : వేటపాలెం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి వేటపాలెం పోలీస్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే మెరుగైన పోలీస్ చర్యలకు మార్గం సుగమం అవుతుందన్నారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అలానే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎవరైనా చర్యలు తప్పవన్నారు. నూతన ఎస్‌ఐకు స్టేషన్‌లోని ఇతర అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బల్లికురవ ఎస్‌ఐగా జీవీ



బల్లికురవ, ఆగస్టు 10 : బల్లికురవ ఎస్‌ఐగా జీవీ చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న రవి శంకర్‌రెడ్డిని ఎస్పీ వీఆర్‌కు పంపి యద్దనపూడి ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న జీవీ చౌదరిని బల్లికురవకు బదిలీ చేశారు. నూతన ఎస్‌ఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజలతో మైత్రీ బావం కొనసాగిస్తామన్నారు.

ఇంటిపై నుంచి వాటర్ ట్యాంక్ పడి బాలిక మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు.. అసియా (ఫైల్)

బల్లికురవ, ఆగస్టు 10 : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు ఇంటి పైన ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్ పడి షేక్ అసియా(12) అనే విద్యార్థి మృతి చెందింది. అందిన సమాచారం మేరకు.. వల్లాపల్లి ముస్లిం కాలనీకి చెందిన షేక్ నాగుల్ మీరా, సైదాబీ దంపతుల కుమార్తె ఏడో తరగతి చదువుతున్న అసియా ఇంటి ముందు కూర్చొని ఉండగా, ఇంటి పైన ఉన్న ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్ అసియాపై పడడంతో తీవ్ర గాయాలు పాలైంది. వెంటనే సంతమాగులూరు 108 సిబ్బంది నరసరావుపేటకు తరలించి అక్కడ చికిత్స అందిస్తుండగా బాలిక మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె ఇలా ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

బీహెచ్‌ఈఎల్‌కు ఆర్టీసీ బస్సు

ఇంకొల్లు, ఆగస్టు 10 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలు ఆర్ఎం సుధాకర్ సూచనలతో ఇంకొల్లు మీదగా హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఒంగోలు డిపో మేనేజరు బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నుంచి 8 గంటలకు బయలుదేరి నాగులుప్పలపాడు, రాచపూడి, దుద్దుకూరు, ఇంకొల్లు మీదగా పర్చూరు, చిలకలూరిపేట, మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు చేరుకుంటుందన్నారు. అదేవిధంగా బీహెచ్ఈఎల్ నుంచి రాత్రి 8.50గంటలకు ఒక సర్వీసు బయలుదేరుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ కోరారు.

వ్యవసాయ మోటార్ చోరీ

బల్లికురవ, ఆగస్టు 10 : మండలంలోని గంగవరంలో గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి కొమ్మాలపాటి రాజేష్ అనే రైతుకు చెందిన పొలంలో ఉన్న విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. శనివారం పొలానికి వెళ్లిన రైతు మోటార్ లేకపోవడంతో చూసి లబోదిబోమన్నారు.

బైకును ఢీకొన్న వాహనం

మేదరమెట్ల, ఆగస్టు 10 : జాతీయ రహదారిలో మేదరమెట్ల వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో శనివారం ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న చీమకుర్తి మండలం చంద్రపాడు గ్రామనికి చెందిన దానియేలుకు, బైక్‌పై ఉన్న మరో మహిళలకు గాయాలయ్యాయి. బాధితులను హైవే అంబులెన్స్‌లో మేదరమెట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

నేడు దేవస్థానం శతవార్షికోత్సవం

» గన్నవరంలో నేడు ప్రత్యేక పూజలు
» హాజరుకానున్న ఎమ్మెల్యే ఏలూరి



శ్రీగంగా కాశీ అన్నపూర్ణ సమేతవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, గోడపై శిలాశాసనం

యద్దనపూడి (మార్టూరు), ఆగస్టు 10 : అక్షరాలా ఈ నెల 7 వతేదీ బుధవారం నాటికి ఈ దేవస్థానం నిర్మాణం జరిగి వందేళ్లు పూర్తయింది. అందుకు సంబంధించి దేవస్థానం రాతిగోడలపై అప్పట్లో ఏర్పాటు చేసిన శాసనం ఇప్పటికీ మనకు కన్పిస్తుంది. ఆదివారం దేవస్థాన నిర్మాణ వంశకర్తలు శత వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో కాళహస్తి వంశస్తులు కాళహస్తి పిచ్చయ్య, వెంకట రమణమ్మ దంపతులు 1924 ఆగస్టు 7న శ్రీగంగా కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానాన్ని నిర్మించారు. అప్పటి నుంచి వారి వంశస్తులు దేవస్థానంలో ధూపదీప నైవేద్య పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. దేవస్థానం ధర్మకర్త కాళహస్తి హరిబాబు నేతృత్వంలో ఆదివారం దేవస్థానంలో యజ్ఞయాగాదులతోపాటు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వందేళ్లు సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడానికి దేవస్థానం వారు ఏ ర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని హరిబాబు తెలిపారు.



సిండికేట్ ప్రతినిధులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న జేసీ

రాతపూర్వక హామీని అమలు చేయండి

సిండికేట్ అధికారులకు జేసీ ఆదేశం

మేదరమెట్ల, ఆగస్టు 10 : సిండికేట్ ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ బి. సుబ్బారావు ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సిండికేట్ ప్రతినిధులు గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు గత పదేళ్లగా సిండికేట్ ఫ్యాక్టరీ వలన పడుతున్న ఇబ్బందులను ఆయన వివరించారు. కోరుతో కొంత మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్యం కన్నా ఏది ముఖ్యం కాదన్నారు. తాము ఫ్యాక్టరీకి వ్యతిరేకం కాదని, కోరు వలనే తాము అంత ఇబ్బంది పడి ఫిర్యాదు చేస్తున్నామని, ఇది భరించలేని స్థితికి వచ్చిందన్నారు. పలువురు మహిళలు ఇంటి ఆరు బయట ఐదు నిమిషాలు కూర్చోలేక పోతున్నామన్నారు. ఫ్యాక్టరీ ఇదే విధంగా నడిస్తే తాము గ్రామం వదలి వెళ్ళాల్సి వస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, పశువులు, పర్యావరణం, ఆరోగ్యం ముఖ్యమని, ఆ తరువాతే మిగతావని అన్నారు. అభివృద్ధిలో భాగంగా మనం ఉపయోగించే వస్తువులు, వస్త్రాలు, ఆహార పదార్థాలు ఎ క్కడో ఒక చోట తయారయ్యేవేనన్నారు. వీటి వలన కూడా వ్యర్థాలు వస్తాయన్నారు. పరిమితికి మించి వచ్చే వ్యర్థాలను అనుమతించేది లేదన్నారు. ప్రతివారం పొల్యూషన్ బోర్డు అధికారులు ఫ్యాక్టరీని పరిశీలిస్తారని తెలిపారు. సెప్టెంబరు 15నాటికి పొల్యూషన్ రాకుండా తీసుకుంటామన్న చర్యలు పూర్తి చేయాలన్నారు. మిరపకాయలు పొడి చేసే విభాగాన్ని ముందుగా ఆపివేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి తదితర అధికారులతో పాటు సిండికేట్ కంపెనీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు, మద్దాళి సంజీవరావు, చావా రాజేష్, రవ్వవరపు బ్రహ్మయ్య, పోకూరి హరి, శంకర్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పేదరికం చదువుకు అడ్డుకాకూడదు

ప్రభుత్వ స్కూళ్లలో మంచి బోధన : ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఆగస్టు 10 : చక్కగా చదువుకొని, ఉన్నత స్థానాలకు ఎదిగిన వారికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వస్తుందని, పేదరికం చదువుకు అడ్డుకాకూడదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం మార్టూరు, వలపర్ల జడ్పీ హైస్కూలులో వంద మంది బాలికలకు ఏకం యూఎస్ఏ, ఎఫర్ట్, వీజీఎస్ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఏలూరి హాజరై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ స్కూల్లో కార్పొరేట్ విద్యను అందించేలా ప్రణాళికలు తయారుచేస్తున్నారన్నారు. పేద మధ్య తరగతి బాలికలు స్కూల్‌కు వచ్చేందుకు సైకిల్‌ను కొనుగోలు చేసే స్థాయిలేక ఏకంగా చదువులు మానేసిన వారు ఉన్నారన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. తాను కోనంకి నుంచి సెకెండ్‌హ్యాండ్ సైకిల్‌తో వలపర్ల హైస్కూల్‌లో చదివేందుకు వచ్చానన్నారు. దూరప్రాంతాల నుంచి స్కూలుకు వచ్చే బాలికలు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వినియోగించుకోవాలని ఏలూరి సూచించారు. వలపర్ల హైస్కూల్లో బాలికలకు టాయ్‌లెట్ రూమ్‌ను ఏర్పాటు చేసిన సంస్థలను అభినందించారు. ముందుగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వలపర్లలో తొలుత ఎన్‌సీసీ విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన విద్యార్థులకు నోటు పుస్తకాలను, కలములను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, ఏకం యూఎస్ఏ ఆర్గనైజర్ సుద్దమాల అర్చనకుమారి, డాక్టరు సుధాకర్, హెచ్ఎం నిర్మలా దేవి, నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్ పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు




ఆవిర్భావ దినోత్సవ వేడుకలల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)తో విద్యారంగంలో సమస్యలకు పరిష్కారం దొరికిందని నాయకులు, హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అద్దంకిలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణంలో యూటీఎఫ్ జండాను నాయకులు కేవీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ మండల ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మందికి పైగా సభ్యత్వం కలిగిన ఏకైక సంఘం యూటీఎఫ్ అన్నారు. అప్రెంటీస్ విధానం రద్దు, సీపీఎస్ రద్దు వంటి పలు పోరాటాల్లో ముందంజలో ఉంటుందన్నారు. సంఘ స్వర్ణోత్సవ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు రామారావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు వినుకొండ సుధాకర్, దామా రామాంజనేయులు, డీవీ రత్నం, బీ చంద్రశేఖర్, సాంబశివరావు, మస్తాన్‌వలి, కృష్ణారావు, శ్రీధర్, కోటేశ్వరరావు, దేవరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్టూరు : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా శనివారం మార్టూరులో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి కందిమళ్ల రవిబాబు జెండాను బండారు ఆదినారాయణ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం యూటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు,మండల ప్రధాన కార్యదర్శి పోపూరి సునీల్ కుమార్, అట్లూరి ప్రశాంత్, మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి, సంతమాగులూరు నాయకులు పాల్గొన్నారు.



మార్టూరులో జెండాను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు



సోమశిలకు 11,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, ఆగస్టు 10: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి 15.733 టీంఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలి పారు. ఎగువ నుంచి 11,290 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా దిగువ డెల్టా 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వ్యవసాయానికే పెద్ద పీట



చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయ రంగానికే పెద్ద పీట వేస్తోందని, ఈ విషయాన్ని అధికారులు గుర్తించి రైతుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి నారాయణ సూచించారు. అధికారులు మండల సమావేశాలకు తప్పకుండా హాజరు కావాలని, ఆ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, అలాగే వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకునేందుకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం అన్ని మండల కేంద్రాల్లో శీతల గిడ్డంగులు నిర్మాణానికి, ఉద్యాన పంటల్లో కొబ్బరిని జోడించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో కొబ్బరి సాగు పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంట కాలువల్లో పూడిక తీత తీయిస్తామని, ఆయకట్టు స్థిరీకరణ చేపడతామని నారాయణ స్పష్టం చేశారు.

- మంత్రి నారాయణ



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన మరో మంత్రి నారాయణ, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

ఖరీఫ్‌లో ప్రతి ఎకరాకూ సాగునీరు ఇస్తాం!

అవినీతిని పట్టించుకోండి



సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ కెనాల్స్ పేరుతో వైసీపీ నాయకులు కోట్ల రూపాయల అవినీతి చేశారు. ఒక్క పార మన్ను కూడా ఎత్తకుండా రూ.18 కోట్లు తినేశారు. మంత్రులు, కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకోవాలి. వైసీపీ నాయకుల అవినీతి వల్ల కాలువలు బాగు పడ లేదు. 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు చెందిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. హౌసింగ్, ఎన్ఆర్ ఈజీఎస్‌లలోనూ అవినీతి జరిగింది. బండేపూడి కెనాల్ టెండర్లు పిలిచి ఎనిమిదేళ్లు దాటుతున్నా పనులు మొదలు కాలేదు. ఇంకెప్పుడు చేస్తారు. వెంటనే ఆ టెండర్‌ను రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలి. ఉద్యాన పంటలపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన వ్యయం కన్నా 2019-24లో చేసిన వ్యయం 40 శాతానికి మించి లేదు. ఇలా ఎందుకు జరిగిందో అధికారులు తెలపాలి.

- సోమిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే



- సాగునీటి ఇబ్బందులు రానీయొద్దు!
- ఇరిగేషన్ అధికారులతో మంత్రి ఆనం



ఇరిగేషన్ ఇంజనీర్లతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

'సోమశిల' రక్షణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి!

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 10 : సోమశిల జలాశయం రక్షణ పనులను యుద్ధప్రాతి పదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. అలాగే జిల్లాలో సాగునీటి పంపిణీ వ్యవస్థను మెరుగుపరచి రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతి, సాగునీటి కాలువల స్థితిగతులపై సోమశిల, కండలేరు, తెలుగుగంగ ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులతో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్‌లతో కలిసి మంత్రి ఆనం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ సోమశిలకు నీళ్ల వచ్చేలోగా ఆప్రాన్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కాంట్రాక్టర్ చేత పనులు వేగవంతం చేయించాలని సూచించారు. సోమశిల అభివృద్ధి పనులకు సరిపడా ఇసుకను ముందుగానే సిద్ధం చేసుకుని స్టాకుపాయింట్‌లో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పంట కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు మొదలుపెట్టి రైతాంగానికి సాఫీగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెన్నానది గతంలో దెబ్బతిన్న కట్టలను గుర్తించి ఇసుక బస్తాలు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పూడ్చాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా ఈ పని జరిగిపోవాలని సూచించారు. సోమశిల జలాశయం రక్షణ పనులను యుద్ధ ప్రాతి పదికన చేపట్టాలని ముఖ్యంగా గేట్ల రోప్, హెడ్‌రెగ్యులేటర్ పనుల మంజూరుకు సంబంధించి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, ఆర్థికశాఖ కార్యదర్శులతో మంత్రులు ఆనం, నారాయణలు ఫోన్‌లో మాట్లాడి త్వరగా అనుమతులు ఇప్పించాలని కోరారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగొండ్ల రామకృష్ణ, ఇరిగేషన్ ఎస్ఈలు రమణారెడ్డి, బీవీ.రమణారెడ్డి, కృష్ణమోహన్, డిప్యూటీ కలెక్టర్లు ప్రేమ్ కుమార్, చిన్నఓబులేసు, డీఎఫ్ఓ చంద్రశేఖర్, ఆత్మకూరు ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కలిసి రండి: మంత్రి ఆనం పిలుపు

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల సమస్యల పట్ల జడ్పీటీసీ, ఎమ్పీటీసీ సభ్యులు చొరవ తీసుకోకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. మండల స్థాయి సమావేశాలలో స్థానిక సమస్యలపై చర్చలు జరగాలని అక్కడ నుంచి జడ్పీ సమావేశానికి ఆ అంశాలను తీసుకొని రావాలని సూచించారు. గడిచిన రెండేళ్లుగా మంచి పరిపాలనే ఇచ్చాము కదా అంటే ముందు వరుసలో కూర్చున్న ఎమ్మెల్యేలంతా మారే వారు కాదన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి కాంట్రాక్టరు, ఎంపీ ఒక్కరే అని ఆయన పనులు ఆపేసి వెళ్లిపోయారన్నారు. ఇవాళ ఆ బాధ్యత టీడీపీ ప్రభుత్వంపై పడిందన్నారు. గతంలో ఇరిగేషన్ మినిస్టర్ రివర్స్ టెండర్ తెచ్చింది తానేనంటూ అసెంబ్లీలో జెబ్బలు చరుచుకొని మాట్లాడారని, రివర్స్‌టెండర్ వల్ల ప్రభుత్వానికి 28 శాతం నిధులు మిగిలాయన్నారని అయితే పని జరిగిందా అంటే గతం కంటే ప్రస్తుతం రెండింతలు ఎస్టిమేషన్ పెరిగిందని చెప్పారు. 'తెలుగు గంగ కాలువ రాకపోవడంతో మీ ప్రాంతంలో రైతులు ఎంత నష్ట పోయారో డక్కిలి, వెంకటగిరి, బాలయ్యపల్లి జడ్పీటీసీ, ఎమ్పీటీసీలు ఆలోచించాలి. ఐదేళ్లలో ఎందుకు ఆ పనులు చేయలేక పోయామో సమాధానం చెప్పాలి. గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి అందరూ పని చేయం డి. మిగిలిపోయిన పనులను కనీసం రానున్న రెండేళ్లలో పూర్తి చేసేలా కష్టపడాలి. వచ్చేది వర్షాకాలం రైతాంగ సమస్యలు పరిష్కరించ డంలో అంతా కలిసి ముందుకు రావాలి. మూడేళ్ల క్రితం సోమశిల ప్రాజెక్ట్ గేట్లు, పక్కనే ఉన్న సోమేశ్వర స్వామి ఆలయం విగ్రహం కిలోమీటరు కొట్టుకు పోతే పట్టించుకో లేదు. సోమశిల బాగు చేయాలని పదే పదే కోరితే నన్ను అనర్హుడును చేశారే తప్ప గత ప్రభుత్వం సోమశిలను బాగుపరచడంలో ఒక్క ఆలోచన కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండవ వారమే ఇరిగేషన్ శాఖ మంత్రిని జిల్లాకు తీసుకువచ్చి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలిసి సోమశిలకు వెళ్లి ప్రాజెక్టు మరమతులు చేయాలని కోరాము. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించుకొని రూ.9 కోట్ల నిధులు ముఖ్యమంత్రి ఆదేశాలతో మంజూరు చేసేందుకు రికార్డులు సిద్ధం చేశాం. ఇవాళ వైసీపీ వైఫల్యాలను ఎత్తి చూపాలంటే సాయంత్రం 6 గంటల వరకు చెబుతానే ఉంటా"న్నారు.

నెల్లూరు (ఆంధ్రజ్యోతి/ స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 10 : శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిండుగా కనిపించింది. హుందాగా సాగింది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరు ణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణలతో సహా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. నీటిపారుదల శాఖపైనే ప్రధాన చర్చ జరగ్గా, ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టులోని ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యంగా పని చేయాలని సమావేశం తీర్మానిం చింది. పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన విద్యాకమిటీల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైసీపీ జడ్పీటీసీ, ఎంపీపీలు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిలు డీఈఓపై విరుచుకుపడ్డారు. వివిధ అంశాలపై మంత్రు లు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు మాట్లాడారు. అధిక శాతం మంది సభ్యులు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, సబ్సిడీపై వ్యవ సాయ పనిముట్లను సామూహికంగా కాకుండా వ్యక్తిగతంగా ఇవ్వాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వైసీపీ వర్సెస్ డీఈవో

కాగా, మంత్రులు, ఎమ్మెల్యేలు సోమశిల ప్రాజెక్ట్‌పై అధికారుల సమావేశానికి వెళ్లడంతో జడ్పీ సమావేశ మందిరం అధికంగా వైసీపీ జడ్పీటీసీ, ఎమ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్సీలతో నిండిపోయింది. ఈ క్రమంలో విద్యా శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు అసలు డీఈవో ఫోన్ కూడా లిఫ్ట్ చేయరంటూ మండిపడ్డారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయుల అడ్జస్ట్‌మెంట్లు, నూతన భవన నిర్మాణాలు, కేఎస్ఆర్ పాఠశాలలో గోడ కూలి విద్యార్థి మృతి అంశాలపై ప్రశ్నిం చారు. డీఈవో రామారావు సమాధానం ఇస్తుండగా ఒక్క ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పలేకు న్నారంటూ ఆగ్రహించారు. అదే సమయంలో మరో ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి స్కూల్ కమిటీ ఎన్ని కల్లో అవకతవకలు జరుగుతున్నా ఎందుకు స్పందించ లేదని డీఈవోను ప్రశ్నించారు. వెంటనే జడ్పీ చైర్‌పర్సన్‌ఆనం అరుణమ్మ సైతం తాను ఫోన్ చేసినా మీరు లిఫ్ట్ చేయడం లేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీరు (డీఈవో) విధులు సక్రమంగా నిర్వ హించడం లేదని, ప్రభుత్వం మీకు ఊరికే జీతాలు ఇస్తుంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా వైసీపీ నాయకులు, డీఈవో మధ్య అర్ధగంట పాటు వాడివేడి వాదనలు జరిగాయి. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆయకట్టు స్థిరీకరించండి



ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి ఆయకట్టు ఆధారంగా సోమశిల జలాలు కేటాయించడం వల్ల కావలి ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఇంకా నెల్లూరులోని మాగుంట లే అవుటుతో సహా పలు ప్రాంతాలు ఆయకట్టు జాబితాలో ఉన్నట్లు నీటిని కేటాయిస్తు న్నారు. నిజంగా నెల్లూరు నగరంలో వ్యవసాయం చేస్తు న్నారా? ఇవన్నీ ఏనాడో నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌లుగా మారిపోయాయి. కానీ అధికారులు మాత్రం అక్కడ ఆయకట్టు ఉన్నట్లు నీటిని కేటాయిస్తున్నారు. మరోవైపు కావలి డివిజన్‌లో ఆయకట్టుకు నీరు అందక పొలాలు బీడుబారు తున్నాయి. వ్యవసాయం జరిగే చోట నీళ్లు ఇవ్వకుండా నగరంగా మారిన ప్రదేశాల పేరుతో నీటిని వృథా చేయడం తగదు.

- కావ్య కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే



ఏ సమస్య ఉన్నా తెలపండి!

జిల్లాకు సంబంధించి కేంద్రంలో ఏ సమస్య పెండింగ్‌లో ఉన్నా, ప్రజలకు సంబంధించిన ఏ పని అవసరం ఉన్నా తన దృష్టికి తెస్తే దాని సాధనకు కృషి చేస్తానని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. ప్రజలకు సేవ చేయడానికే ఎంపీగా వచ్చానని, తనను ఉపయోగించుకోవాలని జడ్పీటీసీ, ఎంపీపీ, ఎమ్మెల్యేలను కోరారు. జిల్లా అభివృద్ధి కోసం తాను చేసే ప్రయత్నంలో ప్రజాప్రతినిధులంతా సహకరించాలని కోరారు.

- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు ఎంపీ



'అల్తూరుపాడు' పనులు చేస్తారా!? లేదా!?

అల్తూరుపాడు రిజర్వాయర్ కోసం రైతుల నుంచి 250 ఎకరాల భూమి సేకరించారు. ఇంకా ప్రాజెక్టు కట్టలే. రైతులకు పైసా కూడా పరిహారం ఇవ్వలేదు. ఇటు నగదు అందక, అటు సేద్యం చేయలేక ఆ రైతులను బతకమంటరా!? చావమంటారా!? ఆ కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి. పెండింగ్ బిల్లులను నిలుపుదల చేయాలి.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే



'రాళ్లపాడు'కు మోక్షం ఎప్పుడు?

రాళ్లపాడు ప్రాజెక్టు ఇప్పటికి రెండు సార్లు తెగిపోయింది. ఈసారి కూడా గేట్లు ఎత్తాలంటే భయపడే పరిస్థితి ఉంది. వెంటనే ఈ గేట్లకు స్టాప్‌లాక్ అయినా బిగించాలి. మోపాడు చెరువు నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

దంపతుల మధ్య మద్యం చిచ్చు

ఎంతో సంతోషంగా ఉన్న ఆ కుటుంబంలో మద్యం చిచ్చు రేపింది. మద్యానికి బానిస అయిన భర్తను అప్పులు చేయవద్దని, మద్యం తాగొద్దని భార్య బతిమలాడినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో విసిగిపోయిన ఆ ఇల్లాలు బలవన్మరణానికి పాల్పడింది. ఇది తెలుసుకున్న భర్త భార్య మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తూ వేగంగా వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దంపతుల మరణంతో వారి ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు. శనివారం నెల్లూరులో జరిగిన ఈ ఘటన సంచలనం రేపింది.

- తాగుడుకు బానిసైన భర్త.. మానుకోవాలని భార్య వేడుకోలు
- చివరకు ఉరి వేసుకుని ఇల్లాలు ఆత్మహత్య
- ఇది తట్టుకోలేక రైలు కింద పడి భర్త బలవన్మరణం
- నెల్లూరు నగరంలో విషాదం

నెల్లూరు (క్రైం), ఆగస్టు 10 : ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కె నాగరాజు (23), సురేఖ (19) నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. నాగరాజు మార్బుల్, టైల్స్ పనులు చేస్తుండగా, సురేఖ ఓ బ్యూటీపార్లర్‌లో బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. వీరికి మూడేళ్లు, 11 నెలల ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతోషంగా సాగుతున్న వారి కుటుంబంలో మద్యం మహమ్మారి ప్రవేశించింది. మద్యానికి బానిసైన నాగరాజు సంపాదనంతా మద్యం సేవించడానికే ఖర్చు చేసేవాడు. అక్కడితో ఆగక పలుచోట్ల మద్యం కోసం అప్పులు చేసేవాడు. దీంతో కుటుంబ భారం సురేఖపై పడింది. అప్పులు చేయవద్దని, మద్యం మానేయాలని పలుమార్లు భర్తకు నచ్చజెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. అంతేగాక పుట్టినింటి నుంచి డబ్బులు తీసుకురావాలని భార్యపై నాగరాజు ఒత్తిడి చేసేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం పని నిమిత్తం నాగరాజు బయటకు వెళ్లగా సురేఖ ఇంట్లో ఉరి వేసుకుంది. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు దీప్తి, సురేష్‌లు హుటాహుటిన ఇంటివద్దకు చేరుకుని ఆమెను కిందకు దించి రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. అప్పటికే సురేఖ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. భార్య ఆత్మహత్య చేసుకుందన్న విషయం తెలుసుకున్న నాగరాజు హాస్పిటల్ వద్దకు వెళ్లి కన్నీరుమున్నీరయ్యాడు. అక్కడ నుంచి పరుగులు తీసుకుంటూ విజయమహల్ గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సురేఖ ఆత్మహత్యపై సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఎస్ఐ విజయ్ శ్రీనివాస్, నెల్లూరు తహసీల్దార్లు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి దీప్తి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నాగరాజు ఆత్మహత్య ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.



మృతి చెందిన నాగరాజు, సురేఖ (ఫైల్)

ఎక్కడి వాళ్లు అక్కడే!

ఎంపీడీవోలను యథాస్థానాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు

నెల్లూరు (జడ్పీ): ఎన్నికల విధుల కోసం జిల్లా నుంచి తాత్కాలిక బదిలీపై వెళ్లిన ఎమ్పీడీవోలను యథాస్థానాలకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికలకు ముందు 31 మంది ఎమ్పీడీవోలను ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావ టంతో బదిలీపై వెళ్లిన వారందరినీ జిల్లాకు పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వారిలో 25 మందికి గతంలో పనిచేసిన మండలాలనే కేటాయిస్తూ జడ్పీ సీఈవో కన్నమ్మనాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెం.	ఎంపీడీవో పేరు	కేంద్రం
1.	పీవీ.నరసింహారావు	బుచ్చిరెడ్డిపాళెం
2.	ఎం.బ్రహ్మయ్య	కొండాపురం
3.	బి.సింగయ్య	డీవీ సత్రం
4.	ఎం.గోపి	సంగం
5.	పి.ప్రవీణ్	ఆత్మకూరు
6.	ఎం. భాస్కర్	ఏఎస్‌పేట
7.	ఎ.మధుసూదనరావు	అనంతసాగరం
8.	కె.నాగేంద్రబాబు	ఇందుకూరుపేట
9.	కె.ప్రత్యూష	ముత్తుకూరు
10.	జి. వెంకటేశ్వర్లు	మనుబోలు
11.	వివి. సూర్యసాయి	చిల్లకూరు
12.	ఎం. భవాని	కోట
13.	కె. సాలేట్	చిట్టమూరు
14.	కె.సురేష్‌బాబు	పెళ్లకూరు
15.	పి.ప్రసన్నకుమారి	డక్కిలి
16.	ఎ.ప్రమీలా రాణి	సూళ్లూరుపేట
17.	టి. నాగేష్ కుమారి	పొదలకూరు
18.	పి.నాగమణి	మర్రిపాడు
19.	ఏవీ.సుబ్బారావు	బోగోలు
20.	ఎం.శ్రీహరి	కోవూరు
21.	పి.సుబ్రహ్మణ్యం	కొడవలూరు
22.	వి.రజనీ కాంత్	ఓజిలి
23.	కేవీ. కోటేశ్వరరావు	వెంకటగిరి
24.	కే.గోవర్ధన్	కలువాయి
25.	కె.వెంకటేశ్వరరావు	గూడూరు

మాలకొండ ఆదాయం

రూ. 12,44,608

వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 12,44,608 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.4,66,500, అన్నదానం ద్వారా రూ.3,59,463, లడ్డూ ప్రసాదం రూ.2,08,555, తలనీలాలు రూ.69,950, రూము అద్దెలు రూ.36,410, విరాళాలు ద్వారా రూ.33,100 కుంకుమార్చన రూ.28,480, అష్టోత్తరం టిక్కెట్లు రూ.12,850, వివాహాలు రూ.13 వేలు తదితరాల ద్వారా ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.

నెట్టర నెట్టు .. హైలెస్సా..!

- ఉదయగిరి డిపోలో మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు
- సెల్ఫ్, డీజిల్ లేక, టైరు పంక్చర్లతో ఆగిపోతున్న ప్రగతి చక్రాలు
- సమయానికి గమ్యానికి చేరుకోని ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ ఉన్నతాధికారులు


సెల్ఫ్ లేకపోవడంతో బస్సును నెట్టుతున్న ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు (ఫైల్)

ఉదయగిరి రూరల్ : ఆర్టీసీ బస్సు చార్జీలను మూడుసార్లు పెంచిన గత వైసీ పీ ప్రభుత్వం బస్సుల నిర్వహణ ను మాత్రం గాలికొదిలేసింది. డొ క్కు బస్సులను సైతం రోడ్డెక్కించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడింది. నాటి నిర్లక్ష్యం నేటికీ వెంటాడుతోంది. బస్సుల నిర్వహణ సరిగా లేకపోవడంతో తరుచూ స మస్యలతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోలో కొన్ని బస్సులకు సెల్ఫ్ లేక ప్రయాణికులు, సిబ్బంది తోయ్యాల్సిన దుస్థితి నెలకొంది. మరికొన్ని బస్సుల టైర్లు తరుచూ పంక్చర్లు అవుతుండడంతో డ్రైవర్ల అప్రమత్తతో ప్రమాదం నుంచి ప్రయాణికులు బయట పడుతున్నారు. బస్సులకు అద్దాలు, డోర్లు లేకపోవడం, వర్షాల కురుస్తున్న సమయంలో ఉరుస్తుండడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల హైదరాబాదు వెళ్లిన సూపర్‌లగ్జరీ బస్సు తిరుగు ప్రయాణంలో డీజిల్ అయిపోవడంతో ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించిన సంఘటనలూ ఉన్నాయి. డిపో నుంచి ఇతర రాష్ట్రాలకు నిత్యం వందలాది ప్ర యాణికులు రాకపోకలు సాగిస్తునా సౌకర్యాలు మాత్రం కరువయ్యాయి.

● డొక్కు బస్సులతో అవస్థలు..

ఉదయగిరి డిపోలో 61 ఆర్టీసీ, 6 అద్దె బస్సులు ఉన్నాయి. ప్రతిరోజు అవి 27,105 కిలోమీటర్ల తిరుగుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. ఉదయగిరి-సీతారామ పురం, ఉదయగిరి- బద్వేల్, ఉదయ గిరి- కావలి మార్గాల్లో తిరుగు బస్సులు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. కొన్ని బస్సులకు సీట్లు ఊడడం, డోర్లు, కిటికీలకు అద్దాలు లేకపోవడంతో పాటు వర్షం కురిస్తే బస్సులు పూర్తిగా ఉరుస్తున్నాయి. కొన్ని బస్సులు తప్పుపట్టి ఉన్నాయి. కాలం చెల్లిన బస్సులను సైతం తిప్పుతున్నారని విమర్శలున్నాయి.


మార్గమధ్యంలో టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్, కండక్టర్ అవస్థలు (ఫైల్)

● అధ్వానంగా బస్‌షెల్టర్

ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్ మందుబాబులు, యాచకులకు అడ్డాగా మారింది. బస్సుల కోసం ప్రయాణికులు రోడ్డుపైన ఎండ, వానకూ తడుస్తూ వేచి చూస్తున్నారు. అధికారులు స్పందించి బస్సులు కండిషన్‌లో ఉంచడంతో పాటు బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకరావాలన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

అనంతసాగరం, ఆగస్టు 10: ఉద్యాన పంటల సాగుపై గౌరవరం రైతులకు శనివారం అధికారులు అవగాహన కల్పించారు. మిర్చి, బొప్పాయి, నిమ్మ సాగులో వేరుకుళ్లు, వైరస్, రసంపీల్చే పురుగుల నివారణ చర్యలు, తెగుళ్లు సోకిన సమయంలో వాడాల్సిన మందుల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త నారాయణ స్వామి, మండల వ్యవసాయాదికారి రాజశేఖర్ ఉన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: ఈ నెల 19న అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షణకు ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి 18వ తేదీన ఉదయం 8గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస రావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రానుపోను ఒక్క వ్యక్తికి రూ.1650లు చార్జీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ సర్వీసు ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మీదుగా కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్ చూపించుకొని అనంతరం అరుణాచలంకు వెళుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాల కోరారు.

వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి

● ఏబీసీడబ్ల్యూవో శ్రీదేవి

ఆత్మకూరు, ఆగస్టు 10: ప్రభుత్వ కాలేజీ హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించేందకు ప్రత్యేక దృష్టి సారించామని ఏబీసీడబ్ల్యూవో ఎం.శ్రీదేవి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల కాలేజీ హాస్టల్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. వసతిగృహాల్లోని విద్యార్థినుల సంరక్షణ బాధ్యతలను హాస్టల్ సంక్షేమ అధికారులు, సిబ్బందితో పాటు వారి తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు వారి తల్లిదండ్రులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో సునీత, లెక్చరర్ శిరీష పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకల నిధులు పెంపుపై హర్షం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: రాష్ట్రప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిధులు పెంచడంపై టీడీపీ రాష్ట్ర కార్య దర్శి మన్నేటి వెంకటరెడ్డి శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 34ఏళ్ల తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌క ల్యాణ్ వేడుకల కోసం పంచాయతీలకు నిధులు పెంచడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మైనర్ పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేలు ఇవ్వడం హర్షణీయమన్నారు.

వసతిగృహాలను మూసివేయడం దారుణం

విద్యార్థులు లేరన్న నెపంతో పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతిగృహాలను మూసివేయడం దారుణమని మన్నేటి వెంకటరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం బాలిలక వసతిగృహాన్ని మూసివేసేందుకు అధికారులు చర్యలు చూస్తున్నట్లు వాపోయారు. పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు వ్యవసాయ కాలేజిలకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజు విద్యార్థులు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారిని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి వసతిగృహాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు

శిథిలావస్థలో పాఠశాలల భవనాలు


కొరిమెర్ల పాఠశాల స్లాబు దుస్థితి

సంగం, ఆగస్టు 10: కొరిమెర్ల ప్రభుత్వఉన్నత పాఠశాల శిథిలమై స్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. 1960లో సుమారు 12గదులను నిర్మించారు. వర్షం వస్తే గదులు ఉరుస్తున్నాయి. ఎప్పుడు కూలుతుందో.. ఏ ప్రమాదం ముంచుకుస్తుందో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనంతసాగరం: బొమ్మవరం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. బిల్డింగ్ పైకప్పు పెచ్చులూడి ఇనుప కడ్డీలు తేలడంతో నిత్యం భయం గుప్పిట్లో తరగతులను కొనసాగిస్తున్నారు. నాడు-నేడు కింద రెండోవిడతలో నిధులు మంజూరు కాలేదని ఉపాధ్యాయులు వాపోయారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


ఆత్మకూరు: ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో యూటీఎఫ్ నేతలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు కంబాల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వపాఠశాలలకు ప్రమాదకరంగా మారిన 117జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. ఆరికంగా నష్టపోయిన ఉద్యోగులకు నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు దస్తగిరిఅహ్మద్, ఫణిరాజ్, మున్నా, కరీం, ఖాదర్‌బాషా, సుబ్బారెడ్డి, అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయంలో సంఘం నాయకులు ఉద్యమ పతాకాన్ని ఎగువవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు శ్రీరాములు, లక్కు కృష్ణప్రసా ద్, జిల్లా కార్యదర్శి గంగాధర్, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామపురం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ నాయకులు ప తాకావిష్కరణ చేసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. జీఓ నెం.117రద్దు చేయాలని కో రారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, పేరాల శ్రీనివాసులు, మ హేష్, వెంకటేశ్వర్లు, ప్రసాదు, పవిత్ర కుమారి,విజయ్ కుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి


● ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ

వింజమూరు, ఆగస్టు 10: ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి నియోజకవర్గం నుంచి మాదిగలు తరలిరావాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ పిలుపునిచ్చారు. వింజమూరులో శనివారం ఎంఎస్పీ సీనియర్ నాయకులు బెజవాడ బాలగురవయ్య మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నియోజకవర్గస్థాయి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ అంశంపై సానుకూల తీర్పు రావడంతో మాదిగల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. గత 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఈ తీర్పు అని కొనియాడారు. విజయం సాధించి ఢిల్లీ గడ్డ నుంచి తెలుగు నేలపై అడుగు పెడుతున్న మంద కృష్ణమాదిగ విజయోత్సవ ర్యాలీకి రాష్ట్ర జిల్లా నలుమూలల నుంచి మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, సీనియర్ యద్దనపూడి రమణయ్య, నాయకులు గొల్లపల్లి మోహన్‌రావు మాదిగ, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రిమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నందిపోగు వెంగశరావు, ఎంఎస్పీ మండల అధ్యక్షులు బొర్రా వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల రహదారులకు మోక్షం

- నందవరం- పోలిరెడ్డిపల్లి వరకు పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రజలు

మర్రిపాడు, ఆగస్టు 10: మండలంలోని గ్రామాల రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనా రాయణరెడ్డి గ్రామాల్లోని రోడ్ల నిర్మాణాలకు రూ.5కోట్లను మంజూరు చేయించారు. అధికారులు వాటి నిర్మాణాలు టెండర్లు పిలిచారు. అందులో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రా రంభించారు. అందులో భాగంగా నందవరం నుండి పోలిరెడ్డిపల్లి వరకు 16కిలో మీటర్ల రోడ్డు పనులు ప్రారంభించటంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వీటితోపాటు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతుల కోసం మరో రూ1.51 కోట్లు మంజూరయ్యాయి. రాజులపా డు-పెగళ్లపాడు రోడ్డుకు రూ.29లక్షలు, నెర్దనంపాడు-భీమవరం, పొంగూరు, కండ్రిక రహదారులకు రూ.23లక్షలు, కంపస ముద్రం-వెంకటాపురం రోడ్డుకు రూ.20లక్షలు, చాబోలు-వెంకటాపురం రోడ్డుకు రూ.18లక్షలు, సిగణపల్లి-నాగినేనిగుంట రోడ్డుకు రూ.16లక్షలు, చాబోలు-బ్రాంహ్మణ పల్లి రోడ్డుకు రూ.8లక్షలు, బ్రాహ్మణపల్లి ఎస్సీకాలనీ రోడ్డుకు రూ.7లక్షలు, కంపసముద్రం-బెడుసుపల్లి రోడ్డుకు రూ.6లక్షలు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు మరమ్మతులకు ఈ నెల 10న అధికారులు టెండర్లు పిలువను న్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ప్రయాణ కష్టాలు తీరనున్నాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేసు న్నారు.


రోడ్డుపై జరుగుతున్న కంకర పనులు



వానొస్తే ఇదీ పరిస్థితి..!

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: పట్టణంలో చిన్నపాటి వర్షానికే వీధులు, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలు వర్షపు నీటితో నిల్వ చేరి బురదమయంగా మారుతున్నాయి. రెండురోజుల కిందట కురిసిన ఓ మోస్తారు వర్షానికి తహసీల్దారు కార్యాలయ ఆవరణం బురదమయంగా మారింది. అధికారులు, సిబ్బంది, ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాలాజీనగర్, పంచాయతీ బస్టాండ్, గండిపాళెం మార్గంలోని ప్రధానరోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటుంది.

← బురదమయంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణం

బాలాజీనగర్‌లో రోడ్డుపై వర్షపు నీరు



కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


అన్నెబోయినపల్లి వద్ద గుంతలు పడిన పంచాయతీరాజ్ తారు రోడ్డు

అధ్వానంగా రహదారులు

● ప్రజలు, వాహనదారుల అవస్థలు

లింగసముద్రం, ఆగస్టు 10: మండలంలోని పలు గ్రామాలలోని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా లింగసముద్రం నుంచి వలేటివారిపాలెం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు, వీఆర్ కోట నుంచి తాతాహోటల్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు, అన్నెబోయినల్లి నుంచి అంగిరేకులపాడు వరకు, విశ్వనాధపురం నుంచి వీఆర్ కోట వరకు, గంగపాలెం నుంచి తిమ్మారెడ్డిపాలెం వరకు, ముత్యాలపాడు నుంచి ముత్తంవారిపాలెం వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లపై తారు, కంకర లేచిపోయి గుంతలుపడి అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్ల అభివృద్ధి పట్టించుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కందుకూరు: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న నేతలు, ఉపాధ్యాయులు


కావలి: యూటీఎఫ్ జెండా ఆవిష్కరణలో నేతలు

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కందుకూరు, ఆగస్టు 10: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కందుకూ రులోని దాచూరి రామిరెడ్డి విజ్ఞాన్ భవన్‌లో యూనియన్ నాయకులు, ఉపాధ్యాయుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. యూటీఎఫ్ సీనియర్ నేత ముప్పరాజు కోటేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబో యే రోజుల్లో యూటీఎఫ్ నేతలు, కార్యకర్తలు సమస్యలపై పోరాటం చేయా లని నిర్దేశించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి వెంకటేశ్వర్లు, ఎం మాధవరావు, ఎం హనుమంతరావు, జి మాధవరావు, ఎస్ శాంతకు మారి, తదితరులు పాల్గొన్నారు.

కావలి టౌన్: స్థానిక కోర్టువీధిలోని యూటీఎఫ్ కార్యాలయ ఆవరణలో సంఘం జెండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం ట్రంకురోడ్డులో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు మాధవ, శ్రీదేవి, జీ వేణు, ముజీబ్, జీ మురళీ, సీనియర్ నాయకులు ఆకుల రమణయ్య, సిద్ధిక్, ప్రసాద్ పాల్గొన్నారు.


లింగసముద్రం: యూటీఎఫ్ జెండాకు వందనం చేస్తున్న ఉపాధ్యాయులు

లింగసముద్రం: ఉపాధ్యాయుల హక్కుల సాధనకు యూటీఎఫ్ పోరాటం చేస్తోందని ఆ శాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు తెలిపారు. యూటీఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం లింగసముద్రంలో కామ్రేడ్ కూరపాటి రమేష్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు టి సరోజిని, టి సుధాకర్ రావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కందుకూరు, ఆగస్టు 10: మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ శనివారం కందుకూరులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రమణమ్మ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధి ఎన్నో రెట్లు పెరిగినప్పటికీ నేటికీ మున్సిపాలిటీ ఆవిర్భవించినప్పుడు ఉన్న కార్మికులనే కొనసాగిస్తున్నారని, కార్మికుల సంఖ్యను పెంచకపోవటంతో పనిభారం ఎక్కువై ఆ ప్రభావం పారిశుధ్యం నిర్వహణపై పడుతున్నదని తెలిపారు. అలాగే చెత్తబండ్లు రిపేరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పులి నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ, మహేష్, పోతురాజు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాణపురం-అన్నెబోయినపల్లి రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనుల ప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న గుత్తేదారు టీడీపీ నేత మనోహర్

లింగసముద్రం, ఆగస్టు 10: సార్వత్రిక ఎన్నికలకు మూడు నెలల ముందు మండలంలోని సత్యనారాయణ పురం-అన్నెబోయినపల్లి గ్రామాల మధ్య నిలిపివేసిన పంచాయతీరాజ్ రోడ్డు పనులను అధికారులు, గుత్తేదారు తిరిగి శనివారం ప్రారంభించారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధికి అప్పటి జిల్లా కలెక్టర్ ఉపాధిహామీ పథకం కింద రూ.40 లక్షలు మంజూరు చేశారు. దీంతో అప్పటి గుత్తేదారు ఈ రోడ్డుపైన ఉన్న తారు, కంకర లేపి రోడ్డును రోలింగ్ చేసి అనంతరం పనులను నిలిపివేశారు. ఇటీవల ఈ విషయాన్ని చినపవని టీడీపీ నేత సోంపల్లి మనోహర్, గ్రామస్థులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా పనులను తిరిగి ప్రారంభించాలని ఆయన పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. దీంతో మండల పీఆర్ ఏఈ గోపిచంద్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌రాజ్, టీడీపీ నేత, గుత్తేదారు మనోహర్ ఇతర టీడీపీ నేతలు పూజలు చేసి రోడ్డు పనులను ప్రారంభించారు.

16న లక్ష కుంకుమార్చన పూజలు

● పత్తి వీరబ్రహ్మయ్య స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న పత్తి వీరబ్రహ్మయ్య స్వామి

కావలి, ఆగస్టు 10: లోక కల్యాణార్థం రాజువారి చింతలపాలెం విజయదుర్గ ఆస్థాన పీఠంలో ఈ నెల 16న శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆస్థాన పీఠం వ్యవస్థాపకులు పత్తి వీరబ్రహ్మయ్యస్వామి తెలిపారు. పట్టణంలోని జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో బ్రహ్మయ్య స్వామి మాట్లాడారు. వరలక్ష్మీవ్రతంలో భాగంగా ఈ పూజలను 30ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విశిష్టత కలిగిన పూజలలో పాల్గొనేందుకు కావలి, పరిసరప్రాంతాల ప్రజలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు పూజసామగ్రిని ఆలయం తరుపున ఉచితంగా అంజేస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రెజరర్ చంద్రమౌళి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గడ్డం కోటారెడ్డి వర్ధంతి సభ

● కావలికి విరసం నేతలు

కావలి, ఆగస్టు 10: విప్లవ కెరటం కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి 50వ వర్ధంతి సభ ఆదివారం ఉదయం పట్టణంలోని పాతూరు కృష్ణుడి బొమ్మసెంటర్‌లోని దొడ్లవారి స్థలంలో నిర్వహించనున్నట్లు కోటారెడ్డి స్మారక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విరసం నాయకుడు కల్యాణరావు అధ్యక్షతన జరిగే ఈ సభలో వర్తమాన రాజకీయాల గురించి విరసం నేత నల్లూరి రుక్మిణీ, ప్రజాస్వామ్యం- రూపం, సారం అనే అంశంపై విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్, పెరుగుతున్న ఫాసిజం ప్రమాదం అనే అంశంపై వీక్షణం సంపాదకులు ఎస్. వేణుగోపాల్ ప్రసంగిస్తారన్నారు. అనంతరం ప్రజా కళామండలి, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

అల్లూరు, ఆగస్టు 9: గ్రామీణాభివృద్ధిపై కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన తరగతుల్లో ఎంపీడీవో జ్యోతి తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామీణాభివృద్ధిపై చేపట్టాల్సిన అంశాలపై కార్యదర్శులు, సర్పంచులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

లింగసముద్రం, ఆగస్టు 10: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో లింగసముద్రం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలోని బందెలదొడ్డి పక్కన విద్యుత్‌శాఖ అధికారులు 100 కేవీ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం, లోవోల్టేజి సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశంతో శనివారం కందుకూరు ఏడీఈ విజయ్‌బాబు, మండల ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు, అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ

కందుకూరు, ఆగస్టు 10: శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని యాచకులు, సంచార జాతులకు చెందినవారికి ఆహారం ప్యాకెట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీచేశారు. మాచవరం ప్రవీణ్‌కుమార్, లావణ్య దంపతుల కుమార్తె మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, మీనిగ సురేష్‌బాబు, మాధవి పాల్గొన్నారు.

13న చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

కందుకూరు, ఆగస్టు 10: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 13న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ నాయకులు వర్ల దేవదాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం సాగించి విజయం సాధించిన మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలకటం, వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు కృతజ్ఞతలు తెలపటమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, మాదిగ యువతీ యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు, ఉద్యోగులు భారీగా తరలిరావాలని కోరారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయానికి శంకుస్థాపన

కలిగిరి, ఆగస్టు 10: స్థానిక పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం తిప్పలో ఏర్పాటు చేయనున్న అయ్యప్ప స్వామి ఆలయానికి వేదపండితులు సూర్యనారయణాచార్యులుచే ఆదివారం శంకస్థాపన పనులు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అయ్యప్ప భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

పంద్రాగస్టు వేడుకల నిర్వహణ నిధుల పెంపుపై హర్షం

కొండాపురం, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు పంచాయతీలకు నిధులు పెంచడంపై సర్పంచులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో చిన్నపంచాయతీలకు రూ.100, పెద్ద పంచాయతీలకు రూ.250 మాత్రమే నిధులు వాడుకునేందుకు వీలుండేదన్నారు. ఈ నగదు ఏమాత్రం సరిపోక పోవడంతో సర్పంచులు తమ స్వంత నిధులను ఖర్చు చేస్తుండేవారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంద్రాగస్టు వేడుకల నిర్వహణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూ.10వేలు, రూ.25 వేలకు పెంచడం అభినందనీయమని గుడవళ్లూరు సర్పంచ్ బద్దిపూడి మాచెర్ల అన్నారు.

మినీమిల్క్ డెయిరీ ప్రారంభం

సంగం, ఆగస్టు 10: మండలంలోని సి ద్దీపురం సమీపంలో నిర్మించిన మల్లి మిల్క్ డెయిరీని శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. మి ల్క్ డెయిరీ సామర్థ్యం గురించి మంత్రి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దీనితో కొంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లి, వారి కుటుంబ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, ఆనం ప్రసాద్ రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్‌బాబు పాల్గొన్నారు.